




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI








బుధవారం | 1-4-2020 | పేజీలు: 8 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 347 | శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి తె. 3.41 వరకు తదుపరి నవమి; నక్షత్రం: ఆరుద్ర రా. 7.30 తదుపరి పునర్వసు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.44; అమృతఘడియలు: ఉ. 9.11-10.50; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore


# వాయిదాల్లో వేతనం!

## ఉద్యోగులకు 50 శాతమే చెల్లింపు.. ఏఐఎస్ అధికారులకు 60 శాతం కోత

రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణ సర్కారు తరహాలో ఉద్యోగుల వేతనాలను వాయిదా పద్ధతుల్లో చెల్లించాలని నిర్ణయించింది. కరోనా నేపథ్యంలో ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని... వనరులు కూడా సన్నగిల్లాయని తెలిపింది. మరోవైపు... కరోనాపై పోరు కోసం వైద్య రంగంపై భారీ స్థాయిలో ఖర్చు పెట్టాల్సి వస్తోందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో జీతాలు, పెన్షన్లలో కోత పెడుతున్నట్లు మంగళవారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని జీవో జారీ చేశారు.



- మిగిలిన మొత్తం తర్వాత చెల్లింపు
- ప్రజా ప్రతినిధులకు పూర్తిగా నిలిపివేత
- జీవో జారీ చేసిన ప్రధాన కార్యదర్శి
- కొత్తగా వేతన బిల్లులు పంపాలని ఆదేశం
- నిధులున్నా తెలంగాణ తరహాలో నిర్ణయం
- ఆ సొమ్ముతో అత్యవసర చెల్లింపులు?

రూ.వెయ్యి ఇచ్చేందుకు 1300 కోట్లు

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వేతనాల చెల్లింపునకు వాయిదా పద్ధతి అనుసరించనున్నారు. సీఎం నుంచి స్థానిక సంస్థల వరకు అన్ని స్థాయిల ప్రజా ప్రతినిధులకు ఈ నెల జీతం చెల్లించరు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారుల జీతంలో 60 శాతం కోత పెట్టారు. మిగిలిన ఉద్యోగులకు 50 శాతం మాత్రమే చెల్లిస్తారు. నాలుగో తరగతి


మిగతా 3వ పేజీలో...







## 'ఈఎంఐ'లకు బ్యాంకులు ఓకే

- జూన్ తర్వాతే తిరిగి చెల్లింపుల ప్రక్రియ
- ఈసీఎస్ రద్దుకు రిక్వెస్ట్ పంపాల్సిందే
- క్రెడిట్ కార్డులకు చక్రవడ్డీ తప్పదు
- మినిమం బ్యాలెన్స్ చెల్లించడం మంచిది
- చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లపై కోత


6


# ఆపరేషన్ మర్కజ్

## వైరస్ వ్యాప్తికి కేంద్రంగా నిజాముద్దీన్!

- ఆధ్యాత్మిక సమావేశాలకు వేల సంఖ్యలో
- 19 రాష్ట్రాలు, 16 దేశాల ప్రతినిధులు
- కరోనా పాజిటివ్‌లలో 'ఢిల్లీ కనెక్షన్'
- హాజరైన వారి పేర్లు రాష్ట్రాలకిచ్చిన కేంద్రం
- అందర్నీ గుర్తించి క్వారంటైన్ చేసే ప్రక్రియ
- ఢిల్లీలో కొత్తగా 24 కేసులు నమోదు
- అందరూ మర్కజ్‌కు వెళ్లిన వారే...
- ఇతర రాష్ట్రాల్లోనూ భారీగా వెలుగులోకి

న్యూఢిల్లీ, మార్చి 31: దేశంలో కరోనా వ్యాప్తికి ఢిల్లీలోని 'నిజాముద్దీన్' ప్రధాన కేంద్రంగా మారినట్లు గుర్తించారు. మార్చి 1వ తేదీ నుంచి అక్కడ జరిగిన సమావేశాల్లో 19 రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొన్నారు. 16 దేశాల నుంచి మత పెద్దలు హాజరయ్యారు. వీరిలో... కరోనా తీవ్రంగా ప్రబలిన దేశాలకు చెందిన వారూ ఉన్నారు. తబ్లీగ్-ఏ-జమాత్ అనే సంస్థ నిర్వహించిన ఈ సమావేశాలకు బృందాలుగా ప్రయాణించి, బృందాలుగానే బస చేసిన వారిలో అనేక మందికి కరోనా 'పాజిటివ్'గా నిర్ధారణ అయ్యింది. ఆ తర్వాత వీరంతా తమ సొంత


మిగతా 8వ పేజీలో...


*కరోనా కలకలం పెరుగుతోంది. ఢిల్లీలో రాజుకున్న వైరస్ వేడి గల్లీలకు చేరింది. తాజాగా కరోనా సోకిన వారిలో అత్యధికులు 'మర్కజ్' సమావేశాల్లో పాల్గొన్న వారే కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సదస్సుకు వెళ్లిన వారందరినీ గుర్తించే ప్రక్రియ సాగుతోంది.*



## రాష్ట్రంలో ఒకేరోజు 33 కేసులు

### తెలంగాణలో మరో 15 మందికి పాజిటివ్

- అత్యధికంగా పశ్చిమలో 12 మందికి పాజిటివ్
- ప్రకాశం జిల్లాలో 8 మందికి కరోనా నిర్ధారణ
- గుంటూరులో ఐదుగురు, విశాఖలో నలుగురు
- అనంతలో 2, 'తూర్పు', కృష్ణాజిల్లాల్లో ఒక్కొక్కరు
- బాధితుల్లో అత్యధికులు ఢిల్లీ వెళ్లొచ్చినవారే
- పశ్చిమలో 9 కేసుల ఫలితం కోసం ఎదురుచూపు
- రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 56

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. మంగళవారం ఒక్కరోజే 33 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. సోమవారం రాత్రి వరకూ వీటిసంఖ్య 23 మాత్రమే కాగా వారిలో ఇద్దరు డిశ్చార్జ్ కూడా అయ్యారు. ఇప్పుడు కొత్తగా నమోదైన కేసులతో ఏపీలో


మిగతా 7వ పేజీలో...


65 ఏళ్ల వృద్ధుడు

### కరోనాను జయించాడు

విశాఖలో తొలి కొవిడ్ పేషెంట్ డిశ్చార్జి

మక్కా వెళ్లొచ్చిన తర్వాత వైరస్ బారిన వృద్ధుడు

## వారెవరో కనుక్కోండి

- తబ్లీగ్‌కు హాజరైనవారి వివరాలు సేకరించండి
- తక్షణమే ఐసొలేషన్, క్వారంటైన్‌కు పంపండి
- వారంతా స్వచ్ఛందంగా వైద్యులను కలవాలి
- ప్రతి ఇంటి గుట్టూ పట్టండి
- పట్టణాలు, నగరాలపై మరింత దృష్టి పెట్టాలి
- పల్లె ప్రజల స్వీయ నియంత్రణ భేష్
- పట్టణాల్లో ప్రజలు సహకరించడం లేదు
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి జగన్

### స్వీయ నిర్బంధంలో 30,693 మంది: మంత్రి



అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దేశరాజధానిలోని నిజాముద్దీన్‌లో తబ్లీగ్-ఏ-జమాత్ సదస్సుకు ఎవరెవరు హాజరయ్యారో వెంటనే వివరాలు సేకరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వారు ఎవరెవరితో కలిశారో కూడా తక్షణమే తెలుసుకుని వారందరికీ వైద్య పరీక్షలు చేయాలని.. క్వారంటైన్, ఐసొలేషన్ కేంద్రాలకు తరలించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్న సమయంలో కొత్తగా 17 కేసులు నమోదయ్యాయని.. వీరిలో నిజాముద్దీన్ సదస్సుకు హాజరైనవారు, వారి కుటుంబ సభ్యులు, బంధువులే ఎక్కువని తెలిపారు. తబ్లీగ్‌కు హాజరై వచ్చినవారంతా స్వచ్ఛందంగా వైద్యులను కలసి క్వారంటైన్ కేంద్రాల్లో చేరాలని పిలుపిచ్చారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కరోనా నివారణపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన


మిగతా 7వ పేజీలో...


| ప్రభావిత దేశాలు | అమెరికా | ఇటలీ | చైనా | స్పెయిన్ | జర్మనీ | ఇరాన్ | బ్రిటన్ | ఇండియా | ప్రపంచం | తెలంగాణ | ఏపీ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| మంగళవారం నమోదు | 12,730 | 4,053 | 79 | 6,461 | 1,295 | 3,110 | 3,009 | 146 | 52,357 | 15 | 33 |
| మరణాలు | 3,431 | 12,428 | 3,305 | 8,269 | 682 | 2,898 | 1,789 | 35 | 41,239 | 06 | 0 |
| బాధితులు | 1,76,518 | 1,05,792 | 81,518 | 94,417 | 68,180 | 44,605 | 25,150 | 1,397 | 8,37,016 | 91 | 56 |

వరల్డోమీటర్ ప్రకారం మంగళవారం రాత్రి 11.30 గంటలకు..

## రాష్ట్రంలోనూ గరీబ్ కల్యాణ్ బీమా


7

ఆరోగ్య కార్యకర్తలకు 50 లక్షల బీమా


3

'సెట్స్' దరఖాస్తుల గడువు పొడిగింపు




అమెరికాలోని లాస్‌వేగస్‌లో ఏదిక్కూ లేనివారి కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో పడుకునేందుకు సిద్ధమవుతున్న స్థానికులు

## ఆగని మృత్యుహేల

- 40 వేల మరణాలు.. 8.2 లక్షలకు పైగా కేసులు
- స్పెయిన్‌లో విలయం.. ఒక్క రోజులో 849 మంది మృతి
- ఇటలీలో లాక్‌డౌన్ పొడిగింపు.. జాతీయ పతాకం అవనతం
- ఇరాన్, బెల్జియం, నెదర్లాండ్స్‌లో భారీగా మరణాలు
- బ్రిటన్‌లోనూ బతుకుతారనుకున్న వారికే వెంటిలేటర్లు


8


### హెచ్ 1బీ గుబులు

- భారతీయులకు కష్టకాలమే
- అమెరికాలో లక్ష ఉద్యోగాలు గల్లంతే
- గడువును 60 నుంచి 180కి పెంచాలి
- వీసాదార్ల విజ్ఞప్తి.. ట్రంప్ సర్కార్‌కు లేఖ



## విస్తృతంగా పరీక్షలు చేయాలి

- బాధితులకు సరైన చికిత్స అందించాలి
- అనుమానితులను ఐసొలేషన్‌లో ఉంచాలి
- పరీక్షల కిట్లు ఎన్ని ఎక్కువుంటే అంత మంచిది
- లేకపోతే లాక్‌డౌన్ నిరుపయోగమవుతుంది
- ప్రస్తుతం వైద్యులను కాపాడుకోవాలి

'ఆంధ్రజ్యోతి'తో కేంద్ర ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి సుజాతారావు


2


గమనిక: కరోనా వ్యాప్తి, లాక్ డౌన్ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' టాబ్లాయిడ్‌ను మెయిన్ పేజీల్లో కలిపి ఇస్తున్నాం. ప్రధాన పత్రికలోని I, II, III, IV పేజీలను టాబ్లాయిడ్ ఫుల్ అవుట్‌గా తీసుకోవచ్చు.



## వలంటీర్ల సర్వే ఉత్తిదేనా?

### ఆశావర్కర్ల శ్రమ వారి ఖాతాలోకి!!

- కరోనా భయంతో ఇంటింటికీ వెళ్లి రేషన్ ఇవ్వనివారు రోగ లక్షణాలపై సర్వే చేస్తున్నారా?
- మంత్రి కొడాలి వ్యాఖ్యలతో సరికొత్త సందేహం.. క్షేత్రస్థాయి సర్వే చేస్తోంది ఆరోగ్య సిబ్బందే!
- ఆశాలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఇంటింటి సర్వే జరుపుతున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన వట్టి డొల్లేనన్న ఆరోపణలు రేగుతున్నాయి. వైరస్ నియంత్రణ కోసం.. పేదలకు ప్రజాపంపిణీ సరుకులను ఇంటింటికీ వెళ్లి అందించలేకపోతున్నామని స్వయంగా పౌరసరఫరాల మంత్రి కొడాలి నాని చెబుతుంటే.. కరోనా బాధితులను, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించేందుకు వలంటీర్లు ఇంటింటి సర్వే చేపడుతున్నారని ముఖ్యమంత్రి జగన్, ప్రభుత్వ పెద్దలు పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. అసలు వలంటీర్లు


మిగతా 7వ పేజీలో...


## ఈ పరీక్షలు చాలవు



- ఇంకా ఎక్కువ చేస్తేనే తీవ్రత బయటపడుతుంది
- విదేశాల నుంచే 30 వేల మంది వచ్చారు
- ఇతర రాష్ట్రాల నుంచీ చాలా మంది రాక
- ఇప్పటికి 700 మందికే పరీక్షలు
- వైరస్ సోకిన వారిని గుర్తించి వేరుచేయాలి
- 49 రోజులు లాక్‌డౌన్ చేస్తేనే ఫలితం: బాబు


3



పరంజ్యోతి

## అభయప్రదాత.. శ్రీరామచంద్రుడు



సాధుసజ్జనులను పరిరక్షించడానికి, దుష్టులను శిక్షించడానికి శ్రీ మహావిష్ణువు స్వీకరించిన అవతారాల్లో ముఖ్యమైనది రామావతారం. ఒక మనిషిలో ఎన్నెన్ని మంచి గుణాలు ఉండడానికి అవకాశం ఉందో రామావతారం ద్వారా శ్రీరామచంద్రుడు మనకు తెలియపరిచాడు. మనిషి తన ప్రవర్తన ద్వారా తోటి మానవుల, సకల జీవరాశుల, సమస్త దేవతల ఆదరాభిమానాలను ఎలా పొందవచ్చో ఆచరించి చూపించాడు. తనను ఆశ్రయించినవారికి, శరణువేడినవారికి అభయప్రదానం చేసి వారిని ఆపదల నుంచి గట్టెక్కించడంలో శ్రీరామునికి సాటియైన వేరొక దైవం లేదు. రామాయణంలోని యుద్ధకాండలో విభీషణుడికి అభయప్రదానం చేసే సందర్భంలో తన స్వభావాన్ని, ఆశ్రితులను రక్షించే తన అసాధారణ లక్షణాన్ని శ్రీరామచంద్రుడు ఇలా చెప్పాడు.

*సకృదేవప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే*
*అభయం సర్వభూతేభ్యో దదామ్యేతత్ వ్రతం మమ*

"ఎవరైనా నా వద్దకు వచ్చి 'నన్ను రక్షించు, నేను నీవాడను' అని ఒక్కసారి పేర్కొన్నంత మాత్రముననే నేను వారికుండే భయాలను, తాపత్రయాన్ని (ఆధ్యాత్మిక, ఆదిదైవిక, ఆదిభౌతికములనే మూడు విధాలైన తాపాలను), ఆపదలను, పాపాలను పోగొట్టి వారికి అవసరమైన సంపదలను, యోగక్షేమాలను శ్రేయస్సును అందిస్తూ రక్షిస్తాను. ఇది నా దీక్ష" అని రామచంద్రుడు ప్రతిజ్ఞాపూర్వకంగా చెప్పాడు. 'శ్రీరామచంద్రా.. నీ భార్యను అపహరించిన రావణుని తమ్ముడికి అభయం ఇవ్వవద్దు' అని సుగ్రీవుడు మొదలైనవారు చెప్పినా, 'నేను నా ధర్మాచరణను, స్వజనుల రక్షణను ఎప్పటికీ వదలను' అని రాముడు స్థిరంగా చెప్పాడు.

ఆశ్రమవాసులైన మహర్షులందరూ శ్రీరాముని వద్దకు వచ్చి.. రాక్షసుల వల్ల తమకు కలుగుతున్న బాధలను వివరించి, రక్షించాలని వేడుకున్నారు. అప్పుడు సీతాదేవి రాముడితో.. 'రాక్షసులు మనకు ప్రత్యక్షంగా ఎటువంటి హానీ తలపెట్టలేదు కదా. అట్టి రాక్షసులతో యుద్ధం చేయడం తగదు' అని సూచించింది. అందుకు రాముడు అంగీకరించలేదు.

*అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే!*
*సలక్ష్మణామ్ న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య*

..'ధర్మ పరిరక్షకుడనైన నేను ఋషులకు అభయప్రదానం చేశాను. ప్రాణాలనైనా వదులుకుంటాను. నా ప్రాణాల కంటే ఎక్కువ ప్రియమైన నిన్ను.. నా బహిఃప్రాణమైన, నాకు కుడిభుజమైన లక్ష్మణుని అయినా వదులుకుంటానుగానీ.. ఇచ్చినమాట తప్పను' అని వివరించాడు. ఇలా ఎందరికో అభయమిచ్చి ఆర్తత్రాణ పరాయణుడు, ఆపదోద్ధారకుడు, ఆపద్బాంధవుడు, అభయప్రదాత, సత్యవాక్య పరిపాలకుడు, ప్రతిజ్ఞాపాలకుడిగా ఎన్నో బిరుదాలను సొంతం చేసుకున్నాడు. పురుషోత్తముడైన ఆ శ్రీరాముని సద్గుణాలు మనందరికీ అవశ్యం ఆదర్శనీయం. పాటించినవారి జన్మ చరితార్థం.

**- సముద్రాల శఠగోపాచార్యులు, 98483 73067**

## లోకం తీరు



మద్యం కావాలని పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నాడని ఈ వేషం వేసుకొచ్చా. వదినా..

# చమురు కంపెనీల విరాళం వెయ్యి కోట్లు

### అత్యధికంగా ఓఎన్‌జీసీ రూ.300 కోట్లు.. ఐఓసీ రూ.225 కోట్లు.. రూ.105 కోట్లు అందించిన ఎల్‌ఐసీ

- ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ చెరో రూ.100 కోట్లు
- పీఎం-కేర్స్ నిధికి విరాళాల వెల్లువ

ముంబై/న్యూఢిల్లీ, మార్చి 31 : కరోనా వైరస్‌పై భారత్ జరుపుతున్న పోరుకు అండగా నిలిచేందుకు అన్ని రంగాల ప్రముఖులు, ఎన్నో కంపెనీలు మేము సైతం అంటూ ముందుకొస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలకు విరాళాలను అందిస్తున్నాయి. దేశీయ చమురు కంపెనీలు పీఎం-కేర్స్ నిధికి రూ.1,031 కోట్ల విరాళాలు అందించాయి. ఇందులో ఓఎన్‌జీసీ(రూ.300 కోట్లు), ఐఓసీ(రూ.225 కోట్లు), బీపీసీఎల్(రూ.175 కోట్లు), హెచ్‌పీసీఎల్(రూ.120 కోట్లు), పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ(రూ.100 కోట్లు), గెయిల్(రూ.50 కోట్లు), ఆయిల్ ఇండియా లిమిటెడ్(రూ.38 కోట్లు) ఉన్నాయి. దీనికి అదనంగా ప్రభుత్వరంగ చమురు కంపెనీల ఉద్యోగులు మరో రూ.61 కోట్ల విరాళాన్ని పీఎం-కేర్స్‌కు అందించారని పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్ చేశారు. మరోవైపు దేశంలోని టాప్-1000 కంపెనీలూ ముందుకురావాలని కేంద్రం ఆయా కంపెనీలకు లేఖలు రాసింది. ప్రధాని సహాయ నిధికి రూ.105 కోట్ల విరాళం అందించామని ఎల్ఐసీ చైర్మన్ ఎం.ఆర్.కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ ఉద్యోగులు 2 రోజుల వేతనం రూ.100 కోట్లను పీఎం సహాయనిధికి అందజేశారు. భారతీ ఎయిర్‌టెల్ రూ.100 కోట్ల విరాళం ప్రకటించింది. - ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్(ఇఫ్కో) రూ.25 కోట్లు, దాల్మియా భారత్ గ్రూప్ రూ.25 కోట్లు, కల్యాణి గ్రూప్ రూ.25 కోట్లు, పిరమాల్ గ్రూప్ రూ.25 కోట్లు, చైనా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం షావోమి రూ.15 కోట్లు చొప్పున విరాళాలు అందించాయి. నేషనల్ హైవే అథారిటీ ఉద్యోగులు, ఐటీబీపీ సిబ్బంది, రాజ్యసభ ఉద్యోగులు, సిబ్బంది ఒకరోజు వేతనాన్ని ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల భార్య అనుపమ రూ. 2 కోట్లు అందజేశారు. ఎంపీల్యాడ్స్ నుంచి రూ.కోటి చొప్పున ఇవ్వడానికి 250 మంది ఎంపీలు అంగీకరించారు. వెంటిలేటర్లు, మాస్కుల తయారీకి సాంకేతిక సాయం అందిస్తామని ఆర్సెలార్ మిట్టల్ కంపెనీ ప్రకటించింది. నటులు నానా పాటేకర్, విక్కీ కౌశల్ రూ.కోటి చొప్పున, గాయని లతా మంగేష్కర్ రూ.25 లక్షలు అందించారు.



ప్రధాని మోదీతో తల్లి హీరాబెన్(ఫైల్)

### ప్రధాని మాతృమూర్తి రూ.25వేల విరాళం

పీఎం కేర్స్ నిధికి ప్రధాని మోదీ తల్లి హీరాబెన్ రూ.25వేల విరాళం అందించారు. తన వ్యక్తిగత పొదుపు ఖాతా నుంచి ఈ మొత్తాన్ని ఆమె అందించారంటూ ఏఎన్ఐ వార్తా సంస్థ ట్వీట్ చేసింది. ఆమె దాతృత్వంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపించారు. 'హీరాబెన్ వయసు 95 ఏళ్లు. అత్యవసరాల కోసం వ్యక్తిగత ఖాతాలో కూడబెట్టుకున్న డబ్బులను ఆమె దేశం కోసం ఇచ్చేశారు. మరి మనం ఎందుకు ఇవ్వకూడదు?' అని ఓ నెటిజన్ వ్యాఖ్యానించాడు.

## కొనసాగుతున్న 'సాయం'

- పీఎంఆర్ఎఫ్‌కు గవర్నర్ నెల జీతం
- సీఎంఆర్ఎఫ్‌కు లక్ష ఇచ్చిన హరిచందన్
- 5 కోట్లు అందచేసిన దివీస్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కరోనా నియంత్రణ చర్యల కోసం సీఎం, పీఎం సహాయ నిధికి మంగళవారం విరాళాల సమకూరాయి. ఈ కష్ట కాలంలో దాతలు ప్రభుత్వాలకు అండగా నిలవాలని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పిలుపునిచ్చారు. సీఎం సహాయ నిధికి లక్ష రూపాయలు, పీఎం సహాయ నిధికి తన నెల జీతం విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నిని కలిసిన దివీస్ లేబొరెటరీస్ లిమిటెడ్ ప్రతినిధులు రూ.5 కోట్లు, ఎన్‌సీసీ లిమిటెడ్ ప్రతినిధులు రూ.కోటి విరాళంగా అందించారు. సీఎం, పీఎం సహాయ నిధికి చెరో రూ.5 లక్షలు చొప్పున పాపులర్ షూ మార్టు మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి విజయ్ కుమార్ ఇచ్చారు. వివిధ పౌల్ట్రీ అసోసియేషన్లు, నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్(ఎన్ఈసీసీ-నెక్) కమిటి ప్రతినిధులు రూ.60 లక్షల చెక్కును మంత్రి మోపిదేవికి అందచేశారు. జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక్కో తెలుగు రాష్ట్రానికి రూ.10 లక్షల చొప్పున ఇస్తున్నట్లు తెలిపింది.

### విద్యుత్ ఉద్యోగుల సాయం రూ.7.87 కోట్లు

ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ సంస్థల ఉద్యోగులు రూ.7.87 కోట్లు విరాళం ప్రకటించారు. సీఎం జగన్‌ని కలిసి చెక్కు అందచేశారు. సీఎం సహాయ నిధికి పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రూ.25 లక్షలను అందించారు.



సీఎస్ సాహ్నీకి 5 కోట్ల చెక్కు ఇస్తున్న 'దివీస్' ప్రతినిధులు

### రామోజీ విరాళం 20 కోట్లు

**తెలుగు రాష్ట్రాలకు చెరో 10 కోట్లు అందజేత**



హైదరాబాద్: కరోనాపై పోరు కోసం రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు ఏపీ, తెలంగాణ సీఎంలు జగన్, కేసీఆర్‌లకు రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.20 కోట్ల విరాళం అందించారు. కరోనాపై విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సీఎంలకు లేఖలు రాశారు.



## 'కరోనా'పై విజయం సాధించాలి

- రాబోయే రెండు వారాలే కీలకం : వెంకయ్య

న్యూఢిల్లీ, మార్చి31(ఆంధ్రజ్యోతి): "కరోనా మహమ్మారిపై చేస్తున్న పోరాటంలో భారత్ విజయం కీలకం. ఈ పోరులో మన దేశం అనుసరిస్తున్న విధానాలను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. ప్రజలు ఇళ్లలోనే ఉంటూ ప్రభుత్వాలకు సహకరించాలి. ఐకమత్యంగా, బాధ్యతాయుతంగా ఉంటే విజయం సాధిస్తామన్న నమ్మకం నాకుంది" అని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. కరోనా ప్రభావంపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి, కేంద్ర ప్రభుత్వ కేబినెట్ కార్యదర్శితో ఆయన మంగళవారం మాట్లాడారు. కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు, లాక్‌డౌన్ ఆచరణకు కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు చేస్తున్న కృషికి ప్రజల సహకారం అభినందనీయమన్నారు. రైలు బోగీలను ఐసోలేషన్ కేంద్రాలుగా మారుస్తున్న విధానం, డాక్టర్లు, పరిశోధకులు తక్కువ సమయంలోనే వెంటిలేటర్లు, కరోనా నిర్ధారక కిట్లను తయారుచేయడం వంటి నూతన ఆవిష్కరణలు భారత్ సామర్థ్యాన్ని ప్రపంచానికి మరోసారి పరిచయం చేశాయని తెలిపారు. అక్కడక్కడ ఇబ్బందిపడుతున్న వలస కార్మికులు, రైతుల కనీస అవసరాలు తీర్చడంలో ప్రభుత్వాలకు స్థానికుల సహకారం అవసరమన్నారు. పంటలు చేతికొచ్చే ఈ సమయంలో వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వమే మద్దతు ధరకు కొని, రైతులను ఆదుకోవాలని వెంకయ్య సూచించారు. లాక్‌డౌన్ అమలులో తొలివారం ఫలితం సంతృప్తిగా ఉందని, మిగిలిన రెండువారాల లాక్‌డౌన్ కూడా అత్యంత కీలకమేనన్నారు. అది విజయవంతం కావడానికి సంపూర్ణ సహకారం అందించాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరు తోచినంత విరాళాలు ఇవ్వడంతో పాటు కరోనాపై పోరాటంలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, పోలీసు బలగాలు, పారిశుధ్య సిబ్బందికి అండగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు.

### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| కడప | 41.0 | 21.0 |
| కర్నూలు | 40.2 | 24.9 |
| అనంతపురం | 39.4 | 22.8 |
| రాజమండ్రి | 39.0 | 19.0 |
| విజయవాడ | 38.8 | 24.5 |
| ప్రకాశం | 37.5 | 24.5 |
| శ్రీకాకుళం | 35.0 | 26.0 |



### కరోనా పరీక్షలకు సహకరించకుంటే కాల్చేయండి

ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో సభకు వెళ్లొచ్చిన వారు కరోనా పరీక్షలకు సహకరించకుంటే కాల్చి పారేయాలి. కొంత మంది వల్ల దేశం మొత్తం నాశనం కాకూడదు. నిజాముద్దీన్‌లో జరిగిన సభలో పాల్గొన్న వారి వల్లే తెలంగాణకు చెందిన వారు ఒకేరోజు ఆరుగురు చనిపోయారు.

**- రాజాసింగ్, బీజేపీ ఎమ్మెల్యే**



### 24 గంటల్లోగా పోర్టల్ పెట్టండి

నిరంతరం వాస్తవ సమాచారం తెలపండి. వలస దారులకు అన్ని సౌకర్యాలూ కల్పించండి. 'నకిలీ వార్తల'పై కఠిన చర్యలు తీసుకోండి. దీన్ని అడ్డుకునేందుకు 24 గంటల్లో ఓ పోర్టల్‌ను ప్రారంభించాలి. ఈ పోర్టల్ ద్వారా నిరంతరం వాస్తవ సమాచారం తెలియజేయాలి. వైరస్ కన్నా నకిలీ వార్తలే ప్రమాదకరం. ప్రతి 10 మంది వలస దారుల్లో ముగ్గురు వైరస్ క్యారియర్లు ఉండొచ్చు.

**- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం**

### లాక్‌డౌన్ గడిచే వరకూ జియో ఆఫర్లు

ముంబై, మార్చి 31: లాక్‌డౌన్‌తో తమ వినియోగదారులు ఇబ్బంది పడకుండా రిలయన్స్ జియో పలు ఆఫర్లు ప్రకటించింది. ఏప్రిల్ 17 వరకూ 100 నిమిషాల టాక్‌టైమ్, 100 ఎస్ఎంఎస్‌లను ఉచితంగా అందిస్తామని తెలిపింది. వివిధ బ్యాంకుల ఏటీఎంల్లో రీచార్జి చేసుకునే అవకాశాన్ని కల్పించింది. వినియోగదారులు డెబిట్ కార్డును ఏటీఎంలో పెట్టిన తర్వాత స్క్రీన్‌పై వచ్చే ఆప్షన్లలో జియో రీచార్జి కూడా ఉంటుందని, వారి ఫోన్ నెంబరును, రీచార్జి మొత్తాన్ని టైప్ చేసి సేవలు పొందొచ్చని పేర్కొన్నది.

### అప్రెంటిస్‌లకు పూర్తి భృతి: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 31: దేశంలోని వివిధ సంస్థల్లో పనిచేస్తున్న అప్రెంటిస్‌లందరికీ లాక్‌డౌన్ సమయంలోనూ పూర్తిస్థాయి భృతి అందిస్తామని కేంద్ర సర్కారు తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్ ఉత్తర్వులపై సమీక్ష, స్వచ్ఛంద పదవీ విరమణ విజ్ఞప్తికి అనుమతి ఇవ్వడం వంటి అంశాలపై ప్రక్రియను ఉన్నతాధికారులు గడువులోపే ముగించాల్సి ఉంటుంది. అయి తే, లాక్‌డౌన్ విధించిన 21 రోజుల సమయాన్ని ఆ గడువులోంచి మినహాయిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వివరించింది. అంటే, లాక్‌డౌన్ రోజులను పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేసింది. మార్చి 31న పదవీ విరమణ చేయాల్సిన వారందరూ ఇక తమ విధుల్లోంచి తప్పుకోవాలని చెప్పింది.

### రాష్ట్ర ప్రభుత్వానికి మరో సలహాదారు

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో సలహాదారును నియమించుకుంది. ఇప్పటికే ఆరోగ్య శాఖకు ఒక డాక్టరు సలహాదారుగా వ్యవహరిస్తుండగా, ప్రజారోగ్యం కోసం సలహాదారుగా డాక్టర్ శ్రీనాథ్ రెడ్డిని నియమించారు. ఆయన గతంలో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కార్డియాలజీ విభాగాధిపతిగా పనిచేశారు.

### నిరాడంబరంగా శ్రీరామనవమి: వెలంపల్లి

శ్రీరామనవమి పండుగకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఏప్రిల్ 14 వరకు లాక్‌డౌన్ అమల్లో ఉన్నందున ఆలయాల్లోకి భక్తులను అనుమతించబోరని దేవదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. అందుకే రాష్ట్రంలోని ప్రధాన వైష్ణవ ఆలయాల్లో ఏప్రిల్ 2న శ్రీరామనవమి సందర్భంగా అర్చకులు మాత్రమే పూజాధికాలు, వేడుకలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

### 3 రోజుల్లో 51 లక్షల కుటుంబాలకు రేషన్

మూడు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 51,78,488 కుటుంబాలకు రేషన్ సరుకులు పంపిణీ చేసినట్లు పౌరసరఫరాల కమిషనర్ కోన శశిధర్ తెలిపారు. మంగళవారం ఒక్కరోజే 16,74,948 కుటుంబాలు సరుకులు తీసుకున్నాయని చెప్పారు. ఇతర ప్రాం తాల్లో ఉంటూ పోర్టబులిటీ ద్వారా 10,75,126 మంది రేషన్ పొందారని తెలిపారు.

### 20వేల రైల్వే బోగీలలో కరోనా వార్డులు

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ బారిన పడిన రోగులకు వైద్య చికిత్సలు అందించేందుకు దేశవ్యాప్తంగా 20వేల రైలు బోగీలను రైల్వేశాఖ ప్రత్యేక కరోనా వార్డులుగా మార్చడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ బోగీల ద్వారా 3.2లక్షల పడకల ఏర్పాటు చేస్తామని తెలిపింది. తొలిదశలో 5వేల బోగీలను ప్రత్యేక కరోనా వార్డులుగా మార్చి, వాటిలో మొత్తం 80వేల పడకలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నది. క్వారంటైన్ సేవలకు కూడా ఇవే బోగీలను ఉపయోగించాలని నిర్ణయించారు. బోగీల్లో ఉండే ఇండియన్ టాయిలెట్‌ను బాత్రూమ్‌గా మార్చనున్నారు. ఏపీ, తెలంగాణలో 600 పైచిలుకు బోగీల్లో.. బోగీకి 16 పడకల వంతున ఏర్పాటు చేస్తున్నారు.

### అస్థికలశాలతో చైనా అబద్ధాల గుట్టు రట్టు?

బీజింగ్, మార్చి 31: కరోనా వైరస్‌కు జన్మస్థానమైన వూహాన్‌లో 67 వేల మంది దాని బారిన పడితే.. వారిలో 2,535 మంది చనిపోయారని, తమ దేశంలో మృతుల సంఖ్య 3,305 మందేనని ప్రకటిస్తోంది. కానీ.. వూహాన్‌లో తమవారి అస్థికలశాల కోసం వస్తున్న వేలాది మందిని చూస్తుంటే మృతుల సంఖ్య 45 వేల నుంచి 1.2 లక్షల మంది దాకా చనిపోయి ఉంటారన్నది అంచనా. దీంతో చైనా అబద్ధాల గుట్టు రట్టయ్యే అవకాశం ఉంది.

# విస్తృతంగా పరీక్షలు చేయాలి

- 'ఆంధ్రజ్యోతి'తో కేంద్ర ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి సుజాతారావు



హైదరాబాద్ సిటీ, మార్చి31 (ఆంధ్రజ్యోతి): కానూరు సుజాతారావు.. తొలి తెలుగు ఐఏఎస్ అధికారిణి. జాతీయ ఎయిడ్స్ నియంత్రణా సంస్థ డైరెక్టర్ జనరల్‌గా ఆమె రూపొందించిన విధానాలు అంతర్జాతీయ ఖ్యాతి పొందాయి. కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శిగానూ సేవలందించారు. 'ప్రాథమిక ఆరోగ్య రక్షణ ప్రభుత్వాల అజెండా కావాలి' అంటున్న సుజాతారావు కొవిడ్‌ని కట్టడి చేసేందుకు రోగనిర్ధారణ పరీక్షలను పెంచాలని సూచిస్తున్నారు. కరోనాను అణచివేయడంలో ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు, పౌర సమాజం బాధ్యతపై సుజాతారావుతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ.

**కరోనా నిర్మూలనకు ఏ చర్యలు అవసరం?**

లాక్‌డౌన్ విధించడం సరైన చర్య. అయితే అదొక్కటే సరిపోదు. ఇప్పుడు మనం విస్తృతంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలి. బాధితులకు సరైన చికిత్స అందించడం అత్యవసరం. అలాగే అనుమానితులను ఐసోలేషన్‌లో పెట్టాలి. ఈ సమయంలో మనం ఎంత ఎక్కువగా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగలిగితే అంత మంచిది. లేకపోతే లాక్‌డౌన్ చేసీ ప్రయోజనం లేకుండా పోతుంది. మన జనాభాకి సరిపడా వైద్యులు లేరు. కొన్ని వేల నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మానవ వనరులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ఇక ఆస్పత్రి బెడ్‌ల కొరత గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పడకల సామర్థ్యాన్ని పెంచాలి. కొత్త వైద్యపరికరాలను కొనుగోలుచేయాలి. ఐసీయూ సేవలు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలి. కరోనా కట్టడికి మన ప్రభుత్వాలు చురుగ్గా స్పందిస్తున్నాయి. ఈ వైరస్ వ్యాప్తి తగ్గిన తర్వాత సమస్య మళ్లీ మొదటికొస్తుంది. అలా జరగకూడదు. కొవిడ్ రోగ నిర్ధారణ పరీక్షల కిట్లను సరిపడా తెప్పించాలి.

**ప్రభుత్వానికి మీరిచ్చే సూచనలు?**

లాక్‌డౌన్‌ను ప్రజలంతా కఠినంగా పాటించాలి. ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదు. వలసజీవులు, అసంఘటిత రంగ కార్మికులు, పేదలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారందరికీ సరైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవలో నిమగ్నమైన వాళ్లనూ సంప్రదించి, అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలి. సమాజంలో కరోనాపై నెలకొన్న భయాందోళనలను పోగొట్టాలి. ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వాళ్లని ఇల్లు ఖాళీ చేయమనడం మూర్ఖత్వమే. ముందు ఇలాంటి అపోహలను తొలగించాలి. కొవిడ్ చికిత్సపై ఆరోగ్య సిబ్బందికి వారం రోజులైనా శిక్షణ ఇవ్వాలి. తద్వారా డాక్టర్లపై ఒత్తిడి తగ్గుతుంది. ప్రభుత్వ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది చాలా బాగా పని చేస్తున్నారు. ఇప్పుడు వైద్యులను కంటికి రెప్పలా చూసుకోవడం ముఖ్యం. కరోనా కట్టడికి మొదట చైనా లాక్‌డౌన్ చేసింది. కానీ వైరస్ ఇతర దేశాలకూ వ్యాపించింది. దక్షిణకొరియాలో లాక్‌డౌన్ ఆంక్షలు పెట్టలేదు. అయినా వారు చాలా వరకు వైరస్‌ను నియంత్రించగలుగుతున్నారు. అందుకు ప్రధాన కారణం ఎక్కువగా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడమే. అనుమానం ఉన్న ప్రతిఒక్కరికీ పరీక్ష చేశారు. తైవాన్‌లో లాక్‌డౌన్‌తోపాటు పరీక్షలు చేశారు. దాంతో ఇన్‌ఫెక్షన్‌ను చాలావరకు కట్టడి చేయగలిగారు. ఇటలీలో మాత్రం నిర్లక్ష్యం చేశారు. అమెరికాలోనూ అదే జరిగింది. ఇలా ఒక్కో దేశానిది ఒక్కో అనుభవం.

## 'నేషనల్ ప్రొటోకాల్' అమలయ్యేలా ఆదేశాలివ్వండి

- తెలంగాణ నుంచి ఏపీకి వచ్చేవారి కేసులో తీర్పుపై.. హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ఏపీలోకి వచ్చేందుకు సిద్ధమైనవారిని అనుమతించే వ్యవహారానికి సంబంధించి హైకోర్టు రెండు కేసుల్లో విరుద్ధమైన ఆదేశాలిచ్చిందని, అందువల్ల నేషనల్ ప్రొటోకాల్ ప్రకారమే నడుచుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఏజీ ఎస్.శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు సుమోటోగా కేసు స్వీకరించిన పిటిషన్‌పై.. రాష్ట్రాల సరిహద్దుల వద్ద ఉన్నవారిని అనుమతించే వ్యవహారంలో నేషనల్ ప్రొటోకాల్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందని, మరో పిటిషన్‌లో నేషనల్ ప్రొటోకాల్ ప్రస్తావన చేయకుండా, ఆరోగ్యంగా ఉన్నవారందరినీ అనుమతించాలని ఆదేశించిందని తెలిపారు. రెండో కేసులో ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని అభ్యర్థించారు. ఇరువర్గాల వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను వాయిదా వేసింది. కాగా, ఏపీ హైకోర్టు చరిత్రలో తొలిసారిగా మంగళవారం పలు పిటిషన్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే విచారణ జరిగింది.

## ఆసియాలో పేదరికంలోకి కోటిమంది!

- మాంద్యం ఖాయం.. భారత్, చైనాపై ప్రభావం పడకపోవచ్చు

న్యూయార్క్, మార్చి 31: కరోనా కారణంగా తూర్పు ఆసియా, పసిఫిక్ దేశాల్లో కనీసం కోటీ పది లక్షల మంది పేదరికంలోకి జారిపోయే ప్రమాదముందని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. మాంద్యం ఖాయమని.. అది సుదీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందని అంచనా వేసింది. 2019లో ఆర్థికవృద్ధి 5.8శాతం ఉండగా, 2020లో 2.1 శాతానికి మందగించవచ్చని పేర్కొంది. మొత్తం ఆర్థికవ్యవస్థ 0.5 శాతంమేర తగ్గిపోవచ్చని, ఫలితంగా ఎన్నడూ లేని సంక్షోభానికి దారితీయవచ్చని విశ్లేషించింది. కరోనా కల్లోలం నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాలకు ప్రపంచ బ్యాంకు 14 బిలియన్ డాలర్ల తక్షణ సాయాన్ని ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి కూడా ప్రపంచబ్యాంకు అభిప్రాయంతో ఏకీభవించింది. దీని ప్రభావం భారత్, చైనాపై పడకపోవచ్చని పేర్కొంది.

## దేశంలో 1,397కు కరోనా కేసులు

- మహారాష్ట్రలో కొత్తగా 72.. ఒక్క ముంబైలోనే 59

న్యూఢిల్లీ, మార్చి 31: దేశంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు మంగళవారం 1,397కు పెరిగాయి. దేశవ్యాప్తంగా 24 గంటల్లో 146 కేసులు నమోదయ్యాయి. మరణాల సంఖ్య 35కు పెరిగింది. "ఇప్పటి వరకు 123 మంది కోలుకున్నారు. దీంతో యాక్టివ్ కొవిడ్- 19 కేసులు 1,238 ఉన్నాయి" అని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. మహారాష్ట్రలో కొత్తగా 72 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇందులో 59 ఒక్క ముం బైలోనే బయటపడ్డాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 302కు చేరింది. ఢిల్లీలో కేసుల సంఖ్య 97కు పెరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో కొత్తగా ఐదు కరో నా కేసులు నమోదయ్యాయి. నొయిడాలో పనిచేసే వ్యక్తికి ముందే కరోనా సోకగా, ఇప్పుడు అతని తల్లిదండ్రులు, భార్య, సోదరి, సోదరుడు కూడా వైరస్ బారినపడినట్లు తేలింది. దీంతో యూపీలో కేసులు 103కు చేరాయి. కర్ణాటకలో మరో 13 మం దికి వైరస్ నిర్ధారణ కావడంతో రోగుల సంఖ్య 101కి పెరిగింది. కశ్మీర్‌లో కొత్తగా 6 కేసులు నమోదవడంతో మొత్తం సంఖ్య 55కు చేరింది. గుజరాత్‌లో నాలుగు తాజా కేసులతో మొత్తం 74కు చేరాయి. తమిళనాడులో 74, పంజాబ్ 41, హరియాణా 40, పశ్చిమ బెంగాల్ 26, బిహార్ 15, లద్దాఖ్ 13, చండీగఢ్‌లో 13కు కేసులు పెరిగాయి. రాజస్థాన్‌లోని భీల్‌వాడా నగరం అందరికీ కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆ రాష్ట్రంలో నమోదైన 83 కరోనా కేసుల్లో 26 భీల్‌వాడాలోనే బయటపడ్డాయి.

### తెలంగాణలో ఒక్క రోజే 15 కేసులు

హైదరాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కరోనా కేసులు కలవరం రేపుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే కొత్తగా 15 కేసులు నమోదయ్యాయి. అవన్నీ కూడా ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ మసీదుతో సంబంధం ఉన్నవే అని వైద్య ఆరోగ్య శాఖ తన బులెటిన్‌లో పేర్కొంది. ఈ కేసుల్లో ఎక్కువగా హైదరాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్‌కు చెందిన వారు ఉన్నారని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. తాజా కేసులతో కలిపి రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 91కు చేరింది. అందులో ఆరుగురు చనిపోయినట్లు సీఎంవో సోమవారం రాత్రి ప్రకటించింది. మంగళవారం 13 మందిని డిశ్చార్జి చేశారు. మార్చి 2న నమోదైన తొలి పాజిటివ్ కేసును ఇప్పటికే డిశ్చార్జి చేశారు. దీంతో రాష్ట్రంలో ప్రస్తుతం 77 యాక్టివ్ కేసులున్నాయి. వారంతా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు.

### మధుమేహం రాకముందే 'బేరియాట్రిక్' మేలు

వాషింగ్టన్, మార్చి 31: ఊబకాయం బాధితులకు మధుమేహం రాకముందే బేరియాట్రిక్ సర్జరీ చేయించుకుంటే శరీర బరువు భారీగా తగ్గుతుందని అమెరికాలోని మిచిగాన్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. బేరియాట్రిక్ శస్త్రచికిత్స చేయించుకున్న 714 మంది ఊబకాయుల ఆరోగ్యాల్లో ఐదేళ్లలో వచ్చిన మార్పులపై అధ్యయనం తర్వాత ఈ నిర్ధారణకొచ్చారు.

### కరోనా టీకా పరిశోధనలో భారీ కణ యాక్సిలేటర్ వినియోగం

సిడ్నీ, మార్చి 31: కరోనా టీకా పరిశోధనను వేగవంతం చేసేందుకు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు భారీకణ యాక్సిలేటర్‌ను వినియోగిస్తున్నారు. సూక్ష్మదర్శినిలా ఉపయోగపడే యాక్సిలేటర్ తీక్షణమైన ఎక్స్ కిరణాల విడుదల ద్వారా వైరస్‌లోని కీలక ప్రొటీన్ల పరిశీలనకు ఉపయోగపడుతుంది. దీంతో అణుస్థాయి త్రీడీ పటం రూపకల్పనకు వీలు కలుగుతుంది. తద్వారా కరోనా నివారణ మందుల అభివృద్ధి, వ్యాధి చికిత్సకు ఆస్కారం ఉంటుంది. కాగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు డజన్ల కొద్దీ ప్రొటీన్ నమూనాలను ఈ పరిశోధన కోసం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఉన్న సిన్క్రోట్రాన్‌కు పంపారు.



### కాకి-పాము హోరాహోరీ!

నాగుపాము, కాకి దాదాపు గంటపాటు హోరాహోరీగా తలపడ్డాయి. చివరికి అలసిపోయి తలోదారిన వెళ్లిపోయాయి. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం కొర్లాం షిర్డీ సాయిబాబా మందిరం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఈ వింత ఘటన చోటుచేసుకుంది. అటుగా వచ్చిన వారు, స్థానికులు ఈ దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లో బంధించారు. గంట పాటు పోరాడిన తరువాత పాము సమీప పుట్టలోకి వెళ్లిపోగా.. కాకి రివ్వున ఎగిరిపోయింది. **- సోంపేట రూరల్**

## కొమ్మదిగని కమ్మని మామిడి!



మధురఫలం మామిడి నోటికి అందేనా? అష్టకష్టాలు పడి శ్రమకోర్చి పండించిన రైతాంగానికి పెట్టుబడులైనా దక్కేనా...ఈ ప్రశ్నలకు లేదనే జవాబు వస్తోంది. ఈఏడాది మామిడి రైతులకు లాభాల పంటే అనుకొనేలోపే కరోనా ప్రభావం విరగ్గాసిన మామిడి తోటలపై పడింది. కొమ్మల మీద మామిడిని చూసి నిన్నటిదాకా రైతులు మురిసిపోయారు. అయితే ఆ కాయలు ఆ కొమ్మలపైనే రాలిపోవాల్సిన పరిస్థితికి వారంతా కుమిలిపోతున్నారు! కోసే కూలీలు, మార్కెట్‌కు తరలించే వాహన డ్రైవర్లు అంతా లాక్‌డౌన్‌తో భౌతిక దూరం పాటిస్తుండటంతో తోటలో కాయలను దించే నాథుడే కరువయ్యాడు! సరిగ్గా దిగుబడులు వస్తున్న సమయంలో కోతలు జరక్క తోటల్లో ఎక్కడికాయలు అక్కడే ఉండిపోయాయి. పక్వానికి వచ్చినా అమ్ముకునే అవకాశం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజూ కోట్లరూపాయల మేర జరిగే వ్యాపారం ఒక్కసారిగా ఆగిపోవడంతో రైతులు, వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మామిడి ఎగుమతులకు నిబంధనలతో కూడిన అనుమతులిచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని రైతాంగం, వ్యాపారులు ముక్త కంఠంతో కోరుతున్నారు. -ఆగిరిపల్లి



## రొయ్య లాక్‌డౌన్!

కరోనా ప్రభావానికి ఆక్వా కుదేలైంది... ఎగుమతులు నిలిచిపోయాయి...ప్రాసెసింగ్ యూనిట్లు మూతపడ్డాయి. ఉన్న యూనిట్లలోనూ గరిష్ఠస్థాయిలో నిల్వలు ఉండటం.. రొ య్యల చెరువుల వద్ద కూలీల కొరత.. ప్రభుత్వాల ఉదాసీన త వెరసి ఆక్వా రైతు నష్టాల ఊబిలో కూరుకుపోయాడు. 'కరోనాతో సంబంధం లేకుండా ఆక్వా ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తాం. 30 కౌంట్ ధర రూ.430, 40 కౌంట్ ధర రూ.310, 50 కౌంట్ ధర రూ.260 100 కౌంట్ ధర రూ.180గా నిర్ణయించాం'..అని మత్స్య శాఖ మంత్రి మోపిదేవి వెంకట రమణ రెండు రోజుల క్రితం ప్రకటన చేసినా అందులో సగం ధర కూడా రాని పరిస్థితిని రైతులు చవిచూస్తున్నారు. ఈ ఒక్క సీజన్‌లోనే రూ.12 వేల కోట్ల మేర నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. నేరుగా 'ఎంపెడా' రంగంలోకి దిగాలని, ఆక్వా ఉత్పత్తులను మద్దతుధరకు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. -విజయవాడ

## వాయిదాల్లో వేతనం!

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, గ్రామ-వార్డు సచివాలయ సిబ్బందికి పది శాతం తగ్గించి ఇస్తారు. ఇప్పుడు వేతనంలో తగ్గించిన మొత్తాన్ని ఆయా ఉద్యోగులు, అధికారులు తర్వాత చెల్లిస్తారు. ఉద్యోగుల వేతనాల బిల్లులను తాజా జీవో ప్రకారం మళ్లీ పంపించాలని ఆదేశించారు.

### తెలంగాణ తరహాలోనే...

నిజానికి... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల బిల్లులు ఇప్పటికే ఆర్థిక శాఖకు వెళ్లాయి. ఖజానాలో నిధులు కూడా ఉన్నాయి! అయినప్పటికీ, కరోనా కల్లోలం నేపథ్యంలో జీతాలకు కోత పెట్టాలని నిర్ణయించడం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఏపీ ప్రభుత్వం వేతనాలు, పెన్షన్లు కలిపి నెలకు రూ.6200 కోట్లు చెల్లింపులు చేస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన రూ.2,500 కోట్లు వేతనాల రూపంలో ఉద్యోగుల ఖాతాల్లో పడతాయి. మిగిలిన వేతనాలు, పెన్షన్లను వీలును, నిధుల లభ్యతను బట్టి 10వ తేదీలోగా ఆర్థిక శాఖ చెల్లిస్తోంది. ఇప్పుడు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించడం ద్వారా నెలకు ప్రభుత్వానికి రూ.2,500 కోట్ల వరకు మిగిలే అవకాశం ఉంది. అలా మిగిలిన నిధులతో అత్యవసర బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు... 'లాక్‌డౌన్' నేపథ్యంలో ఒకటో తేదీన ప్రతి ఇంటికీ రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. దీని కోసం రూ.1300 కోట్లు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో వేతనాల 'వాయిదా చెల్లింపు' తప్పలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. నిజానికి, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను వాయిదాలలో చెల్లించాలనే యోచన తొలుత లేదని, మార్చి 30న తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రకటన చేసిన తర్వాతే ఇక్కడ ఆ దిశగా అడుగులు వేయడం మొదలైందని ఉద్యోగులు చెబుతున్నారు. ప్రతి నెలలాగానే ఈ నెల కూడా వేతనాల బిల్లులను పూర్తిస్థాయిలో ఆర్థిక శాఖ స్వీకరించిందని చెప్పారు. ఇప్పుడు 'కోత' జీవో ప్రకారం వేతనాల బిల్లులు పంపి, చెల్లింపులు చేసేందుకు మరింత సమయం పడుతుంది. ప్రభుత్వ ఉద్యోగుల 'వేతనాల'ను వాయిదా పద్ధతి అమలు చేస్తుండగా... ప్రైవేటు పరిశ్రమలు తమ ఉద్యోగులు, కార్మికులకు జీతాలను ఆపి వేయడానికి వీల్లేదని, ఎప్పట్లాగానే నిర్దిష్ట సమయానికి చెల్లించాలని పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీ చేయడం విశేషం.

## క్షేత్ర స్థాయిలో కన్నీరెడుతున్న రైతు

▸▸ సీఎం తక్షణమే స్పందించాలి: లోకేశ్

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరింత దిగజారింది. రైతు పండించిన పంటను లాక్ అవుట్‌లో ఏం చేయాలో అర్థంకాక దిక్కుతోచకు ఉన్నాడని మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ట్విటర్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. "రైతులను ఆదుకోవడానికి అన్నిరకాల చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం అంటోంది. కానీ క్షేత్ర స్థాయిలో రైతులు కన్నీరు పెడుతున్నారు. అప్పులు చేసి పండించిన పంటకు మద్దతు ధర రావడం లేదు. కనీసం వేరే ప్రాంతాలకు తరలించేందుకు రవాణా సౌకర్యం కూడా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. హార్టికల్చర్, ఆక్వా రంగంలో ఉన్న రైతుల కష్టాలు వర్ణనాతీతం. కూలీలు, గిట్టుబాటు ధర లేక వరి పండించిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఒక్కసారి రైతు దెబ్బ తింటే కోలుకోవడం చాలా కష్టం. వీలైనంత త్వరగా సీఎం స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా" అని లోకేశ్ ట్వీట్ చేశారు.

## కరోనాని అరికట్టడంలో సీఎం విఫలం: బుద్దా

విజయవాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల వద్ద భారీ క్యూలైన్ల నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మంగళవారం ట్విటర్ వేదికగా స్పందించారు. "కరోనాను అరికట్టడంలో ముఖ్యమంత్రి జగన్ ఫెయిల్ అయ్యారని, అసమర్థుడని సన్న బియ్యం మంత్రి స్వయంగా ఒప్పుకొన్నారు. అందుకే ప్రతిపక్ష నేత చంద్రబాబు రావాలి, కావాలి అంటున్నారు. కరోనాని కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. సన్న బియ్యం మంత్రి బాధ చూస్తుంటే బాధేస్తోంది. తన శాఖలో ఏం జరుగుతుందో కూడా తెలియని అసమర్థ మంత్రి. రేషన్ షాపుల్లో రేషన్ ఇస్తామని ఆ శాఖ ప్రకటిస్తే.. సన్న బియ్యం మంత్రి ఇంటికే సరుకులు పంపుతామని ప్రకటించారు. ఆఖరికి ప్రజల్ని క్యూలైన్లలో నిలబెట్టి ప్రాణాలు తీస్తున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది" అని బుద్దా ట్వీట్ చేశారు.

## తప్పుడు ప్రచారం చేస్తే బట్టలూడదీయాల్సి వస్తుంది

▸▸ మంత్రి కొడాలి

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): "కరోనాకు భయపడి చంద్రబాబు ఇంట్లోనే దాక్కున్నారు. వయస్సు పైబడి చస్తాననే భయంతో ఆక్సిజన్ పెట్టుకుని బతుకుతున్నారు. విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు రాజకీయాలు చేయడం మానుకోవాలి. తప్పుడు ప్రచారం చేస్తే బట్టలు ఊడదీయాల్సి వస్తుంది" అని మంత్రి కొడాలి నాని హెచ్చరించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేషన్ షాపుల వద్ద జనం గుంపులు గుంపులుగా ఉండవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రతి వినియోగదారునికీ రేషన్ అందిస్తామన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటికే రేషన్ అందిస్తామని గతంలో వాగ్దానం చేశామన్నారు. అయితే బ్యాగుల్లో రేషన్ అందించే పద్ధతి అమల్లోకి రాలేదని గుర్తు చేశారు.

## మంత్రులా... బూతు ప్రొఫెసర్లా?: వర్ల

గొల్లపూడి, అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మంత్రి కొడాలి నాని మీడియా సమావేశంలో ఉపయోగించిన భాషపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. మంత్రి కొడాలి నాని మాట తీరు, ఆహార్యం చూసి కూడా కేబినెట్‌లో కొనసాగిస్తున్నారంటే జగన్‌కి పాలన పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య దుయ్యబట్టారు. మంత్రి కొడాలి నాని ప్రతిపక్ష నేత చంద్రబాబు గురించి మాట్లాడిన మాటలు ప్రజల్ని విస్మయానికి గురి చేస్తున్నాయని మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్ల మంత్రులా.. బూతు ప్రొఫెసర్లా అని నిలదీశారు.

## కార్మికులు, ఉద్యాన, ఆక్వా రైతులను ఆదుకోండి

▸▸ ట్విటర్‌లో జనసేనాని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): "లాక్‌డౌన్ మూలంగా భవన నిర్మాణ కార్మికులు, ఉద్యాన, ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి గురించి రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి" అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కోరారు. మంగళవారం ట్విటర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆ మేరకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల్లో అత్యధికులు కార్మిక సంక్షేమ బోర్డు గుర్తింపు లేని వారేనని, వారికి సహాయం చేసే నైతిక బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందా? అని ప్రశ్నించిన పవన్... కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అందరికీ ఆ సాయం ఇస్తారా?' అంటూ సందేహాన్ని లేవనెత్తారు. లాక్‌డౌన్ కారణంగా ఉద్యాన ఉత్పత్తులను ప్రభుత్వం ఎందుకు నేరుగా కొనుగోలు చేయడంలేదని ప్రశ్నించారు. 'ప్రభుత్వం నిర్ణయించిన ధర పూర్తిగా ఆక్వా రైతుకు దక్కుతుందా? పర్యవేక్షించే యంత్రాంగం ఉందా?' అని పవన్ ప్రశ్నించారు.

## కౌంట్ ఆధారంగా రొయ్యల ధరలు

అమరావతి, మార్చి31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కౌంట్ ఆధారంగా ప్రభుత్వం రొయ్యల ధరలను నిర్ణయించింది. మెరైన ప్రొడక్స్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంపెడా), మత్స్యశాఖ ప్రతిపాదించిన రొయ్యల మద్దతు ధరలను ఆక్వా ఎగుమతిదారుల అసోసియేషన్ ఆమోదించింది. కరోనా వైరస్ నేపథ్యంలో అమలు చేస్తున్న లాక్‌డౌన్‌తో ఆక్వా ఎగుమతులు నిలిచిపోవడం, ధరలు పడిపోతున్న పరిస్థితిపై సీఎం జగన్ మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. చైనా, జపాన్ కోవిడ్-19నుంచి కోలుకుని మార్కెటింగ్‌ను తిరిగి ప్రారంభించినందున సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను కొనసాగించాలని మత్స్యశాఖ అధికారులు ప్రతిపాదించారు. కొద్ది రోజుల్లో మార్కెట్లు, ధరలు స్థిరపడే అవకాశం ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆక్వా సాగు, ఉత్పత్తులకు సరైన ధరలు లభించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఎంపెడా చైర్మన్ శ్రీనివాస్ కోరారు. నిర్ణయించిన ధరలు తగ్గకుండా చూడాలని అధికారులకు సీఎం ఆదేశాలిచ్చారు.

| కౌంట్ | ధర(రూ.) |
|---|---|
| 30 | 430 |
| 40 | 310 |
| 50 | 260 |
| 60 | 240 |
| 70 | 220 |
| 80 | 200 |
| 90 | 190 |
| 100 | 180 |

# ఈ పరీక్షలు చాలవు

## ఇంకా ఎక్కువ చేస్తేనే తీవ్రత బయటపడుతుంది

- ▸▸ 49 రోజులు లాక్‌డౌన్ చేయాలి
- ▸▸ పంటలను ప్రభుత్వమే కొనాలి
- ▸▸ రేషన్, పింఛను ఇంటికే పంపాలి
- ▸▸ ప్రభుత్వానికి ఎంతకైనా సహకరిస్తాం
- ▸▸ చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): 'పరీక్షలు.. పరీక్షలు.. పరీక్షలు. ఇదే ఇప్పుడు మనం అత్యవసరంగా చేయాల్సిన పని. కరోనా వైరస్ సోకిన వారిని గుర్తించడానికి ఇప్పుడు చేస్తున్న పరీక్షలు ఏ మాత్రం చాలవు. ఇంకా ఎక్కువ విస్తృతంగా చేయాలి' అని మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టంచేశారు. వైరస్ సోకిన వారిని గుర్తించి వారిని వేరు చేసి వారికి విడిగా చికిత్స చేస్తేనే మిగిలిన వారిని కాపాడగలుగుతామన్నారు. అది చేయకుండా మిగిలినవి ఎన్ని చేసినా దాని దారిన అది వైరస్ వ్యాప్తి అవుతూనే ఉంటుందని హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విలేకరుల సమావేశం నిర్వహించారు. సోమ, మంగళవారాలు రెండు రోజుల్లోనే రాష్ట్రంలో 28 కొత్త కేసులు బయట పడటం వైరస్ వ్యాపిస్తున్న తీరుకు నిదర్శనమని, ఇది తేలిగ్గా తీసుకునే పరిస్థితి కాదని చెప్పారు. 'వైరస్ ఉన్న ఒక వ్యక్తి మామూలుగా తిరుగుతుంటే ఆరు రోజుల్లో 3,200 మందికి దీనిని వ్యాపింపచేయగలడని చైనాలో చేసిన అధ్యయనంలో వెల్లడైంది. మన రాష్ట్రంలో మనం ఇప్పటికి అన్నీ కలిపి కేవలం 700 మందికి మాత్రం పరీక్షలు చేయగలిగాం. విదేశాల నుంచి వచ్చిన వారే రాష్ట్రంలో 30 వేల మంది ఉంటే ఇన్ని తక్కువ పరీక్షలు నిర్వహిస్తే మనకు వాస్తవ పరిస్థితి తెలియదు. ఇతర రాష్ట్రాలకు ప్రయాణం చేసి వచ్చిన వారు మరి కొన్ని వేలల్లో ఉన్నారు. పరీక్ష కిట్లు ఇంకా ఎక్కువ తెప్పించి విస్తృతంగా పరీక్షలు చేస్తేనే ఎంత మందిలో ఈ వైరస్ ఉందో తెలుస్తుంది. ఇది తప్ప వేరే మార్గం లేదు' అని ఆయన నొక్కిచెప్పారు. లాక్‌డౌన్ ఇంకా పెంచాల్సి వస్తుందేమోనని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 'చైనాలోని వూహాన్ నగరంలో 62 రోజులు లాక్‌డౌన్ అమలు చేయడం వల్ల దానిని పూర్తిగా నిరోధించగలిగారు. మన దేశంలో కూడా 49 రోజులు అమలు చేస్తే వైరస్ వ్యాప్తిని అరికట్టగలుగుతామని నిపుణులు చెబుతున్నారు.' అని అన్నారు. లాక్‌డౌన్ సమయంలో రేషన్ కోసం ప్రజలను బయటకు తెచ్చే బదులు.. రేషన్, పింఛన్‌ను లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి ఇవ్వడం సముచితమని చెప్పారు. రేషన్ కోసం బయటకు వచ్చి ఒక మహిళ చనిపోవడం బాధాకరమన్నారు. లాక్‌డౌన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోందన్నారు. తక్షణం వారి నుంచి పంటలు కొనాలని సూచించారు. ఇలాంటి సమయంలో అన్న క్యాంటీన్లను నడిపితే బాగుండేదని చంద్రబాబు చెప్పారు.

### చంద్రబాబు సూచించిన జాగ్రత్తలివీ..

'భౌతిక దూరం పాటించాలి. ఎవరితో అయినా మాట్లాడాలంటే డిజిటల్ సౌకర్యాలు వినియోగించుకోవాలి. ప్రతివారూ తప్పనిసరిగా ప్రతి రోజూ వేడి ఆవిరి పట్టండి. వేడి నీళ్లతో గొంతు శుభ్రం చేసుకోండి. మితాహారం తీసుకోండి. అరగనివి వదిలివేయండి. నీళ్లు ఎక్కువ తాగండి. ఏ పూట వంట ఆ పూట వండుకుని తినండి. ఉదయం కొంత సేపైనా ఎండ తగలాలి. ఎంతో కొంత వ్యాయామం చేయండి. విటమిన్లు, జింక్ ఉండే పళ్ళు, కూరగాయలు తినండి' అని సూచించారు.

### వీడియో కాన్ఫరెన్స్‌లో తొలిసారి భేటీ

చంద్ర బాబు మంగళవారం తొలిసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విలేకరుల సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉన్న ఆయన.. జూమ్ అనే యాప్‌కు చెందిన వీడియో టెక్నాలజీని వినియోగించుకొని దీనిని జరిపారు.



## ప్రతి కుటుంబానికి 5 వేలు ఇవ్వండి

▸▸ సీఎం జగన్‌కు చంద్రబాబు లేఖ

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కరోనా విజృంభణతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఒక్కో పేద కుటుంబానికి రూ.5వేలు అందించాలని టీడీపీ అధినేత చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు ఆయన మంగళవారం లేఖ రాశారు. పండ్లతోటలు, ఆక్వా, పౌల్ట్రీ, వరి, ఇతర పంటలు పండించిన రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ పంటలు అన్నింటినీ ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో జరిగిన మతపరమైన కార్యక్రమానికి రాష్ట్రం నుంచి 700మంది హాజరయ్యారని నివేదికలు వచ్చాయని, వారందరితో పాటు వారిని కలిసిన వారినీ కూడా గుర్తించి పరీక్షలు నిర్వహించాలన్నారు. కరోనా సంక్షోభంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే, దీన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన సలహాలు ఇచ్చి ప్రతి పార్టీ ప్రభుత్వానికి సహకరిస్తుందని తన లేఖలో చంద్రబాబు సూచించారు.

## 'సెట్స్' దరఖాస్తుల గడువు పొడిగింపు

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ (కోవిడ్-19) వ్యాప్తి నేపథ్యంలో ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్)కు దరఖాస్తుల సమర్పణ గడువును ఏప్రిల్ 17 వరకు పొడిగించినట్లు రాష్ట్ర ఉన్నత విద్యా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.సుధీర్ రెడ్డి (సెట్స్) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

### ▸▸ ఎంసెట్ ఎంపీసీలో 41.79% సీట్లు ఖాళీ

2019-20 విద్యా సంవత్సరపు ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్)కు సంబంధించి మంజూరైన సీట్లు, భర్తీ కాగా ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. ఎంసెట్ ఎంపీసీ స్ట్రీమ్‌లో మొత్తం 1,41,897 సీట్లు అందుబాటులో ఉండగా 58.21% సీట్లు భర్తీ కాగా... 41.79% సీట్లు ఖాళీగా ఉన్నాయి. అదే బైపీసీ స్ట్రీమ్‌లో మొత్తం 12,203 సీట్లు అందుబాటులో ఉండగా 83.95% సీట్లు భర్తీ కాగా.. 16.05% సీట్లు ఖాళీగా ఉన్నాయి.

## వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్‌గా కాటమనేని భాస్కర్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా కాటమనేని భాస్కర్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన శాప్ ఎండీగా పనిచేస్తున్నారు. పర్యాటకశాఖ కార్పొరేషన్ ఎండీగా ఉన్న ప్రవీణ్‌కుమార్‌కు శాప్ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

### ▸▸ పీటీడీ సిబ్బందికి పోలీసు విధులా?

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(పీటీడీ) సిబ్బందిని పోలీసు విధులకు కేటాయించడం సరికాదని కార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో పోలీసు సిబ్బందికి సహాయకులుగా పీటీడీని సిబ్బందిని ప్రభుత్వం రంగంలోకి దించింది. మంగళవారం ఈ మేరకు గుంటూరులో సిబ్బందిని పిలిపించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి అందుబాటులోకి రావాలని ఆదేశించారు. దీనిపై పలు కార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.



నీరుకొండలో గోమాతకు పూజలు చేసి జై అమరావతి నినాదాలు చేస్తున్న రైతులు

## అమరావతే అంతిమ లక్ష్యం

▸▸ 105వ రోజు కొనసాగిన ఆందోళనలు

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తమ త్యాగాలను అపహాస్యం చేస్తూ, కుళ్లు రాజకీయాలు ఆపాదిస్తూ, జీవితాలతో ఆడుకోవద్దని రాజధాని ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిని ఏపీకి ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంత రైతులు చేస్తోన్న ఆందోళనలు మంగళవారం 105వ రోజుకు చేరాయి. ఇన్ని రోజులుగా అలుపెరుగని పోరు సాగిస్తున్నా తమ గోడు పట్టించుకోకపోగా, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మానసికంగా దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తుళ్లూరు, మందడం, అనంతవరం, రాయపూడి, వెలగపూడి తదితర గ్రామాల్లో రైతులు, మహిళలు బృందాలుగా ఏర్పడి వీధుల్లో భౌతిక దూరం పాటిస్తూ నిరసనలు తెలిపారు. పెదపరిమి, నీరుకొండ గ్రామాల్లోని దీక్షాశిబిరాల్లో ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. వెంకటపాలెం, అబ్బురాజుపాలెం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెంలలో మహిళలు తమ ఇళ్ల ముందు కూర్చొని నినాదాలు చేశారు. 'మీ కుట్ర రాజకీయాల్లో మమ్మల్ని బలి చేయవద్దు. 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు కోసం మేము పోరాడుతుంటే నిన్నటి వరకు కులముద్ర వేశారు. నేడు సోషల్ మీడియా వేదికగా మా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రాక్షస క్రీడకు తెర తీశారు. ఈ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి పనుల కోసం సెంటు భూమైనా తీసుకోగలదా? మేము ప్రభుత్వాన్ని నమ్మి 33 వేల ఎకరాల పైచిలుకు భూమినిచ్చి అలుసైపోయాం' అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, ఏకైక రాజధానిగా అమరావతితోనే ఇళ్లతో పాటు యావత్ రాష్ట్రంలో వెలుగులు నిండుతాయంటూ 'అమరావతి వెలుగు'ను నిర్వహించారు. ప్రతి ఇంటా రాత్రి 7.30 నుంచి 7.35 గంటల వరకు విద్యుత్ లైట్లు ఆపి కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. నెక్కల్లు, నేలపాడు, వెంకటపాలెం గ్రామాల్లో కొవ్వొత్తులతో రోడ్లపై మానవహారాలు నిర్వహించారు. న్యాయబద్ధమైన రైతుల పోరాటాన్ని అణచివేయాలని అధికారపార్టీ నేతలు, కార్యకర్తలు కుట్రలు చేస్తున్నారని జేఏసీ కీలక నేత కె.శ్రీనివాస్ ఆరోపించారు.

## పోలీసు గృహిణులకు వందనం: డీజీపీ

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని రక్షించడం కోసం పోలీసులు ధైర్యంతో డ్యూటీలు చేస్తోంటే.. వైరస్‌ను లెక్క చేయకుండా యూనిఫామ్‌లను శుభ్రం చేసి అండగా నిలుస్తున్న వారి కుటుంబసభ్యులకు చేతులెత్తి నమస్కరించాలనిపిస్తోందని రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ వ్యాఖ్యానించారు. వారిని ఉద్దేశించి ఆయన మంగళవారం బహిరంగ లేఖ రాశారు. "దేశం జాతీయ విపత్తును ఎదుర్కొంటున్న సమయంలో కుటుంబాలను వదిలి ప్రజా రక్షణ కోసం పోలీసులు శ్రమిస్తున్నారు. ఈ విషయంలో పోలీసుల్లో నైతిక స్థైర్యాన్ని నింపుతున్న కుటుంబాలకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. కుటుంబాల త్యాగాలు ఈ సమయంలో మరువలేనివి. సమాజ రక్షణ కోసం డ్యూటీ చేసి ఇంటికొచ్చిన తండ్రి లోపలికి వచ్చి తమను హత్తుకోకుండా బయటే ఉంటూ అటే డ్యూటీకి వెళుతోంటే 'మా నాన్న పోలీస్. మీరంతా ఇంట్లో ఉండి మా నాన్నకు సాయం చేయండి' అని ప్లకార్డులు ప్రదర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తోన్న చిన్నారులను చూస్తుంటే ముచ్చటేస్తోంది. ఇలాంటి సమయంలోనూ రోడ్డుపై కనిపించే అభాగ్యులకు అన్నం పెట్టి ఆకలి తీరుస్తున్న మన పోలీసుల ఖాకీ దుస్తుల్లో నాకు అమ్మ కనిపిస్తోంది. అనవసరంగా రోడ్డెక్కే వారికి లాఠీ చూపించి దండించి పంపిస్తోన్న పోలీసు యూనిఫామ్‌లో ఓ తండ్రి కనిపిస్తున్నాడని డీజీపీ పేర్కొన్నారు.


GMR జీఎమ్ఆర్ హైదరాబాద్ విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్

25/1, స్కిప్ హౌస్, మ్యూజియం రోడ్, బెంగళూరు 560 025. CIN U45201KA2009PTC050109

కన్సెషనర్ యొక్క ప్రమోటర్స్: జీఎమ్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్.

పంతంగి టోల్ ప్లాజా (కి.మీ 60 + 650), కొర్లపహాడ్ టోల్ ప్లాజా (కి.మీ 118 + 250) మరియు చిల్లకల్లు టోల్ ప్లాజా (కి.మీ 205 + 025) ల వద్ద తేది 1 ఏప్రిల్ 2020 నుండి అమలు చేయబడనున్న టోల్ ఫీజు యొక్క వార్షిక సవరణకు సంబంధించిన బహిరంగ ప్రకటన.

1. ప్రజానీకానికి అందరికీ ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా టోల్ ఫీజు యొక్క వార్షిక సవరణకు సంబంధించిన NHAI అనుమతి లెటరు తేది 30.03.2020 ప్రకారం, జాతీయ రహదారి నెం. 9 (కొత్త నెం. 65) యొక్క హైదరాబాద్ విజయవాడ సెక్షన్ కి.మీ 40.00 నుండి కి.మీ 221.500 నకు సంబంధించి, తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి జిల్లా పరిధి లోని పంతంగి టోల్ ప్లాజా (Chainage: km 60 + 650), నల్గొండ జిల్లా పరిధిలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా (Chainage:km 118 + 250) మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల కృష్ణా జిల్లా పరిధిలోని చిల్లకల్లు టోల్ ప్లాజా (Chainage:km 205 + 025) ల వద్ద వినియోగదారుని ఫీజు యొక్క వార్షిక సవరణ దిగువ తెలిపిన విధంగా తేది 1 ఏప్రిల్ 2020 నుండి వర్తించును.

(Amount in Rs.)

| వాహనం రకం | (60 + 650 కి.మీ) గ్రామం - పంతంగి | | | (118 + 250 కి.మీ) గ్రామం - కొర్లపహాడ్ | | | (205 + 025 కి.మీ) గ్రామం - చిల్లకల్లు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | సింగిల్ జర్నీ | రిటర్న్ జర్నీ | నెలసరి పాస్ (50 ట్రిప్స్) | సింగిల్ జర్నీ | రిటర్న్ జర్నీ | నెలసరి పాస్ (50 ట్రిప్స్) | సింగిల్ జర్నీ | రిటర్న్ జర్నీ | నెలసరి పాస్ (50 ట్రిప్స్) |
| కార్, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటారు వాహనం | 80 | 115 | 2605 | 105 | 160 | 3535 | 90 | 135 | 2945 |
| లైట్ కమర్షియల్ వాహనం, లైట్ గూడ్స్ వాహనం లేదా మినీ బస్ | 125 | 185 | 4120 | 170 | 255 | 5615 | 140 | 210 | 4655 |
| బస్ లేదా ట్రక్ (2 యాక్సిల్) | 255 | 385 | 8515 | 350 | 525 | 11640 | 290 | 435 | 9620 |
| హెచ్‌సిఎమ్/ఇఎమ్‌వి లేదా మల్టీ యాక్సిల్ వాహనం (ఎమ్‌ఎవి) (3 నుండి 6 యాక్సిల్) | 395 | 590 | 13160 | 540 | 810 | 18050 | 445 | 670 | 14865 |
| పెద్ద వాహనాలు (7 లేదా మరిన్ని యాక్సిల్స్) | 495 | 740 | 16475 | 675 | 1010 | 22460 | 560 | 840 | 18615 |

టోల్ ప్లాజాకు 20 కి.మీ సరిహద్దు పరిధిలో నివసిస్తున్న మరియు నాన్ కమర్షియల్ ఉద్దేశ్యం ప్రకారం రిజిస్టరు చేసుకున్న స్థానిక కారు/జీపు/వాన్ వాహనాలకు 2020-21 సం॥ నకు గాను రూ. 275/- నెలసరి పాస్ వర్తిస్తుంది.

2. పైన పేర్కొనబడిన రేట్లు
i) పంతంగి టోల్ ప్లాజా వద్ద 45.35 కి.మీ రహదారి పొడవు మరియు 51.60 కోట్ల ఖర్చుతో నిర్మించిన 4 కి.మీ బైపాస్ పొడవు కలిపి మొత్తం 49.35 కి.మీ పొడవునకు వర్తించబడును.
ii) కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద 67.130 కి.మీ రహదారి పొడవు మరియు 60.00 కోట్ల ఖర్చుతో నిర్మించిన 5.15 కి.మీ బైపాస్ పొడవు కలిపి మొత్తం 72.280 కి.మీ పొడవునకు వర్తించబడును.
iii) చిల్లకల్లు టోల్ ప్లాజా వద్ద 50.780 కి.మీ రహదారి పొడవు మరియు 62.22 కోట్ల ఖర్చుతో నిర్మించిన 9 కి.మీ బైపాస్ పొడవు కలిపి మొత్తం 59.780 కి.మీ పొడవునకు వర్తించబడును.
3. పైన పేర్కొన్న టోల్ ప్లాజాల వద్ద దిగువ తెలిపిన రాయితీలు వర్తింపబడును.
i) తిరుగు ప్రయాణానికి సంబంధించి టికెట్ కొనుగోలు చేసిన సమయం నుండి 24 గంటల సమయం వరకు అన్ని రకాల వాహనాలకు రుసుములో 25% మినహాయింపు వర్తించును.
ii) నెలసరి పాస్ తీసుకున్న వాహన దారులు పాస్ ధర చెల్లించిన దగ్గర నుండి ఒక్క నెలలో 50 లేదా అంతకంటే ఎక్కువ ఒక వైపు ట్రిప్పులు వాడుకునే అన్ని రకాల వాహనాలకు రుసుములో 33% మినహాయింపు వర్తించును.
iii) టోల్ ప్లాజా కు 20 కి.మీ పరిధిలో నివసిస్తూ నాన్ కమర్షియల్ ఉద్దేశ్యం ప్రకారం రిజిస్టరు చేసుకున్న స్థానిక వాహనాలకు ఒక్క కాలెండరు నెలకు నెలసరి పాస్ రేటు రూ. 275/-
4. టోల్ రుసుము మినహాయింపు ఇచ్చిన వాహనాల యొక్క లిస్టు తేది: 06.06.2012 న ఫీ నోటిఫికేషన్‌లో ఇవ్వబడింది.
5. పరిమితికి మించి బరువు కలిగిన వాహనాలపై పది రెట్లు అదనపు ఫీజు వర్తించును మరియు అదనపు బరువు ను తీసివేసిన తరువాత రహదారిపై సదరు వాహనమును అనుమతించబడును.
6. తేది: 09.10.2009 నాటి కన్సెషన్ అగ్రిమెంట్ ప్రకారం కన్సెషన్ పీరియడ్ 2035 సం. వరకు కొనసాగబడును. కన్సెషన్ అగ్రిమెంట్ కాల పరిమితి పూర్తి అయిన పిమ్మట టోల్ ఫీజు 40% కు తగ్గించబడును.
7. తేది:06.06.2012 న గెజిట్‌లో ప్రచురించబడిన ఫీ నోటిఫికేషన్,తేది 30.03.2020 న NHAI చే అనుమతి పొందిన టోల్ ఫీజు యొక్క వార్షిక సవరణ రేట్లకు సంబంధించిన లెటరు మరియు కన్సెషన్ అగ్రిమెంట్ యొక్క ఇతర నిబంధనలకు http://nhtis.org ను చూడగలరు.
8. ఏదైనా సమాచారం/ఫిర్యాదులు/సలహాల నిమిత్తం ఈ దిగువ తెలిపిన పేరు మరియు చిరునామాలో సంప్రదించగలరు:

| | కన్సెషనర్ | ఇండిపెండెంట్ ఇంజనీర్ | NHAI యొక్క PIU |
|---|---|---|---|
| ప్రతినిధి పేరు | శ్రీ.కెవియెస్ యెస్.శ్రీకాంత్ | శ్రీ.షాబాజ్ ఆలం | శ్రీ. ఎమ్. కె. ఆర్. కిరణ్ |
| చిరునామా | మెస్సర్స్. జీఎమ్ఆర్ హైదరాబాద్ విజయవాడ ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ టోల్ ప్లాజా-2 కిమీ 118+180 కొర్లపహాడ్ గ్రామంకే రెవల్లి మండలం నల్గొండ జిల్లా తెలంగాణ - 508 211 | మెస్సర్స్. కె అండ్ జె ప్రాజెక్ట్స్ ప్రై.లి ఇంటి నెంబరు: 1-2-270 మొదటి అంతస్తు : 103/23/7 వెంకటేశ్వరకాలనీ, సూర్యపేట, తెలంగాణ ఇట్లు వెంకటేశ్వర రావు నంకినేని, సూర్యపేట, తెలంగాణ - 508 213 | నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవే) ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్, 25ఎ అండ్ 28ఎ, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ), కాలేజ్ పార్క్ క్యాంపస్ రోడ్ నం. 3, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ. |
| మొబైల్ నెం: | +91-7318082840 | +91-7821085839 | +91-9908261490 |

GMR GROUP - HVE / 9-D/ PREM ASSOCIATES - TEL

## ఇప్పుడు కూడా..?

ప్రసూతి వైరాగ్యం, శ్మశాన వైరాగ్యం అంటూ ఏవేవో చెప్పారు కానీ, ప్రళయ వైరాగ్యం గురించి ఎవరూ చెప్పలేదు. లోకం పుట్టి మునిగిపోతున్నప్పుడు, మనుషుల కళ్లు తెరుచుకుంటాయా? నహి నహి రక్షతి డుకృఞ్ కరణే, అని తెలివి కలుగుతుందా, లోకమంతా భ్రమ అని, స్వార్థం, లోభం, మదం మాత్సర్యం అన్నీ పాపాలే అని తెలిసి వస్తుందా? మనుషులం పరస్పరం ప్రేమాదయాకరుణా చూపించుకుంటే ప్రపంచం క్షణికమైనా స్వర్గంగా మారుతుందని గ్రహింపు కలుగుతుందా?

కలగదేమో? మనిషి ప్రవృత్తి ఇంకా ఇంకా అరిషడ్వర్గాలవైపే మొగ్గు చూపుతుందేమో? అప్పుడెప్పుడో నలభయ్యేళ్ల కింద మింట ఎగిరే ఉపగ్రహం విరిగి మీద పడుతుందని తెలిసి, జనం ఏమి చేశారు? ఉన్న నాలుగురోజులు తెగ తిందాం తాగుదాం అనుకున్నారు, క్షణికమే కదా అని ఇంకా బిగుతుగా కావలించుకున్నారు. ఏ ద్వేషాన్నీ వదులుకోలేదు, ఏ ఆస్తినీ పంచిపెట్టలేదు.

ఒక రోగ కారక అర్ధజీవి, మనిషి నుంచి మనిషికి లంఘిస్తూ, ఉనికికే ప్రమాదం తెస్తున్న సమయంలో, మానవులు ఏమి చేయాలి? ఈ గండం గట్టెక్కడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మనిషి అన్నది తప్ప మరొక తరగతిని ఆలోచనల్లోకి రానివ్వకూడదు. నిన్నటిదాకా, డబ్బుతోను, మతంతోను, కులంతోను, హోదాతోను, స్త్రీపురుష భేదంతోను, తెగతోను, ప్రాంతంతోను, రంగుతోను.. రకరకాలుగా చూపించిన తేడాలన్నిటినీ తుడిచిపెట్టుకుని, ఒకరికొకరం నిలబడాలి. కానీ, ప్రాణం పోతున్నా తేడాలని వదలని చరిత్ర మనది. ప్రాణాలు తీసైనా తేడాలను కాపాడుకునే ఘనత మనది. అందుకని, ఈ ప్రళయకాలం ఇవ్వవలసినంత వైరాగ్య జ్ఞానాన్ని, కావలసినంత మనుగడల జ్ఞానాన్ని ఇవ్వడంలేదు.

ఒక మత సంబంధ కార్యక్రమంలో పాల్గొన్న విదేశీయుల కారణంగా కరోనా ఆందోళనకరంగా వ్యాపిస్తున్న మాట నిజమే. అటువంటి ప్రమాదం ఏ రకమైన సమూహాల వల్లనైనా జరిగే అవకాశమున్నది. బాధ్యతారహితంగా మన పౌరులు ధిక్కరిస్తున్న లాక్‌డౌన్ నియమాల వల్ల కూడా జరగవచ్చు. జనతాకర్ఫ్యూ ప్రకటించిన మరుక్షణమే దుకాణాలపై దాడికి వెళ్లినట్టు వెళ్లిన జనాల వల్ల జరగవచ్చు. వేలాది, లక్షలాది మంది వలసకార్మికులు, తామున్నచోట మనుగడలేక తండోపతండాలుగా చేస్తున్న ప్రయాణాల ద్వారా కూడా జరగవచ్చు. ఇటువంటి సంఘటనలకు కుట్రసిద్ధాంతాలను ఆపాదించడం అంటే, ఈ కల్లోలంలోనూ మన పుర్రెలలో పాత వైరస్ తలెగరేస్తున్నదన్న మాట. కుట్రను ఒక దేశానికి ఆపాదించడమైనా, ఒక వర్గానికో ఒక శ్రేణికో ఆపాదించడమైనా, పరీక్షాకాలంలో మనం వదులుకోని అరిషడ్వర్గాలకే సూచిక.

ఒకపక్క, కరోనా ముప్పు ముసురుకుంటున్నప్పటికీ, అమెరికా వాడు యుద్ధవిమానాలను మాత్రం కిందకు దింపలేదు. ఇరాక్‌నో ఇరాన్‌నో బెదిరించడానికి బాంబులు వేస్తూనే ఉన్నాడు, మార్చి 15 దాకా. ఇరాన్‌లో మహమ్మారి విజృంభించి అంతమందిని కబళిస్తున్నా కూడా, ఆ దేశం మీద ఆంక్షలను సడలించడానికి కూడా ట్రంపుగారికి మనసు రాలేదు. కాళ్లూ చేతులూ కట్టేసి ఉన్న దేశం ఏమి యుద్ధం చేయగలదు? ప్రపంచమంతా లాక్‌డౌన్ కావడానికి ముందే కశ్మీర్‌లో లాక్‌డౌన్ అమలయింది. అక్కడ ఇంటర్నెట్‌ను బ్యాన్ చేశారు. సడలింపులలో భాగంగా పునరుద్ధరించారు కానీ, పురాతన 2జి స్థాయిలోనే అక్కడి కమ్యూనికేషన్లను అనుమతిస్తున్నారు. 4జి వేగం లేకపోవడం వల్ల, వైద్యసర్వీసులను అందించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను డాక్టర్లు చెబుతున్నారు. రాజకీయాలు, ఉద్యమాలు, నిర్బంధాలు తరువాత చూసుకోవచ్చు. ప్రాణాలు కాపాడాలి కదా ముందు, కనీసం వ్యాధిగ్రస్త ప్రాణాలు.

కరోనా నుంచి ప్రధానంగా ఉన్న ముప్పు వయోధికులకు. వ్యాధి ప్రబలిన అనేక దేశాల్లో, వయోధికులనే కాదు, శిక్షలనుభవిస్తున్న ఖైదీలందరినీ విడుదల చేశారు. జైళ్లలో వ్యాధి వ్యాపిస్తుందనే ఉద్దేశంతో, బంధుమిత్రులు కలవడానికి వీలులేకుండా ఆంక్షలు విధించారు. దానితో జైళ్లలో మగ్గుతున్నవారి కష్టాలు రెట్టింపయ్యాయి. కనీసం వయోధికులను, పోనీ, కనీసం రాజకీయకారణాలతో నిర్బంధించినవారిలో పెద్దవయసు వారిని, కనీసం తాత్కాలికంగా విడుదల చేయమని అడిగితే, ప్రాసిక్యూషన్ ససేమిరా అన్నది, న్యాయమూర్తి వారితో ఏకీభవించి, విడుదల కుదరదన్నారు. కరోనాతో పోరాడుతున్న వేళ, సుప్రసిద్ధ తెలుగు కవి, ఎనభైఏళ్ల వయోధికుడు వరవరరావును జైలులో నిర్బంధించి ఉంచడం ఈ వ్యవస్థకు అంత ముఖ్యమా? ప్రాణభయంతో అంతా సొంతంగా గృహనిర్బంధంలో ఉంటున్న ఈ కాలంలో, జైళ్లలోని వయోవృద్ధులను ఒకసారి తలచుకోవడం ఈ సమాజానికి అవసరం.

ఒక స్తంభనలో ఉన్నామంటే, ఎక్కడి వాటిని అక్కడ నిలుపుదల చేసి, ఒక దశ దాటిన తరువాత, తిరిగి ప్రయాణం ప్రారంభిస్తామని అర్థం. ఈ దశలో వైరుధ్యాలు, శత్రుత్వాలు పక్కనపెట్టాలి. ఇది మనిషికీ, ఒక వ్యాధికీ మధ్య పోరాటం కదా? ఈ దశను అదునుగా తీసుకుని పైచేయి కోసం ఎవరూ చూడకూడదు. ఆఫ్ఘనిస్థాన్‌లో ఏదో ఒక ఒప్పందం జరిగింది. ఇంతలో ఈ ఉపద్రవం వచ్చింది. ఇప్పుడు ఆ ఒప్పందాన్ని భంగపరిచే విధంగా దాడులు, ఘర్షణలు సరిఅయిన పద్ధతి కాదు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు, భద్రతాదళాలకు కూడా ఇప్పుడు ఘర్షణలు జరగడంలో అర్థం లేదు. యాంబుష్‌లు జరిపి, సిఆర్‌పిఎఫ్ జవాన్లను చంపడం కానీ, ఎదురుకాల్పుల్లో మావోయిస్టులను చంపడం కానీ అసందర్భం. ఇప్పటి ప్రాధాన్యాలను గుర్తించి, ఉభయపక్షాలూ సంధి పాటించాలి. ఈ సంధి రేపటి అవగాహనకు కూడా ఉపయోగపడవచ్చు.

ఈ సమయంలో క్యూబాను అభినందించకుండా ఉండలేము. ఫిడెల్ కాస్ట్రో తప్పుకున్నా, రౌల్ కాస్ట్రో తప్పుకునే దశలో ఉన్నా, ఆ దేశం తన సత్సంప్రదాయాలను వదులుకోలేదు. ప్రజారోగ్యంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన క్యూబా మానవవిలువలలో కూడా తన విశిష్టతను చాటుకున్నది. స్వయంగా తను కరోనాను ఎదుర్కొంటూనే ఇతరులకు సాయం చేస్తున్నది. ఏ దేశమూ తన తీరాన్ని తాకడానికి అంగీకరించనప్పుడు, కరోనా వ్యాధిపీడితులతో ఉన్న ఒక బ్రిటిష్ నౌకను తన రేవుకు పిలిచి, వైద్యం అందించింది. అమెరికా అండలోనే ఉండే బ్రిటన్ క్యూబాకు మిత్రదేశమేమీ కాదు. నాటో కూటమిలో ఉండే ఇటలీకి వైద్యుల బృందాన్ని పంపింది. ఈ మంచితనమే కదా, ప్రపంచానికిప్పుడు కావల్సింది?

## ప్రజల ప్రాణాల తరువాతే అన్నీ!



■ వై.ఎస్. చౌదరి

ప్రపంచం అంతా కరోనా మహమ్మారిపై యుద్ధం చేస్తోంది. కరోనా ప్రతాపానికి సంపన్న దేశాలైన అమెరికా, చైనా, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ సైతం విలవిలలాడుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. కనిపించని శత్రువుపై ప్రపంచం యుద్ధం చేస్తోంది. ఈ యుద్ధంలో ప్రతి ఒక్క పౌరుడూ సైనికుడే. అందరి సహకారంతో జరగాల్సిన పోరాటమిది. కొద్దిరోజుల పాటు ఎక్కడివారక్కడే వుండి, గృహనిర్బంధాన్ని పాటిస్తే కరోనా విస్తరణను అడ్డుకోవచ్చని ప్రపంచ ఆరోగ్యసంస్థ చెబుతోంది.

అందుకే ప్రధానమంత్రి మోదీ ముందుచూపుతో భారతదేశంలో మూడు వారాలపాటు లాక్‌డౌన్ ప్రకటించారు. లాక్‌డౌన్‌వల్ల అత్యవసర సర్వీసులు, నిత్యావసరాలు మినహా మిగతా అన్నీ మూతపడ్డాయి. దేశంలోని రాష్ట్రాలు తమ సరిహద్దులను మూసివేసి రక్షణ చర్యలు చేపట్టాయి. కేంద్రప్రభుత్వం జాతీయస్థాయిలో కరోనా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రాష్ట్రాలతో, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ కరోనా నియంత్రణ చర్యలు చేపడుతోంది. అయితే ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా చిత్తశుద్ధితో కరోనాపై జరుగుతున్న పోరులో లాక్‌డౌన్‌కు సహకరించి ఇంటికే పరిమితమవ్వాలి. లాక్‌డౌన్ వల్ల ఇబ్బందులుండవచ్చు. దేశానికి వేల కోట్ల రూపాయలు నష్టం రావచ్చు. కానీ ఆర్థిక నష్టం కంటే ప్రజల ప్రాణాలే ముఖ్యం. అందుకే ప్రధాన మంత్రి మోదీ కూడా ప్రజలను ఇబ్బందిపెడుతున్నందుకు మన్నించమని వేడుకుంటూ, ప్రజల ప్రాణాలు కాపాడాలంటే ఇంతకుమించి మార్గం లేదని చెబుతున్నారు.

ఎంతో ముందు చూపుతో తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మన దేశంలో కరోనా వేగంగా విస్తరించకుండా అడ్డుకునే అవకాశం ఏర్పడింది. కరోనా వ్యాప్తిని నిలువరించాలంటే దాని సాంక్రమిక వృత్తాన్ని తెగ్గొట్టాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. లాక్‌డౌన్ వల్ల వ్యాధి ప్రబలకుండా అరికట్టవచ్చు. ఈ లాక్‌డౌన్ సమయంలో కేసులను వెనువెంటనే గుర్తించి చికిత్స చేసే అవకాశం వుంటుంది. అమెరికా, ఇటలీ, స్పెయిన్, ఇరాన్ లాంటి దేశాలు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం మూలంగా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. 'కరోనాతో ఇరాన్‌కు ముప్పేమీ లేదు, క్వారంటైన్ చేయడం రాతియుగపు లక్షణమని' వ్యాఖ్యానించిన ఇరాన్ మంత్రి ఇరాజ్ ఆ తరువాత రోజే కరోనా బారిన పడ్డారు. ఆయన ఇరాన్‌లో కరోనా వ్యతిరేక పోరాట విభాగానికి అధిపతి కూడా. ఇక అమెరికాలో రోజుకు పదివేలకు పైగా కేసులు నమోదవుతూ అక్కడి ప్రజలను, ప్రభుత్వాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఐరోపా దేశాల్లో ఇప్పటికి 20 వేల మందికి పైగా కరోనాతో మరణించారు. యూరప్, అమెరికాతో పోల్చినపుడు మనకు వైద్య సదుపాయాలు తక్కువే. మన జనాభా మాత్రం అమెరికా జనాభా కంటే మూడు రెట్లు ఎక్కువ. జనసాంద్రత కూడా ఎక్కువే. రోడ్లు, ప్రజారవాణా, కార్యాలయాలు జనంతో కిక్కిరిసి వుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో కరోనా విజృంభిస్తే పరిస్థితి మనచేతుల్లో వుండదు. అందుకే కేంద్రప్రభుత్వం సత్వరం లాక్‌డౌన్ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల మన దేశంలో కరోనా కేసుల పెరుగుదలను మిగతా దేశాలతో పోలిస్తే గణనీయంగా తగ్గించగలిగాము.



**లాక్‌డౌన్ వల్ల దేశానికి రోజుకు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందన్న మాట వాస్తవమే. పేదలకు ఇది శరాఘాతమే. అందుకే జరిగే నష్టాన్ని తట్టుకోవడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రాలకు వైద్యపరమైన సహాయాలతో పాటు నిత్యావసర వస్తువుల సరఫరాను పెంచింది. మూడు నెలలకు సరిపడా బియ్యం, గోధుమలు, చక్కెర విడుదల చేసింది. రైతులు పండించిన పంటను ఇంటికి తేవడానికి, ఇంటికొచ్చిన పంటను మార్కెట్లో అమ్మడానికి తగిన ఏర్పాట్లు, గిట్టుబాటు ధరలు కల్పించాలని రాష్ట్రాలను ఆదేశించింది.**

లాక్‌డౌన్ వల్ల దేశానికి రోజుకు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందన్న మాట వాస్తవమే. పనికి వెళ్తితే తప్ప నాలుగువేళ్లు నోట్లోకి పోని నిరుపేదలకు ఇది శరాఘాతమే. అందుకే జరిగే నష్టాన్ని తట్టుకోవడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రాలకు వైద్యపరమైన సహాయాలతో పాటు నిత్యావసర వస్తువుల సరఫరాను పెంచింది. మూడు నెలలకు సరిపడా బియ్యం, గోధుమలు, చక్కెర విడుదల చేసింది. రైతులు పండించిన పంటను ఇంటికి తేవడానికి, ఇంటికొచ్చిన పంటను మార్కెట్‌లో అమ్మడానికి తగిన ఏర్పాట్లు, గిట్టుబాటు ధరలు కల్పించాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఉపాధి కోసం దేశం లోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వలస కూలీలకు అండగా వుండి, ఆహారం, ఆశ్రయం కల్పించాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది. తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న ఆక్వా, పౌల్ట్రీ రంగాలను కూడా ఆదుకోవాల్సిన అవసరం వుంది. లాక్‌డౌన్ వల్ల పేదలు పస్తులుండరాదన్న మానవీయ దృక్పథంతో కేంద్రం పలు చర్యలు తీసుకుంది. సామాన్యులకు ఆర్థిక భద్రత, పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు మోదీ కృత నిశ్చయంతో వున్నారు. లాక్‌డౌన్ ప్రకటించిన 36 గంటల్లోనే వారి కోసం ప్రత్యేక ప్యాకేజిని ప్రకటించారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పేరుతో కేంద్రం ఒక లక్షా 70 వేల కోట్ల రూపాయల ప్యాకేజి ప్రకటించింది. ఈ ప్యాకేజి కింద దేశంలో 80 కోట్ల మంది పేదలకు 3 నెలల పాటు ఉచితంగా నెలకు 5 కిలోల చొప్పున గోధుమలు లేదా బియ్యం, ఒక కిలో పప్పు ధాన్యాలు ఇప్పుడిస్తున్న రేషన్‌కు అదనంగా ఇస్తారు. జన్‌ధన్ ఖాతాలున్న 20 కోట్ల మంది మహిళలకు మూడు నెలల పాటు నెలకు రూ.500 చొప్పున ఖాతాలో జమ చేస్తారు. ఉపాధి హామీ కూలీ రూ.182 నుంచి రూ.202కు పెంచింది. పిఎం కిసాన్ యోజన లబ్ధిదారులైన రైతులకు ఖరీఫ్ సాయం కింద ఏప్రిల్ లోనే రూ.2 వేలు ఇవ్వనున్నారు. డ్వాక్రా మహిళల రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద లబ్ధి పొందిన 8.3 కోట్ల కుటుంబాలకు మూడు నెలల పాటు ఉచితంగా గ్యాస్ సిలెండర్లు సరఫరా చేయనుంది. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రెండు విడతల్లో వెయ్యి రూపాయలు ఇవ్వనుంది. కరోనాపై అలుపెరగని పోరాటం చేస్తున్న వైద్య శాఖ, పారామెడికల్ ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బందికి రూ.50 లక్షల వరకు వైద్య బీమా ఇస్తోంది. వందమంది లోపు ఉద్యోగులుండే సంస్థల్లో పనిచేసే వారి పిఎఫ్ కేంద్రమే చెల్లించనుంది. రైతులకు, వ్యవసాయ కూలీలకు కేంద్రం లాక్ డౌన్ నుంచి మినహాయింపు ఇచ్చింది.

ఒకవైపు వ్యాధి ప్రబలకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటూనే మరో వైపు దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది, మధ్యతరగతి, వ్యాపార వర్గాలకు ఊరటనిచ్చే విధంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు నిర్ణయాలు ప్రకటించింది. లాక్‌డౌన్ నేపథ్యంలో రుణ వాయిదాల చెల్లింపులపై భయాందోళనలకు ఆర్బీఐ చెక్ పెట్టింది. బ్యాంకులిచ్చిన అన్ని రకాల రుణాల కిస్తీలను, క్రెడిట్ కార్డు బిల్లులను మూడు నెలల పాటు వాయిదా వేసింది. వర్కింగ్ క్యాపిటల్ పై వడ్డీలకు మూడు నెలలపాటు మారటోరియం విధించింది. కొత్తగా ఇచ్చే రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించింది. రెపో రేటును 4.4 శాతానికి, రివర్స్ రెపో రేటును 4 శాతానికి తగ్గించడం, బ్యాంకుల నగదు నిల్వ నిష్పత్తిని గణనీయంగా తగ్గించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలోకి నగదు లభ్యత పెరగనుంది. జిడిపిలో 2 శాతానికి సమానమైన రూ.3.74 లక్షల కోట్ల రూపాయలు మార్కెట్లోకి రానుంది. దీని వల్ల పారిశ్రామిక, వ్యాపార వర్గాలకు మేలు జరగనుంది. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ భద్రతకు ఎలాంటి ఢోకా లేకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది.

మనం తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల కారణంగా ఇవ్వాళ్టివరకు మిగతా ప్రపంచం కంటే మనం ఎంతో మెరుగైన స్థితిలో ఈ వైరస్‌ను అదుపులో పెట్టాము. పలుదేశాల్లో వేలాది కేసులు, మరణాలు సంభవించాయి. భారతదేశంలో మాత్రం ఇప్పటివరకు 1200 కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఈ వ్యాధిని దేశం నుంచి తరిమికొట్టే వరకు ప్రజలు, పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం విశ్రమించకూడదు. మరికొన్ని రోజులు ఇబ్బందులను తట్టుకుంటే స్వల్ప నష్టంతో మనం బయటపడే అవకాశం వుంది. లాక్‌డౌన్‌లోనూ విరామం లేకుండా పని చేస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది శ్రమ, త్యాగం వెలకట్టలేనిది. అన్ని వర్గాలూ సామాజిక బాధ్యతతో ప్రభుత్వానికి సహకరించి మరి కొద్ది రోజులు ఇలాగే ఇళ్లకి పరిమితమైతే కరోనాపై జరుగుతున్న యుద్ధంలో దేశం విజయం సాధిస్తుంది.

*(రాజ్యసభ సభ్యులు)*

# కరోనా నేర్పుతున్న పాఠాలు

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

కరోనా వైరస్ మూలంగా దేశ వ్యాప్తంగా విధించిన 21 రోజుల లాక్‌డౌన్‌ను పొడిగించే విషయంలో ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని కేంద్ర కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా ప్రకటించిన రోజే మరో ఆందోళనకరమైన వార్త వెలుగులోకి వచ్చింది. మార్చి రెండవ వారంలో హజ్రత్ నిజాముద్దీన్ ప్రాంతంలో తబ్లీగీ జమాత్ అనే సంస్థ ఏర్పాటు చేసిన ప్రార్థనా సమావేశాల్లో పాల్గొన్నవారిలో అనేకమందికి కరోనా వైరస్ సోకిందని, వారి ద్వారా ఇతరులకు కూడా పాకిందనే వార్త సహజంగానే చాలామందికి భయాందోళనలు కలిగించింది. నిజానికి ఈ విషయంపై గత రెండు మూడు రోజులుగా విలేఖరులు, పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో మార్చి రెండవవారంలో పెద్ద సంఖ్యలో ఒక మతస్థులు ఏమైనా సమావేశాలు జరిపారా.. అని ఆరా తీశారు. నిజానికి ఢిల్లీలోని రామలీలా మైదానంలో కాని, ఇతర బహిరంగ ప్రాంతాల్లో కానీ మార్చి రెండో వారంలో అధికారికంగా ర్యాలీలు, సమావేశాలు జరగలేదు. కాని నిజాముద్దీన్ ప్రాంతంలోని అలామీ మర్కజ్ బంగ్లేవాలీ మసీదులో అనధికారికంగా ప్రార్థనా సమావేశాలు జరిగాయని, దేశంలోని వివిధ ప్రాంతాల్లో కరోనా సోకిన వారు అనేకమంది ఈ సమావేశాలకు హాజరయ్యారని చివరకు తేలింది. ఈ మసీదులో ఇలాంటి ప్రార్థనా సమావేశాలు జరగడం, ఇండోనేషియా, మలేషియా, సౌదీ అరేబియా, కిర్గిస్తాన్ తదితర దేశాల వారు కూడా ఈ ప్రార్థనా సమావేశాలకు హాజరు కావడం తరుచూ జరుగుతుంటుందని కూడా తెలిసింది. ప్రగాఢ భక్తి విశ్వాసాలను ప్రచారం చేసే తబ్లీగీ జమాత్ సంస్థ నిర్వహించే ప్రార్థనా సమావేశాలకు హాజరయ్యేవారు పూర్తిగా దైవభక్తిలోనే లీనమై ఉంటారు. లౌకిక విషయాల పట్ల వారికి పట్టింపు ఉండదు. బయట ప్రపంచంలో ఏమి జరుగుతున్నదో, రాజకీయాలు ఎలా ఉన్నాయో వారికి సంబంధం ఉండదు. టీవీలు, పేపర్లు కూడా చూడరని అంటారు. ఆహారం, విలాసాలపై కూడా వారికి మక్కువ ఉండదు. భోజనం, నిద్రకు తక్కువ సమయం కేటాయించి నిత్యం ప్రార్థనలోనే నిమగ్నమవుతారు. టెక్నాలజీని పెద్దగా పట్టించుకోరు. తమ రోజువారీ ఆధ్యాత్మిక కార్యకలాపాల గురించి తాము నేర్చుకున్న మత బోధనల గురించి ఒకరికొకరు సన్నటి స్వరంతో పంచుకుంటారు. వారేం మాట్లాడుకుంటున్నారో ఇతరులు గ్రహించలేరు. ప్రపంచంలో ఇలాంటి మత విశ్వాసాలు ఉండేవారు పెద్ద సంఖ్యలో అనేక మతాల్లో ఉన్నారు. ఉపవాసాలు చేసేవారు, నిష్టగా ఉండాల్సిన సమయంలో మంచినీరు కూడా ముట్టని వారు, మైళ్ల కొద్దీ నడిచి తీర్థయాత్రలకు వెళ్లేవారు, పొర్లు దండాలు పెట్టేవారు ఎలాంటి వారో తబ్లీగీ జమాత్ సంస్థ విశ్వాసాలు నమ్మే వారు కూడా అలాంటి వారే. అయితే ఈ సంస్థ పేరు ఉపయోగించుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినవారు లేకపోలేదు. అందుకే కొన్ని దేశాల్లో ఈ సంస్థను నిషేధించారు. మన దేశంలో ఈ సంస్థ గురించి ఎలాంటి అనుమానాస్పద సమాచారం అందనందువల్లనేమో వారి ప్రార్థనా సమావేశాలు యథావిధిగా సాగుతున్నాయి. భారతదేశంలో సిఏఏ వ్యతిరేక నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయని తెలిసినప్పటికీ, కరోనా వైరస్ తీవ్రత ఇతర దేశాల్లో పొడసూపినప్పటికీ నిజాముద్దీన్ వద్ద మసీదులో జరిగిన సమావేశానికి వివిధ దేశాల వారు వచ్చి ప్రార్థనలు జరుపుకోవడానికి వీలుగా వారికి వీసాలు లభించాయి. ఇందుకు ప్రార్థనలు జరిపిన వారిని కానీ నిర్వహించిన వారిని కానీ తప్పుపట్టడానికి వీలు లేదు. మతం ప్రాతిపదికగా నిందించడానికి కూడా ఆస్కారం లేదు. ఆ సమయంలో దేశంలో ఇతర చోట్ల కూడా పెళ్లిళ్లు, విందులూ, రాజకీయ సమావేశాలు జరిగాయి. ఒక విందుకు హాజరైన పార్లమెంటు సభ్యులు కూడా క్వారంటైన్ పాటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్లమెంట్ సభ్యులు, విఐపిలు, విదేశాల నుంచి వచ్చిన ప్రముఖులు అయితే సులభంగా గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉన్నది. వారి గురించి మీడియా కూడా ప్రముఖంగానే ప్రచురిస్తుంది. కాని సామాన్య యాత్రికులు, పర్యాటకులు జమాత్ లాంటి ఎలాంటి అంతర్గత సమావేశాల్లో పాల్గొన్నారో. ఎక్కడెక్కడ తిరిగారో కనిపెట్టడం అంత సులభం కాదు. అందుకే నిజాముద్దీన్ ప్రార్థనా సమావేశం గురించి వచ్చిన వార్త ఆందోళన కలిగిస్తోంది. అయినా ఏదైనా అనుభవంలోకి వచ్చిన తర్వాత కాని చర్యలు తీసుకోకపోవడం అనేది మన దేశంలో వ్యవస్థలకు. ప్రభుత్వాధినేతలకు అలవాటైన విషయమే. ఇప్పుడు తీసుకున్న చర్యలను రెండు వారాల ముందు తీసుకుని ఉంటే జమాత్ లాంటి సమావేశాలకు ఆస్కారం ఉండేది కాదనేది చాలామంది పెద్దల అభిప్రాయం. మార్చి 23 వరకూ దేశంలో జరిగిన పరిణామాలను చూస్తే పరిస్థితి చేయి దాటి పోతుందని గ్రహించిన తర్వాతే చర్యలు వేగవంతమయ్యాయని అర్థమవుతోంది.

ఒక నిర్ణయం తీసుకోవడానికి ఆలస్యం చేయడం ఎన్ని నష్టాలకు దారితీస్తుందో, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం కూడా అన్ని నష్టాలకూ దారితీస్తుంది. నాలుగేళ్ల క్రితం మన దేశంలో పెద్ద నోట్ల రద్దు ఆకస్మికంగా జరపడంతో ప్రజల జీవితాల్లో కల్లోలం రేగిన తర్వాత అనేక చర్యల్ని తీసుకోవాల్సి వచ్చింది. అదే విధంగా జీఎస్టీ అమలు కూడా ఎన్నో సమస్యలకు దారితీసింది. పౌరసత్వ చట్టం చేయాలని అనుకున్నప్పుడు కూడా తర్వాత అది సామాజిక ప్రకంపనలకు, చివరకు మత కల్లోలాలకు దారితీస్తుందని ప్రభుత్వం ఊహించలేదు. కొద్ది రోజుల క్రితం 21 రోజుల లాక్‌డౌన్ ప్రకటించడానికి ముందు కూడా ప్రభుత్వం దాని వల్ల వచ్చే సమస్యలని అంచనా వేసినట్లు కనపడలేదు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా మధ్యతరగతి, సంపన్నులను దృష్టిలోనే పెట్టుకుని తీసుకుంటుంది కాని, సామాన్యులు, పేదలను, అసంఘటిత వర్గాలను దృష్టిలో పెట్టుకుని తీసుకోదని పాలకులు చేసే ప్రకటనలను బట్టి, ప్రజలనుద్దేశించి చేసే ప్రసంగాలను బట్టి అర్థమవుతోంది. దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలలోని ప్రజలు గ్రామాలకు వలస వెళతారని, బస్టాండులు కిక్కిరిసిపోయి తొక్కిసలాటలు జరుగుతాయని, మైళ్లకు మైళ్ల రహదారులు, రైలు పట్టాల మీద నడిచి వెళతారని, ఆకలితో అలమటిస్తారని ప్రభుత్వం అంచనా వేసినట్లు కనపడలేదు. రెండు మూడు రోజుల తర్వాత, పత్రికల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ దృశ్యాలు ప్రచారమైన తర్వాత కాని ప్రభుత్వంలో కదలిక కనపడలేదు. పేదల గురించి మేమెందుకు ఆలోచించడం లేదు? 36 గంటలే కదా అయింది.. అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్యాకేజీని ప్రకటిస్తూ అన్నారు. ఆమె నోట అత్యంత అరుదైన 'గరీబ్' అన్న పదం వినపడడం సంతోషకరమే కాని లాక్‌డౌన్ ప్రకటించినప్పుడు ఎవరూ ఎక్కడకూ వెళ్లనవసరం లేదని, వారందరికీ ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్కూళ్లలోనూ, ఇతర భవనాల్లోనూ, రోడ్డు ప్రక్కన క్యాంపుల్లోనూ ఆశ్రయం కలిపిస్తామని ఎందుకు స్పష్టం చేయ లేదు? పరిస్థితి తీవ్రమైన తర్వాతే కేంద్ర కేబినెట్ సెక్రటరీ రాష్ట్రాలకు లేఖ రాయాల్సి వచ్చింది. లాక్‌డౌన్ ప్రకటించిన నాలుగు రోజుల తర్వాత బస్సులు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. విచిత్రమేమంటే ఈ పరిస్థితుల్లోనూ రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. అక్టోబర్‌లో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ నుంచి వేలాదిమంది బిహార్‌కు చెందిన అభాగ్యులు తమ గ్రామాలకు పరుగులెత్తడం బిజెపి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుల మధ్య పరస్పర విమర్శలకు దారితీసింది. అంతేకాదు, గ్రామాలకు పెద్ద సంఖ్యలో వలస వెళ్లడం వల్ల కరోనావైరస్ గ్రామాలకు పాకే ప్రమాదం గురించి చర్చలు ప్రారంభమయ్యాయి.




***సమస్యలు వస్తే కాని ప్రభుత్వాలు కార్యాచరణకు దిగవని మన ప్రాథమిక ఆరోగ్య సంక్షేమ రంగాన్ని చూస్తేనే అర్థమవుతుంది. దేశంలో ఎన్నో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఒకే ఒక్క గదిలోనూ, గుడిసెల్లోనూ, చాలీ చాలని వసతుల్లోనూ, ఆఖరుకు విద్యుత్ కూడా లేని స్థితిలో నడుస్తున్నాయి. కరోనా కల్లోలం నేపథ్యంలో మన ఆరోగ్య రంగం ఎంత లోపభూయిష్టంగా ఉన్నదో స్పష్టమవుతోంది. ఈ వైరస్ ప్రమాదం తొలిగిన తర్వాతనైనా ఆరోగ్య వ్యవస్థపై ప్రభుత్వం సమగ్ర దృష్టిని సారించాలి.***

మన ప్రభుత్వాలు సమస్యలు వస్తే కాని కార్యాచరణలోకి దూకవని మన ప్రాథమిక ఆరోగ్య సంక్షేమ రంగాన్ని చూస్తేనే అర్థమవుతుంది. రాజ్యాంగంలోని 21వ అధికరణ ప్రకారం ప్రజలకు జీవించే హక్కును ప్రసాదించాలని చెప్పినప్పటికీ, ఈ అధికరణ ప్రకారం, ఆదేశిక సూత్రాల ప్రకారం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పూచీ ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు కూడా పలు సార్లు స్పష్టం చేసినప్పటికీ, 90 శాతం ప్రజల ఆరోగ్య అవసరాలను ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ ద్వారా తీర్చాలని ప్రపంచ బ్యాంకు చెప్పినప్పటికీ మన ప్రభుత్వాలు ఆరోగ్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. జీడీపీలో కేవలం ఒక శాతం మాత్రమే కేటాయిస్తూ ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రజల ప్రాణాల్ని వదిలేశాయి. గత బడ్జెట్‌లో కూడా కేంద్రం ఆరోగ్య రంగానికి పెద్దగా కేటాయింపుల్ని పెంచలేదు. జాతీయ ఆరోగ్య మిషన్‌కు కూడా నిధులు తగ్గించారు. ప్రాథమిక ఆరోగ్యానికి నిధులు పెద్ద ఎత్తున కేటాయించాలని 15వ ఆర్థిక సంఘం చేసిన సిఫారసును కూడా కేంద్రం పట్టించుకోలేదు. దేశంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 46 శాతం డాక్టర్లు, 82శాతం నిపుణుల కొరత ఉన్నదని ఒక అంచనాలో తేలింది. రెండేళ్ల క్రితం ఆరోగ్య, కుటుంబసంక్షేమంపై పార్లమెంటు స్థాయీ సంఘం నివేదిక ఆరోగ్య పరిశోధనావసరాలకూ, కేటాయింపులకూ పొంతన లేదని తేల్చింది. కొత్త ప్రయోగశాలలకు, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులకు, ఆరోగ్య పరిశోధనా సదుపాయాల పెంపునకు సరిపోయే నిధులే లేవు. దేశంలో ఎన్నో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఒకే ఒక్క గదిలోనూ, గుడిసెల్లోనూ, చాలీచాలని వసతుల్లోనూ, ఆఖరుకు విద్యుత్ కూడా లేని స్థితిలో నడుస్తున్నాయి. చాలా రాష్ట్రాలు నిధులు లేకపోవడం వల్ల వీటిని సమర్థంగా ఉపయోగించుకోవడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సమర్థంగా పనిచేయించడం, ప్రతి జిల్లాలోనూ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పర్చి డాక్టర్లు, అంటురోగ వ్యాధుల నిపుణులు, పారా మెడికల్ సిబ్బందిని నియమించాలని పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో మన ఆరోగ్య రంగం ఎంత లోపభూయిష్టమో స్పష్టమవుతోంది. ఈ వైరస్ ప్రమాదం తొలిగిన తర్వాతనైనా ఆరోగ్య వ్యవస్థపై ప్రభుత్వం సమగ్ర దృష్టిని సారించాలి.

విచిత్రమేమంటే మన ప్రధానమంత్రి మోదీ ఉపన్యాస కళలో మహా ఉద్దండుడు. లక్షలాది మంది పళ్లాలు, గంటలు మోగించేలా చేయడమే కాదు, ఉన్నట్లుండి తనను క్షమించమని ప్రజలను వేడుకుని ఉపన్యాసాన్ని రక్తి కట్టించగలరు. ఇవాళ లాక్‌డౌన్ వల్ల నిత్య జీవితంలో రాజ్యం విశ్వరూపం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ప్రజలు స్వచ్ఛందంగానే తాత్కాలికంగా తమ జీవితాల్లో రాజ్యంపెట్టిన ఆంక్షలను ఆహ్వానిస్తున్నారు కాని బలవంతంగా కాదని గ్రహించాలి. చివరకు ప్రజలను మెప్పించాలంటే ప్రజల ఆరోగ్య, ఆర్థిక అవసరాలను తీర్చడం ద్వారానే జరగాలి కాని తమ ఉనికిని ఏదో రూపంలో ప్రదర్శించుకోవడం ద్వారా జరగదు.

*(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)*

## రండి.. రక్తకాటేరుపై గెలుద్దాం!

ఇంత నిశ్శబ్దాన్ని ఎన్నడైనా అనుభవించామా? రాత్రిళ్లు వీధి కుక్కలు కూడా అరవడం మానేశాయి! ఆవుల మందల్లాగా లేళ్ళ గుంపులు కనుమ దారుల్లో కనిపిస్తున్నాయి. అడవి అంచు ఊళ్ళలో నెమళ్లు కోళ్లలా తిరుగుతున్నాయి. నిర్భయంగా నిదానంగా చిరుతలు రోడ్లు దాటుతున్నాయి. ఎంత వింత సందర్భం! అరుదే అయినా ఈ దృశ్యాలేవీ ఉల్లాసాన్నివ్వడం లేదు. ఆహ్లాదంగానూ అనిపించడం లేదు. పరచుకున్న నిశ్శబ్దం ప్రశాంతతనివ్వడం లేదు. అలజడి తగ్గడం లేదు. భార్యా బిడ్డా, అమ్మా నాన్నా, అక్కా తమ్ముడూ అందరూ ఇంట్లోనే ఉన్నా కుదురు లేదు. కనిపించని ప్రమాదమేదో ఘంటానాదంలా గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఉండి ఉండీ వెన్నులో ఏదో జరజరా పాకుతున్నట్టుగా ఉంటోంది. వాట్సాప్ తెరిచినా, టీవీ ఆన్ చేసినా, పేపర్ పేజీలు విప్పినా ఒక్కటే వార్త. ఇదంతా అప్రమత్తత కోసమే అని ఎంత సమాధానపరచుకున్నా తెలియని భయం ఒకటి లోపల్లోపలికి జొరబడిపోతోంది.

ముళ్ళు పొడుచుకొచ్చిన ఉమ్మెత్తకాయ ఆకారంలో ఉండే ప్రాణం లేని ఒక సూక్ష్మ క్రిమి సమస్త జన ప్రపంచాన్నీ కలవరపెడుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఈ మహమ్మారి బలి తీసుకుంటున్నది మానవ ప్రాణాలను మాత్రమే కాదు, మానవ సంబంధాలను కూడా. మనిషి నుంచి మనిషిని వేరు చేసింది. ఆలింగనం, కరచాలనం, ముద్దూ మురిపెం అన్నీ దూరం దూరం. మనిషికి మనిషి రెండు మీటర్ల ఎడం. ఇళ్ళు జైళ్ళయ్యాయి. పడక గదిలో మంచాలు వేరయ్యాయి. దూరదేశం నుంచీ తిరిగొచ్చిన బిడ్డను చేతులు చాచి హత్తుకోడానికి లేదు. మన ఊరి వాడే నగరం నుంచి బయటపడి ఇంటికి చేరుకున్నాడనే సంతోషం లేదు, ఏం మోసుకొచ్చాడో అనే సందేహం తప్ప. ఇల్లు చేరుకోలేక సరిహద్దు క్వారెంటైన్ గదుల్లోంచి మోగుతున్న ఫోన్‌లు ఏ గుండెల్నీ కరిగించడం లేదు.

రాష్ట్రానికీ రాష్ట్రానికీ నడుమ, జిల్లాకూ జిల్లాకూ మధ్య మొలుస్తున్న గోడలు, ఊళ్ల పొలిమేరల్లో అడ్డుపడుతున్న ముళ్ల కంచెలు.. సమైక్య భారతాన్ని సవాలు చేస్తున్నాయి. ఆప్యాయమైన పలకరింపులు మాయమై అనుమానపు చూపులు పెరిగాయి. పనివాళ్ళు పాదం మోపితే ఇల్లు 'మైల' పడుతుందేమోనన్న భయం. ఇస్త్రీ చేసి తెచ్చిన బట్టలు తాకడానికి జంకు. పొరుగింటి పుల్లగూరలు హఠాత్తుగా చేదయిపోయాయి. పక్కింటి వాళ్ళయినా సరే, గేటు బయట నుంచే మాటలు. 'లిఫ్ట్ ప్లీజ్' అని బతిమాలినా ఏ కారూ, ఏ బైకూ ఆగడం లేదు. కొనుక్కొచ్చుకున్న కూరగాయల మీద ఎన్ని చేతులు పడ్డాయో అని కడిగిందే కడగడం. కారు తలుపు తెరవాలన్నా, బైక్ హ్యాండిల్ తాకాలన్నా, దుకాణంలో వెనక్కిచ్చిన చిల్లర జేబులో వేసుకోవాలన్నా... చేతులు ముందుకు రావడం లేదు. పొద్దున్నే వచ్చే పాల ప్యాకెట్టు మీద అనుమానం.. నీళ్ళను మోసుకొచ్చే చేతుల మీద అనుమానం.. గ్యాస్ సిలిండర్ తెచ్చిన మనిషిని వంటింటిదాకా రానివ్వలేని భయం. నడిచే నేలా, రోజూ కూర్చునే కుర్చీ, వాడే మొబైల్, రాసే పెన్నూ.. దేన్నీ నమ్మలేనితనం. మనిషిలోంచి మనిషి మాయం.

ఈ అమానవీయతకంతా కారణమని కరోనానే నిందిద్దామా? నెపం మొత్తం పిపీలికం కన్నా చిన్నదైన ఆ సూక్ష్మ క్రిమి మీదే వేసేద్దామా? మరి, విపత్తు వేళ మన కళ్ల ముందు కనిపిస్తున్న అమానవీయ దృశ్యాలకు ఎవరిని బోనెక్కించాలి? రక్తకాటేరు లాంటి క్రిమితో పోరాడుతున్న ప్రభుత్వాసుపత్రుల్లో చాలినన్ని మాస్కుల్లేవు, చెత్త మోసుకెళ్తున్న చేతులకి గ్లౌజుల్లేవు. ఆంక్షలను ధిక్కరించి రోడ్ల మీదకు వస్తున్న వాళ్ళని ఎర్రటెండల్లో నిలబడి అడ్డుకుంటున్న పోలీసులకి భద్రకవచాల్లేవు. వైరస్ అనుమానితులతో మెలిగే ఎవరికైనా చైనా తరహా రక్షణకవచాలు ఎక్కడైనా

***మనిషిలోంచి మనిషి మాయం. ఈ అమానవీయతకు కరోనానే నిందిద్దామా? నెపం మొత్తం పిపీలికం కన్నా చిన్నదైన ఆ సూక్ష్మ క్రిమి మీదే వేసేద్దామా? కనిపించని శత్రువుతో బహిరంగ పోరాటం కుదరదు. శుభ్రతే అస్త్రంగా, ఇల్లే భద్రంగా గెరిల్లా యుద్ధ వ్యూహమే సాగాలి. గూడుకట్టుకుంటున్న భయం బద్దలు కావాలి. జనానికి భరోసా నివ్వాలి.***






చూశామా? వీధివీధీ తిరిగి జనానికి చేతులెత్తి మొక్కుతున్న రెవెన్యూ, మునిసిపల్ ఉద్యోగుల ప్రాణాలకున్న ముప్పును గ్రహిస్తున్నామా, వారి భద్రతకు తీసుకుంటున్న చర్యలేవి? లాక్‌డౌన్ ఒక పరిష్కారం కాదు, ప్రయత్నం మాత్రమే. దానికీ లొంగక ఉప్పెనలా వైరస్ విరుచుకుపడితే వెంటిలేటర్లేవీ? ఆక్సిజన్ నిల్వల్లేవు, తగినన్ని పడకల్లేవు. ఇదంతా ఎవరి అమానవీయత? ఉచిత పంపకాల కోసం వేల కోట్లు వెచ్చిస్తూ, ఆపద వేళ పదుల కోట్లు విదిలిస్తున్న ప్రభుత్వాలనేమనాలి? కరోనాకన్నా ఎన్నికలే ముఖ్యమని దబాయించిన నాయకులని ఏ కోర్టులో నిలబెట్టాలి? అయినా సరే నెపం కాసేపు కరోనా మీదే వేసేద్దామా? ఈ క్రూర ఘోర క్రిమి పుట్టిందెక్కడ, పుట్టించినదెవరు అని చర్చలు చేసుకుందామా? చైనానో, అమెరికానో కారణమని కాడి పడేయడానికి ఇది సమయమూ కాదు. ఇదొక యుద్ధం. కనిపించని శత్రువుతో బహిరంగ పోరాటం కుదరదు. శుభ్రతే అస్త్రంగా, ఇల్లే భద్రంగా గెరిల్లా యుద్ధ వ్యూహమే సాగాలి. గూడుకట్టుకుంటున్న భయం బద్దలు కావాలి. జనానికి భరోసా నివ్వాలి. గడప దాటకుండా చేసే సమీక్షలు సరిపోవు, ఊళ్లు తిరగాలి. ఆదేశాలు అమలవుతున్న తీరు స్వయంగా చూడాలి. సైన్యాన్ని వెనక ఉండి నడిపేవాడు కాదు, ముందు నిలబడి శంఖారావం పూరించేవాడే నిజమైన నాయకుడు. ఈ యుద్ధంలో బహుశా మనం గెలుస్తాం, మనమే గెలుస్తాం! రెండు నెల్లో, ఆరునెల్లో పట్టినా సరే.. గెలిచేది మాత్రం మనమే! పోరాటమే మన చరిత్ర. గెలుపే మన అస్తిత్వం. గెలిచి తీరుతాం. విజయీభవ!

◆ **ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు**

### క్వారంటైన్ హోమ్‌లుగా నౌకలు

ఆంధ్రప్రదేశ్‌లో నోవెల్ కరోనా కట్టడి కోసం రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ, అమలు చేస్తోన్న కార్యక్రమాలు ప్రశంసనీయం. ఆంధ్రప్రదేశ్ అధికార యంత్రాంగానికి, డాక్టర్లకు, పోలీస్ వ్యవస్థకు పౌర సమాజం ఎంతో రుణపడి ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

భారతదేశంలో లాక్‌డౌన్ ప్రకటించి కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నివారణా చర్యలు చేపట్టడంతో కేంద్రమూ ఎంతో శ్రద్ధ చూపింది. ప్రధాని మోదీ సమయోచిత నిర్ణయం తీసుకున్నారు. లేనిపక్షంలో భారతదేశంలోని 130కోట్ల జనాభాను కరోనా బారి నుంచి కాపాడటం కష్టతరంగా మారేది. అగ్రదేశాలు కూడా వైరస్ వ్యాప్తిని సమర్థంగా అరికట్టడంలో వెనుకబడి ఇక్కట్లు పడుతున్నాయి. అలాంటిది అటు భారత ప్రభుత్వం, ఇటు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టి కరోనా బారి నుంచి ప్రజలను తప్పించగలుగుతున్నాయి.

ఇండియన్ నేవీకి ఉన్న కొన్ని షిప్పులను క్వారంటైన్ హోమ్‌లుగా తీర్చిదిద్ది అందుబాటులో ఉంచితే దేశానికి చాలా మేలు జరిగే వీలుంది. చెన్నై, కాకినాడ, విశాఖపట్నం, కొచ్చిన్, గోవా వంటి ఓడరేవుల్లో ఒక్కొక్క షిప్పును క్వారంటైన్ హోంగా మార్చి ఆయా నౌకాశ్రయాల్లో ఉంచితే కరోనా రోగులకు మేలు జరుగుతుంది. ఈ బాధ్యతలను ఇండియన్ నేవీకి అప్పగిస్తే బాగుంటుంది. షిప్పులను క్వారంటైన్ హోంలుగా మార్చే ఆలోచనతో ఇప్పటి వరకూ ఏ దేశమూ ముందుకు రాలేదు. కనుక ఉన్నతాధికారులు ఈ దిశగా అడుగులు ముందుకు వేయడం శ్రేయస్కరం.

**– ప్రొఫెసర్ డి. నారాయణరావు,**
ప్రో వైస్ చాన్సలర్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ

**కరోనా మహమ్మారితో ప్రపంచంలో సగం పైగా లాక్‌డౌన్‌లో ఉంది. ప్రతి దేశం తమ ప్రజల్లో కరోనా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు అనుక్షణం అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. మరోవైపు దక్షిణాది సంగీత దర్శకులు కోటి నుంచి ఉత్తరాదిన కైలాష్ ఖేర్, బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా వంటి కళాకారులు తమ సృజనాత్మకతతో సమాజ క్షేమానికి తమ వంతు కృషిచేస్తున్నారు.**

సృజనశీలురు



# పోరు బాటలో...పాట!

తెలుగు సినిమా ప్రముఖ సంగీత దర్శకుడు కోటి కరోనాపై ఒక పాట రాసి బాణీ కట్టి స్వయంగా పాడారు. 'కరోనాను జాగ్రత్తలు పాటిస్తూ ధైర్యంగా ఎదుర్కొందాం' అంటూ గళం విప్పారు. "ఏముంది విలువైంది మన ప్రాణం కన్నా" అంటూ ప్రజలకు, చిన్నారులకు సందేశమిచ్చారు. "లెట్స్ ఫైట్ ప్లీజ్ ఆన్ దిస్ వైరస్" అంటూ గళం విప్పారు. యువతపైనే భవిత ఉందన్నారు. "లెట్స్ క్యూర్ దిస్ వైరస్" అంటూ నినదించారు. "ఈ పని అందరం కలిసి చేద్దామన్నా"రు. "ఈ వైరస్‌ని కడిగేసి తరిమేసేద్దాం" అని ధైర్యమిచ్చారు. "షేక్ హ్యాండ్స్ వద్దు దండం మిన్న" అంటూ అందరికీ సామాజిక బాధ్యతను గుర్తుచేశారు. అంతేకాదు మనం తలవంచం... విజ్ఞానం, వైద్యం, సాయం ఉన్నాయి. అన్ని దేశాలు ఒకటై యుద్ధం చేస్తున్నాయి...మనవంతుగా ముందడుగేస్తే మనదే విజయం.... లెట్స్ లివ్ హెల్దియర్...." అంటూ సందేశమిచ్చారు. ఈ వీడియోలో మెగాస్టార్ చిరంజీవితో పాటు నాగార్జున, వరుణ్‌తేజ్, సాయి ధరమ్‌తేజ్‌లు గళం కలుపుతూ స్ఫూర్తిని నింపారు.

మరోవైపు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రముఖ గాయకుడు కైలాష్ ఖేర్ కూడా ఒక పాట రాశారు. తన పాట ద్వారా 'ప్రజలందరూ సురక్షితంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. కొవిడ్-19 సమస్యపై ప్రజలలో అవగాహన పెంచుతున్నారు. స్వీయనిర్బంధం (సెల్ఫ్-ఐసోలేషన్)తోపాటు ప్రజలు సామాజిక దూరాన్ని పాటించేలా స్ఫూర్తినివ్వడానికి పూనుకున్నారు. వీరికి ముందు ప్రముఖ గాయకుడు బప్పీలహరి కరోనా వైరస్‌పై పాట రాసి, దానికి సంగీతం సమకూర్చిన విషయం తెలిసిందే. అలా తన వంతు సామాజిక బాధ్యతను కైలాష్ ఖేర్ కూడా చేపట్టారు. 'మై హీ మేరా రక్షక్ హు' అన్నారు. కరోనా వైరస్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యం నెరవేర్చాలని పాటలో సందేశమిచ్చారు. 'పాట రాయడం పూర్తయింది. వచ్చే వారం ఆన్‌లైన్‌లో పాటను విడుదల చేస్తా' అని ఆయన వివరించారు. సోషల్ మీడియాలో కూడా తన పాటను విడుదల చేసే ఆలోచనలో కైలాష్ ఉన్నారు.

ఆయుష్మాన్ ఖురానాకు బాలీవుడ్‌లో మంచి నటుడిగా పేరుంది. ఆయుష్మాన్ మంచి కవి కూడా! కరోనావైరస్ మహమ్మారి సర్వత్రా ఉద్ధృతమవుతున్న నేపథ్యంలో 'అర్ధనిర్మిత్' (అసంపూర్ణం) అనే కవితను హిందీలో ఆయుష్మాన్ రాశారు. ఇందులో జీవితం ఎంత బలహీనమైనదో, అలాగే మారుతున్న దాని స్వరూపస్వభావాలు, అసంపూర్ణతలు ప్రతి దశలోనూ మనకు ప్రతిఫలిస్తున్నాయంటారు. ఒక్కోసారి పాజిటివ్‌గా ఉండడం సాధ్యం కాదు. వాస్తవికత చాలా కఠినమైంది. అది నిలదీస్తుంది. నిర్దేశిస్తుంది. ఇది ప్రపంచంలో ఏం జరుగుతోందన్న దానిపై ఆలోచించేలా చేస్తుంది. కరోనా వైరస్ ఈ పరిస్థితినే ప్రతిఫలిస్తోం"దంటూ తన కవిత్వంలో ఆయుష్మాన్ నర్మగర్భంగా చెప్పారు. 'యహా కోయీ మిత్ర నహీ హై... కోయీ ఆశ్వాస్ చరిత్ర నహీ హై...సబ్ అర్ధనిర్మిత్ హై' అంటూ పరిస్థితి తీవ్రత, జీవన తీవ్రతల గురించి ఆయుష్మాన్ తన కవితలో ఆవిష్కరించారు.

బాలీవుడ్, హాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా కరోనా వైరస్ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో 'సేఫ్ హ్యాండ్స్ ఛాలెంజ్' తీసుకున్నారు. కానీ దీన్ని ఒక వినూత్న శైలిలో ఆ సవాలును చేసి చూపి ఎందరో సోషల్ మీడియా వీక్షకులను ఆకట్టుకున్నారు. చేతులు సరిగ్గా ఎలా శుభ్రం చేసుకోవాలన్న విషయాన్ని వీడియోలో పాట రూపంలో ప్రియాంక వివరించారు. "ఇది చాలా సింపుల్ పని" అంటూ చేతి శుభ్రతపై అవగాహన పెంచే పనిచేశారామె. ఆ పాటను ఆమె భర్త అమెరికన్ సింగర్ అయిన నిక్ జోనస్‌తో కలిసి రాశారు. "మీ రక్షణ, మీ కుటుంబ రక్షణ కోసం తరచూగా, ప్రతి సారీ 20-25 సెకన్లు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని వీడియోలో ఆమె పేర్కొన్నారు.

మొత్తం మీద ఈ సృజనాత్మక సెలబ్రిటీలు తమ క్రియేటివిటీని పాటలు, వీడియోల రూపంలో చూపెడుతూ ప్రజలలో తెచ్చే చైతన్యం గురించి వేరే చెప్పాలా!

---

ప్రయత్నం




# కంచె వేసి... కాపలా కాసి...

**ఊరిలోకి కరోనా రాకుండా యువ మహిళా సర్పంచ్ ఉడుతల అఖిల యాదవ్ నడుం బిగించారు. గ్రామ సరిహద్దుల్లో కంచె వేసి తానే స్వయంగా కాపలా కాస్తున్నారు. కరోనా వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం సూచించిన వాటన్నింటినీ తు.చ తప్పకుండా ఆచరణలో పెడుతూ ఆదర్శంగా నిలిచారు. గ్రామాల్లోకి కరోనా అడుగుపెట్టకుండా ఉండాలంటే ఏం చేయాలో ఆమె మాటల్లోనే...**



'మనలో ఎవరికైనా కరోనా వైరస్ సోకుతుందనే జ్ఞానం నిరక్షరాస్యులు అధికంగా ఉండే పల్లె ప్రజలకు తెలియదు. మాది నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో 807 మంది జనాభా ఉన్న చిన్నపాటి గ్రామం మదనాపురం. హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవేకి కూతవేటు దూరంలో ఉంటుంది. ఒకవైపు కరోనా విస్తరిస్తున్న తరుణంలో ఏవేవో కారణాలతో ఇతర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో మా ఊరికి వస్తుండటం గమనించా. వారిని మా గ్రామంలోకి రాకుండా ఆపాలంటే ముళ్లకంచె వేయడమే మార్గమని భావించాను. అందుకే గ్రామంలో యువతను సమీకరించి కంచె వేసి మొదటి మూడు గంటలు నేనే స్వయంగా గస్తీ కాశా. ఆ తర్వాత షిఫ్టుల వారీగా మా గ్రామస్థులు, బయటివారు మా గ్రామంలోకి రాకుండా గట్టి నిఘా పెట్టారు. ఆ విధంగా వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రధాన మార్గాన్ని ఊరి బయటే మూసివేశాం. ఆ తర్వాత 'కరోనా ఎలా వ్యాపిస్తుంది, దాని లక్షణాలు ఎలా ఉంటాయి, ఎప్పుడు మనం వైద్యులను సంప్రదించాలి' అనే అంశాలను ఇంటింటికి తిరిగి వివరించాను. ముఖానికి మాస్కులు కట్టుకోవడం, మనిషికి మనిషికి మధ్య మూడడుగుల దూరం పాటించడం, కిరాణ దుకాణంలో సైతం ఒకరి తర్వాత ఒకరు ప్రవేశించాలని నిబంధనలను పెట్టుకొని ఖచ్చితంగా అమలు చేస్తున్నాం. గ్రామంలో పారిశుద్ధ్యం చేపట్టి ఊరంతా బ్లీచింగ్ పౌడర్, ద్రావకాలను చల్లించాను. అయితే ఊరిలోకి ఎవర్నీ రానీయకుండా కంచె వేసే విషయంలో బయటి నుంచి కొన్ని విమర్శలు వెల్లువెత్తాయి. అర్ధరాత్రి అంబులెన్స్ వంటివి రావాల్సి వస్తే ఎలా, ఆపద వచ్చిన గ్రామస్థులు రాత్రివేళ బయటకి వెళ్లాలంటే ఇబ్బందే కదా వంటి అంశాలు నా దృష్టికి వచ్చాయి. వీటికి పరిష్కారంగా మొదటి నుంచే రాత్రివేళ సైతం ముళ్లకంచ వద్ద గస్తీ పెట్టాం. అత్యవసరంతో ఎవరు వచ్చినా, వెళ్లినా మేమే కంచె తొలగించి సహకరిస్తున్నాం. పగటి వేళ ఎవరైనా మా గ్రామానికి రావాలనుకుంటే వారిని పూర్తిగా విచారించి సరైన కారణమే అని భావిస్తే అనుమతిస్తున్నాం. ప్రధాన రహదారిని కంచెతో మూసివేసినా మరో పిల్ల రహదారిని ఎప్పటికి తెరిచే ఉంచాం. ఈ బాట మా గ్రామస్థులకే తెలుసు. మరో ఊరికి వెళ్లాలన్నా, పెద్ద మొత్తంలో కిరాణా సరుకు తెచ్చుకోవాలన్నా ఆ దారి గుండా వెళ్తున్నారు. దీంతో ఇబ్బందులు లేకుండా పోయాయి.

## అవగాహన దిశగా అడుగులు...



కరోనా నేపథ్యంలో పల్లె జీవితంలో పెద్దగా మార్పులు రాలేదు. ఊళ్లో అంతా వ్యవసాయదారులు కావడంతో పొద్దున లేస్తే ఎవరి పొలాల్లోకి వారు వెళ్లిపోతున్నారు. అక్కడ సామాజిక దూరం సహజంగా ఉంటుంది కాబట్టి ఇబ్బంది లేదు. అయితే రోజు వారి కూలీలకు ఇబ్బంది వచ్చింది. వారిని పనిలో పెట్టుకునేందుకు రైతులు ఇష్టపడటం లేదు. మరోవైపు వ్యవసాయ సీజన్ ముగియడంతో కూలీలకు డిమాండ్ లేకుండా పోయింది. అయితే వారి నిత్యవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం నగదు సాయం, బియ్యం అందిస్తున్నాయి. అవికూడా సరిపోని వారిని గుర్తించి ఆదుకునేందుకు కొన్ని ఏర్పాట్లు చేసుకున్నాను. ఆ మేరకు వారికి హామీ ఇచ్చాను. పనిలేని వారు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. మొదట అవగాహన లేకపోయినా క్రమంగా అందరిలో ఆరోగ్యస్పృహ పెరిగింది. టీవీల్లో, పేపర్లల్లో వచ్చిన దానికంటే ప్రజాప్రతినిథులు గడపగడపకు తిరిగి అవగాహన కల్పిస్తే ఫలితం బాగుంటుందనేది నా భావన. ఆ దిశగానే అడుగులు వేస్తున్నా.

• **మారబోయిన మధుసూదన్**, నల్లగొండ
ఫొటోలు: పీరం వెంకటేష్

---

స్ఫూర్తి

**కరోనా వైరస్ నిర్ధారణ ఎంత త్వరగా జరిగితే... రోగికీ, వారి నుంచి వైరస్ సోకే వీలున్న ఇతరులకూ అంత మంచిది. ఇందుకోసం 'కరోనా టెస్ట్ కిట్' అందరికీ అందుబాటులోకి రావాలి. ఆ కిట్ అత్యంత తక్కువ వ్యవధిలో, తక్కువ ఖర్చులో, కచ్చితమైన ఫలితాన్నీ అందించాలి. అలాంటి సమర్థమైన కిట్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నారు పుణేకు చెందిన వైరాలజిస్ట్ మినాల్ దఖావే భోసలే! ఆ కిట్ తయారీ వెనక ఉన్న కథ ఇది!**




# పురిటినొప్పులతోనే దేశం కోసం...

"నా వరకు నాకు ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చిన అనుభూతి కలిగింది. కరోనా టెస్ట్ కిట్ తయారీ సమయంలోలాగే, నాకు ప్రసవ సమయంలోనూ ఇబ్బందులు తలెత్తాయి. చిట్టచివరకు సిజేరియన్‌తో నేను గండం నుంచి బయటపడిన చందంగానే, కరోనా టెస్ట్ కిట్ రూపకల్పన కోసం నేను పడిన శ్రమ చివరకు ఫలించింది. మొత్తానికి కీలకమైన సమయంలో కిట్ అందుబాటులోకి తేగలిగాను. ఇన్నేళ్లుగా పరిశోధనా రంగంలో ఉన్నాను. ఇలాంటి అత్యవసర పరిస్థితిలో నా సేవలు అందించలేకపోతే, పరిశోధకురాలిగా నా వృత్తికి అర్థం ఏముంటుంది?" ప్రెగ్నెన్సీ సమస్యలతో కిట్ రూపొందే చివరి ఘడియల్లో వైరాలజీ ల్యాబ్‌ను సందర్శించలేకపోయినా, 10 మంది బృంద సభ్యుల ప్రాజెక్టుకు ప్రాతినిధ్యం వహించి, కరోనా కిట్ రూపకల్పనకు తోడ్పడిన వైరాలజిస్ట్ మినాల్ దఖావే భోసలే మాటలివి.

## ప్రసవానికి ఒక్క రోజు ముందు...

గత ఫిబ్రవరిలో ఆరోగ్య సమస్యల కారణంగా ప్రయోగశాలకు రాలేకపోయిన మినాల్ ఇంటి నుంచే కరోనా టెస్ట్ కిట్ తయారీ బృందానికి మార్గనిర్దేశం చేశారు. అలా మార్చి 18న, ఆడపిల్లను కనడానికి సరిగ్గా ఒక్క రోజు ముందు... కిట్‌ను పరిశీలన కోసం పుణేలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ'కి అందించారు. పుణేలోని 'మైల్యాబ్ డిస్కవరీ సొల్యూషన్స్' ఆర్ అండ్ డి హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మినాల్‌కు వ్యాధినిర్ధారణ రంగంలో పదేళ్ల అనుభవం ఉంది. ఇన్‌ఫెక్షన్‌తో కూడిన వ్యాధులు, వ్యాధి నిర్ధారణ పరికరాల తయారీకి సంబంధించిన మాలిక్యులర్ డయాగ్నొస్టిక్స్‌లో ఈమె దిట్ట. టెస్ట్ కిట్‌ల తయారీ ఎంతో శ్రమతో కూడుకున్నది. ఈ పరికరాలు కచ్చితత్వంతో పని చేస్తున్నాయని నిర్ధారించుకోవడం కోసం ఎన్నో క్వాలిటీ చెక్స్‌ను దాటవలసి ఉంటుంది. పొరపాటుకు ఆస్కారం లేకుండా శ్రమకు ఓర్చి మినాల్ తయారుచేసిన తాజా 'కరోనా టెస్ట్ కిట్' ఇప్పటివరకూ ఫలితానికి పట్టే 8 గంటల సమయాన్ని రెండున్నర గంటలకు కుదించింది. ఆ కిట్ తయారీ వెనక ఉన్న ఆమె శ్రమ తక్కువేమీ కాదు.

## ఆరు వారాల స్వల్ప వ్యవధి!

"కొవిడ్-19 అత్యయిక స్థితికి అడ్డుకట్ట వేయడానికి అవసరమైన పరిష్కారం కోసం అన్వేషణను మేం ఆరు వారాల క్రితమే మొదలుపెట్టాం. ఈ వైరస్ వ్యాప్తిని అడ్డుకోవాలంటే వ్యాధి నిర్ధారణ త్వరితంగా జరగాలి. అందుకోసం ఇప్పటికే పరీక్షా పరికరాలు ఉన్నా, ఫలితానికి పట్టే సమయం ఎక్కువగా ఉంటోందని గ్రహించాం. కాబట్టి అంతకంటే త్వరగా, కచ్చితమైన ఫలితాన్ని అందించే కిట్ రూపకల్పన చేయాలని సంకల్పించాం. ఆ పరికరం తయారీ సమయంలో ప్రొడక్ట్ డిజైన్ రూపకల్పన, కచ్చితమైన పనితీరులతో పాటు, అత్యవసర స్థితిలో ప్రజల అవసరానికి అందుబాటులోకి తేవడం కోసం ప్రభుత్వ అనుమతి పొందడం... ఇలా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం. అయితే రేయింబవళ్లు కష్టపడి, ఈ సవాళ్లన్నింటినీ అధిగమించి ఆరు వారాల్లో పూర్తిగా భారతదేశంలో తయారైన మొట్టమొదటి 'కొవిడ్- 19' టెస్ట్ కిట్ తయారుచేయగలిగాం."అని చెప్పుకొచ్చారు మినాల్. ఈ వైరస్ మ్యుటేషన్ మీద ఓ కన్నేసి ఉంచామనీ, ఒకవేళ మ్యుటేషన్ కనిపిస్తే అందుకు తగ్గట్టుగా కిట్‌ను అప్‌గ్రేడ్ చేయవలసిన పరిస్థితి వచ్చి ఉండేదనీ అన్నారామె. మినాల్ ఆధ్వర్యంలో తయారైన తాజా కరోనా కిట్ సహాయంతో చేసే పరీక్ష, ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ఆధారంగా రూపొందించబడింది.

**పర్సనల్ టచ్**



మహారాష్ట్రలోని పుణేలో 1988లో జన్మించిన మినాల్ స్థానిక అహిల్యాదేవీ హై స్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. పుణే యూనివర్శిటీలో పట్టా తీసుకున్న అనంతరం 2009లో 'నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ వైరాలజీ'లో చేరారు. 2014లో 'మైలాబ్ లైఫ్ సొల్యూషన్స్'లో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ 'రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబ్ హెడ్'గా ఉన్నారు. 2017లో ఆమె ప్రవీణ్ భోసలేను వివాహం చేసుకున్నారు.

## రెండున్నర గంటల వ్యవధిలోనే....

మినాల్ రూపొందించిన కరోనా టెస్ట్ కిట్, ఫలితాన్ని రెండున్నర గంటల్లోనే వెలువరించగలదు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ... "ఫలితానికి ఆరు నుంచి ఏడు గంటలు పట్టే ఇతర పరీక్షలతో పోలిస్తే, మా కిట్ తక్కువ సమయంలోనే ఫలితాన్ని చూపించగలదు. ఇందుకోసం మేం నిపుణులతో పాటు, ఫాస్ట్ మోడ్ యాక్టింగ్ ఏజెంట్లను ఉపయోగించాం. ఐ.సి.ఎమ్.ఆర్‌తో పాటు ఎఫ్.డి.ఎ/సిడిఎస్‌సిఒ అనుమతి వచ్చిన వెంటనే 'కొవిడ్-19' క్వాలిటేటివ్ పి.సి.ఆర్ కిట్ అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే మేం కిట్ల తయారీ మొదలుపెట్టాం. వారానికి లక్ష పరీక్షలు జరపటానికి అవసరమైన కిట్లను తయారుచేసే సామర్థ్యం మాకుంది" అని చెప్పారు మినాల్. ఈమె తయారుచేసిన ఒక్కొక్క కిట్ వెల 1200 రూపాయలు. ఒక్కొక్క కిట్ 100 శ్యాంపిళ్లను పరీక్షించగలదు. భారత ప్రభుత్వం ప్రస్తుతం జర్మనీ నుంచి దిగుమతి చేసుకుని ఉపయోగిస్తున్న కిట్ ద్వారా కరోనా పరీక్షకు అయ్యే 4,500 రూపాయల ధరతో పోలిస్తే ఇది నాలుగో వంతు మాత్రమే. మినాల్ కృషిని ప్రశంసిస్తూ ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా 'మీరు కేవలం కిట్‌ను, బేబీని మాత్రమే కాదు... మన దేశ ఆశాకిరణాన్ని కూడా డెలివరీ చేశారు. మేము మీకు సెల్యూట్ చేస్తున్నాం' అని ట్వీట్ చేశారు. 'బయోకాన్' అధినేత్రి కిరణ్ మజుందార్‌షా, బాలీవుడ్ నటి సోనీ రజ్దాన్‌లు కూడా మినాల్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. వీరితో పాటు వేలాది మంది ఆమె అంకితభావాన్ని మెచ్చుకుంటూ అభినందనల ట్వీట్లు చేస్తూనే ఉన్నారు.

---

• **కామిక్ కరోనా** కార్టూన్: చారి పి.ఎస్



---

కరోనా - అంతరంగం

# మానవీయతే మన ఆయుధం!

"కరోనా మహమ్మారి ప్రపంచాన్ని చుట్టేస్తోంది. సర్వత్రా లాక్‌డౌన్. ఈ వైరస్ వ్యాప్తిని నియంత్రించాలంటే అందరూ ఇళ్లకే పరిమితం కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రజలు రకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఇళ్లకు పరిమితమవుతున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి, సామాన్య ప్రజలు, వలస జనాల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. ఇల్లు గడవాలంటే, బువ్వ నోటికి అందాలంటే ఏదో ఒక పని చేయాలి. లేకపోతే పస్తులే. ఇలాంటి విపత్తులో ఇంటికి పరిమితం కావడం అవసరమే అయినప్పటికీ ఒక సామాజిక కార్యకర్తగా నాలో సంఘర్షణ చెలరేగుతోంది. చిన్నారుల కోసం నడుపుతున్న 'అంకురం' షెల్టర్ హోం పనుల పరంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. అది ఒకటైతే, నేను ఉండేది చిన్న అపార్ట్‌మెంటులో. మా షెల్టర్‌లో ఉన్నవారు నా ఇంటికి తరచూ రావాల్సి ఉంటుంది. మరోవైపు అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌వారు బయటవారిని లోపలికి అనుమతించొద్దని నిబంధనలు పెట్టారు. పనివాళ్లని ఇళ్లల్లోకి రానివ్వొద్దని కూడా అపార్ట్‌మెంట్ వాళ్లు ఆర్డర్స్ జారీ చేశారు. ఒక సామాజిక కార్యకర్తగా ఆ మాట నాకు సబబుగా అనిపించలేదు. పనివాళ్లు తమతో కోవిడ్-19 తెస్తారన్న ఒక 'బ్లేమ్' వాళ్ల మాటల్లో నాకు ధ్వనించింది. కరోనాలాంటి మహమ్మారులను ఎదుర్కొనేటప్పుడు దాని నియంత్రణలో 'మానవీయత' మరింత శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుందని నేను విశ్వసిస్తా. లేకపోతే, సమాజం పేద, సంపన్నవర్గాల మధ్య దూరం మరింత పెరిగిపోయే ప్రమాదం ఉంది. 'లాక్‌డౌన్' వల్ల మానసిక సమస్యలున్న వారికి ఇలా జంటరిత నాన్ని ఎదుర్కోవడం కష్టమే. ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్‌ను ఇళ్లలో మరీ ఒంటరులను చేస్తున్నారు. ఒకరినొకరు పలకరించుకోవడం వల్ల మన కోసం మనుషులున్నారన్న భావం కలిగి, ఎంతటి విపత్తునైనా ధైర్యంగా ఎదుర్కోగలుగుతాం. ఆ పాఠాన్ని ఈ లాక్‌డౌన్ వల్ల చాలామంది నేర్చుకుంటారు."



• **సుమిత్ర**, అంకురం

---

విధి వి'చిత్రం'





ఒకవైపు కరోనా కరాళనృత్యం చేస్తుంటే, మరోవైపు ఆకలికేకలు వినిపిస్తున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో దేశవ్యాప్తంగా మానవత్వం మేల్కొంది. ప్రభుత్వాల నుంచి కార్పొరేట్లదాకా... స్వచ్ఛంద సంస్థల నుంచి సామాన్యుల దాకా అందరూ ఒక్కటై ఆకలితో అలమటించేవారికి చేయూతనిస్తున్నారు. 'కరోనా' ఎఫెక్ట్‌తో... తనకు అందిన ఆహారంతో బిడ్డ ఆకలి తీర్చే ప్రయత్నాన్ని ఒక తల్లి చేస్తుంటే, ఒక వ్యక్తి తన చుట్టూ చేరిన మూగజీవాలకు బిస్కట్లను ఆహారంగా అందిస్తున్న దృశ్యం.

## రూ.80 లక్షలిచ్చిన రోహిత్



**ముంబై:** కరోనాతో పోరుకు భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ కూడా తన వంతుగా రూ.80 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించాడు. ఇందులో ప్రధాని కేర్స్ ఫండ్స్‌కు రూ.45 లక్షలు, మహారాష్ట్ర సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.25 లక్షలు, ఫీడింగ్ ఇండియాకు రూ.5 లక్షలు అందించడంతో పాటు వీధి కుక్కలను కాపాడేందుకు కూడా వెల్ఫేర్ ఆఫ్ స్ట్రే డాగ్స్ (డబ్ల్యుఎస్‌డీ) సంస్థకు రూ.5 లక్షలు ఇస్తున్నట్టు ట్విటర్‌లో ప్రకటించాడు. అలాగే మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే కూడా పీఎం, సీఎం రిలీఫ్ ఫండ్లకు విరాళం ఇస్తున్నట్టు ప్రకటించాడు. అయితే ఆ మొత్తం ఎంతనేది కుంబ్లే వెల్లడించలేదు. ఇప్పటికే బీసీసీఐ చీఫ్ గంగూలీతో పాటు విరాట్ కోహ్లీ, సచిన్, రైనా, గంభీర్, మిథాలీ, పూనమ్, దీప్తి, సింధు, మేరీ కోమ్ తదితరులు కూడా విరాళాలు ప్రకటించిన వారిలో ఉన్నారు.



## సౌరవ్ ఇన్ని రోజులు ఇంట్లో ఎప్పుడూ లేడు..!

గంగూలీ భార్య డోనా

**కోల్‌కతా:** కరోనా వైరస్ విజృంభిస్తుండడంతో దేశంలో లాక్‌డౌన్ కొనసాగుతోంది. దీంతో ఎప్పుడూ బిజీబిజీగా గడిపే బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కూడా ఇంటిపట్టునే ఉంటున్నాడు. అయితే, గంగూలీ ఇన్ని రోజులు ఇంట్లో ఎప్పుడూ లేడని అతడి భార్య డోనా చెప్పింది. ఈ ఖాళీ సమయంలో గంగూలీ ఇంట్లోనే జిమ్ చేస్తూ, సినిమాలు చూస్తూ గడుపుతున్నాడని తెలిపింది. కాగా, కూతురు సనా కొత్త వంటలు నేర్చుకుంటూ ఎంజాయ్ చేస్తోంది.

## స్మార్ట్ వాచ్‌లపై ఈసీబీ నిషేధం



**లండన్:** అవినీతి నిరోధక కోడ్‌ను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) మరింత పకడ్బందీగా అమలు చేయనుంది. ప్రత్యక్ష ప్రసారం అయ్యే మ్యాచ్‌ల్లో తమ క్రికెటర్లు స్మార్ట్ వాచ్‌లు ధరించడంపై నిషేధం విధించింది. టీవీల్లో ప్రసారం కాని మ్యాచ్‌ల్లో కొన్ని షరతులతో ఆటగాళ్లు స్మార్ట్ వాచ్‌లను పెట్టుకునేందుకు ఈసీబీ గతంలో అనుమతి ఇచ్చింది. కానీ, ఇప్పుడు అన్ని మ్యాచ్‌లనూ ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యక్షప్రసారం చేస్తుండడంతో నిబంధనలను కఠినం చేసింది.

## రోహిత్.. నా ఆరాధ్య క్రికెటర్



**కరాచీ:** భారత డాషింగ్ ఓపెనర్ రోహిత్ శర్మ తన ఆరాధ్య క్రికెటర్ అని పాక్ యువ బ్యాట్స్‌మన్ హైదర్ అలీ చెప్పాడు. అండర్-19 వరల్డ్‌కప్‌తో పాటు పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో పెషావర్ జట్టు తరఫున సంచలనాత్మక ప్రదర్శనతో ఆకట్టుకున్న ఈ టీనేజర్‌ను అభిమానులు సోషల్ మీడియాలో బాబర్ ఆజమ్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ..వీరిలో మీ ఫేవరెట్ క్రికెటర్ ఎవరని అడగగా హైదర్ ఠక్కున రోహిత్ పేరు చెప్పాడు. రోహిత్ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తాడు. అతడి స్ట్రయిక్ రేట్ చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. రోహిత్‌లా ఆడడానికి ప్రయత్నిస్తా' అని హైదర్ తెలిపాడు.

# ఆడితేనే డబ్బు!



## ఐపీఎల్ రద్దుతో ఆటగాళ్లకు నష్టమే..

**నో** ప్లే.. నో పే.. ఈ ఏడాది ఐపీఎల్ ఆడేందుకు ఒప్పందం కుదుర్చుకున్న ఆటగాళ్ల ముందున్న పరిస్థితి ఇదే. దేశవ్యాప్తంగా కరోనా ఉధృతి తీవ్రంగా ఉండడంతో ముందు జాగ్రత్తగా ఐపీఎల్-13వ సీజన్‌ను ఏప్రిల్ 15 వరకు వాయిదా వేశారు. ఇప్పుడు ఈ నెలలోనూ జరుగుతుందనే భరోసా బీసీసీఐ ఇవ్వలేకపోతోంది. ఎందుకంటే పరిస్థితి మరింత దారుణంగా తయారుకావడంతో ఇప్పుడు ఐపీఎల్ జరగాలని కూడా ఎవరూ అనుకోవడంలేదు. దీంతో రద్దు వైపే అందరి ఆలోచనలు సాగుతున్నాయి. ఒకవేళ ఈ ఏడాది ఐపీఎల్ నిర్వహణ వీలు కాకపోతే ఎక్కువగా నష్టపోయేది ఆటగాళ్లే. సహజంగా ఐపీఎల్‌లో ఆటగాళ్లకు చెల్లింపు విధానం ఓ క్రమ పద్ధతిలో సాగుతుంటుంది. లీగ్ జరగడానికి వారం ముందుగానే తమ ఆటగాళ్లతో కుదుర్చుకున్న మొత్తం విలువలో 15 శాతం చెల్లించేస్తారు. ఇక టోర్నీ మధ్యలో మరో 65 శాతం చెల్లింపు జరిగిపోతుంటుంది. మిగిలిన 20 శాతాన్ని లీగ్ ముగిశాక నిర్ణీత సమయంలో ఆయా ఫ్రాంచైజీలు ఇచ్చేస్తుంటాయి. కానీ ఇప్పుడు వాయిదా పడడంతో ఎవరికీ తొలి విడత డబ్బు అందకుండా పోయింది.

### వర్ధమాన ఆటగాళ్లకే ఇబ్బంది..

నిజానికి ఈ లీగ్ ద్వారా వచ్చే డబ్బుపై కోహ్లీ, ధోనీ, రోహిత్‌లాంటి స్టార్ ఆటగాళ్లేమీ ఆధారపడి లేరు. వారికందే మొత్తం భారీదే అయినా ఇతరత్రా వ్యాపారాలతో వందల కోట్లు సంపాదిస్తున్నారు. కానీ చిన్న నగరాల నుంచి ఇప్పుడిప్పుడే అందరినీ ఆకర్షిస్తున్న యువ ఆటగాళ్లకు, దేశవాళీల్లో రాణిస్తున్న వారికి ఈ లీగ్ జరగడం చాలా ముఖ్యం. లేకుంటే ఆర్థికంగా చాలా ప్రభావం పడుతుంది. కొత్తగా ఆడుతున్న వారికైతే రూ.20 నుంచి 40, 60 లక్షలు దక్కినా అది వారి జీవితాలను ప్రభావితం చేసే మొత్తమే. ఒకవేళ లీగ్ కరోనా వైరస్ కారణంగా రద్దయితే ఆటగాళ్ల జీతాల విషయంలో ఇన్సూరెన్స్ వర్తించదని ఫ్రాంచైజీలు చెబుతున్నాయి. ఇంతకుముందే కుదుర్చుకున్న నిబంధనల్లో ఈ క్లాజ్ లేకపోవడమే కారణం.

### వేతనాల్లో కోతపై..

ఆటగాళ్ల వేతనాల్లో కోత విషయంలో ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని బీసీసీఐ కోశాధికారి అరుణ్ ధూమల్ స్పష్టం చేశారు. కానీ తాజాగా కొనసాగుతున్న విపత్కర పరిస్థితిని అందరూ అర్థం చేసుకోవాలని భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ) అధ్యక్షుడు అశోక్ మల్హోత్రా కోరుతున్నాడు. దేశవాళీ ఆటగాళ్ల వేతనాల్లో కోత ఉండకపోయినా పెరుగుదలను ఆశించడం అత్యాశే అవుతుందని ఆయన తెలిపారు. క్రికెట్ నుంచే బీసీసీఐకి ఆదాయం వస్తుందని, అలాంటిది మ్యాచ్‌లు జరగనప్పుడు డబ్బు ఎలా సమకూరుతుందని ప్రశ్నించాడు.

### అక్టోబరులో ఐపీఎల్!

ఒకవేళ టీ20 వరల్డ్‌కప్ రద్దయితే అక్టోబరు-నవంబరులో ఐపీఎల్ జరిగే అవకాశం ఉంటుందని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. టీ20 వరల్డ్‌కప్‌ను 2022కు వాయిదా వేస్తే ఆ విండో ఖాళీగా ఉంటుంది కాబట్టి ఐపీఎల్ కోసం ఉపయోగించుకోవాలనే ఆలోచనలో బోర్డు ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఐపీఎల్ అంటే బీసీసీఐతో పాటు ప్రసారకర్తలకు కాసులు కురిపించడమే కాదు.. అటు ఆటగాళ్లను కూడా రాత్రికి రాత్రే కోటీశ్వరులను చేస్తుంది. అనామక ఆటగాళ్లపై కూడా ఒక్కోసారి ఈ లీగ్ విపరీతమైన కరుణ చూపిస్తుంటుంది. ఎప్పటిలాగే ఈ ఏడాది జరిగిన వేలంలోనూ పలువురు యువ ఆటగాళ్లతో పాటు స్టార్ క్రికెటర్లపై అనూహ్యంగా కోట్ల వర్షం కురిసింది. కానీ ఇప్పుడు వారందరికీ కరోనా కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.. ఎందుకంటే ఈ లీగ్ జరిగితేనే వారికి డబ్బు ముట్టేది మరి..



## కోహ్లీ.. నువ్వూ గుండు గీసుకో!

వార్నర్ చాలెంజ్

**సిడ్నీ:** కరోనా వైరస్ బాధితుల ప్రాణాలు కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న వివిధ విభాగాల వారికి మద్దతుగా ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ వినూత్న రీతిలో మద్దతు పలికాడు. ట్రిమ్మర్ సహాయంతో మొత్తం తల వెంట్రుకలను తొలగించి స్వయంగా గుండు చేసుకున్నాడు. అంతేకాకుండా ఇదే తీరున చేయాల్సిందిగా విరాట్ కోహ్లీ, స్టీవ్ స్మిత్, కమిన్స్, జంపా సహా మరో నలుగురికి చాలెంజ్ విసిరాడు. అయితే తన హెయిర్‌స్టయిల్‌ను ప్రాణంగా చూసుకునే కోహ్లీ ఈ సవాల్‌కు స్పందించడం కష్టమే..

## బ్యాడ్మింటన్ ర్యాంక్స్ ఫ్రీజ్!

ప్రకటించిన బీడబ్ల్యూఎఫ్

**న్యూఢిల్లీ:** వరల్డ్ ర్యాంకింగ్స్‌ను స్తంభింపజేయాలని ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) నిర్ణయించింది. భవిష్యత్‌లో జరగబోయే టోర్నీల ఎంట్రీ, సీడింగ్ కోసం మార్చి 17న విడుదల చేసిన తుది ర్యాంక్‌లను పరిగణనలోకి తీసుకోనున్నట్టు బీడబ్ల్యూఎఫ్ మంగళవారం ప్రకటించింది. 'తదుపరి ప్రకటన వచ్చేంత వరకు ప్రపంచ ర్యాంకింగ్స్, జూనియర్ ర్యాంకింగ్స్‌ను ఫ్రీజ్ చేస్తున్నాం. చివరగా ఆడిన ఆల్ ఇంగ్లండ్ టోర్నీ తర్వాత ర్యాంక్‌లను పరిగణనలోకి తీసుకున్నాం. భవిష్యత్ టోర్నీల్లో ఈ ర్యాంక్‌ల ఆధారంగా సీడింగ్ నిర్ణయం తీసుకుంటామ'ని బీడబ్ల్యూఎఫ్ ప్రకటించింది. అయితే, ర్యాంక్‌లను స్తంభింపజేయడంపై సైనా నెహ్వాల్, సాయిప్రణీత్, కశ్యప్, ప్రణయ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## అతడిని మిస్ అవుతున్నా..!



**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ ప్లేయర్ గుత్తా జ్వాల, తమిళ నటుడు విష్ణు విశాల్ డేటింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. త్వరలో తాము వివాహం చేసుకోబోతున్నట్టుగా జ్వాల ఇటీవల ప్రకటించింది. జోరుగా హుషారుగా సాగుతున్న వీరి లవ్వాటకు కరోనా బ్రేకు లేసింది. లాక్ డౌన్ నేపథ్యంలో ప్రియుడికి దూరం కావడంతో జ్వాలకు రోజులు భారంగా గడుస్తున్నట్టున్నాయి..! దీంతో 'మిస్సింగ్ మై..' అని జ్వాల ట్వీట్ చేయగా.. 'ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక దూరం ఎంతో ముఖ్యం. అందరి కోసం ప్రార్థించు' అని విశాల్ రిప్లయ్ ఇచ్చాడు.

## అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ 2022కు వాయిదా

**పారిస్:** ఒలింపిక్స్‌ను వచ్చే ఏడాది రీషెడ్యూల్ చేయడంతో ఆ ప్రభావం వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌పై పడింది. విశ్వక్రీడలకు దారివ్వడం కోసం వచ్చే ఏడాది నిర్వహించాల్సిన చాంపియన్‌షిప్స్‌ను 2022కు వాయిదా వేశారు. కొత్త తేదీలను నిర్వాహకులతో చర్చించి ఖరారు చేయనున్నారు.

## సిలిండర్ పేలుడులో లిటన్ భార్యకు గాయాలు



**ఢాకా:** ప్రమాదవశాత్తు ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలి బంగ్లాదేశ్ క్రికెటర్ లిటన్ దాస్ భార్య దేవశ్రీ బిస్వాస్ సంచిత (27) గాయపడింది. ప్రమాదం సంభవించిన రోజు ఆమె 'టీ' కాచేందుకు వంట గదిలోకి వెళ్లి గ్యాస్ ఆన్ చేయగా సిలిండర్ ఒక్కసారిగా పేలింది. 'చావు దగ్గర వరకు వెళ్లి తప్పించుకున్నా. చేతులు అడ్డు పెట్టకుంటే ముఖమంతా కాలి పోయేది. వంట గదిలో గ్యాస్ సిలిండర్ ఉపయోగించే సమయంలో జాగ్రత్తలు పాటించండి' అని సంచిత తెలిపింది.



## చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లపై కోత

**న్యూఢిల్లీ:** జాతీయ పొదుపు సర్టిఫికెట్లు, ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్) వంటి చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను ప్రభుత్వం 1.4 శాతం వరకు తగ్గించింది. బుధవారం నుంచి అమల్లోకి వచ్చే కొత్త వడ్డీ రేట్లు జూన్ నెలాఖరు వరకు అమల్లో ఉంటాయి. చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు సవరిస్తుంటుంది. బ్యాంకు డిపాజిట్లపై తగ్గిన వడ్డీ రేట్లకు అనుగుణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఒకటి నుంచి మూడేళ్ల కాలపరిమితి ఉండే డిపాజిట్లపై వడ్డీ రేటు 6.9 శాతం నుంచి 5.5 శాతానికి, ఐదేళ్ల కాలపరిమితి ఉండే డిపాజిట్లపై వడ్డీ రేటు 7.7 శాతం నుంచి 6.7 శాతానికి తగ్గనుంది. అలాగే సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై వడ్డీ రేటు 8.6 శాతం నుంచి 7.4 శాతానికి తగ్గనుంది.

## కోవిడ్' డయాగ్నోసిస్ యూనిట్లకు సైయెంట్ పరికరాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోవిడ్-19 వైరస్‌ను గుర్తించే డయాగ్నోసిస్ యూనిట్లు, ఎక్స్-రే సిస్టమ్స్ తయారీకి హైదరాబాద్‌కు సైయెంట్ పరికరాలను అందించనుంది. కీలకమైన మెడికల్ ఇక్విప్‌మెంట్ తయారీకి అవసరమైన పరికరాల తయారీకి మైసూర్‌లోని కంపెనీ యూనిట్‌కు అనుమతి లభించినట్లు సైయెంట్ డీఎల్ఎం సీఈఓ రాజేంద్ర వెలగపూడి తెలిపారు. మైసూర్ ప్లాంట్‌లోని మెడ్‌టెక్ తయారీ సదుపాయంలో వీటిని తయారు చేస్తారు. జీఈ హెల్త్‌కేర్ తయారు చేస్తున్న ఎక్స్-రే జనరేటర్లు, మోల్బియో డయాగ్నోస్టిక్స్ ఉత్పత్తి చేస్తున్న యూనిట్లలో వీటిని వినియోగిస్తారు.

## వాట్సాప్‌పై ఐసీఐసీఐ బ్యాంకు సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లాక్‌డౌన్ సమయంలో ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా కొన్ని సేవలు పొందడానికి ఐసీఐసీఐ బ్యాంకు వాట్సాప్ సేవలను ప్రారంభించింది. ఖాతాలో నగదు, చివరి మూడు లావాదేవీలు, క్రెడిట్/డెబిట్ కార్డు బ్లాక్ వంటి సేవలను వాట్సాప్ ద్వారా పొందవచ్చు. బ్యాంకు వెరిఫైడ్ నెంబర్ 9324953001కు హాయ్ అని సందేశం పంపి ఈ సేవలు పొందవచ్చని వెల్లడించింది.

# 'ఈఎంఐ'లకు విరామం

## స్పష్టతనిస్తున్న బ్యాంకులు

- జూన్ తర్వాతే తిరిగి చెల్లింపుల ప్రక్రియ షురూ
- ఈసీఎస్ రద్దు దానంతటదే జరగదు.. రిక్వెస్ట్ పంపాల్సిందే..




**న్యూఢిల్లీ:** గృహ, ఆటో, పంట రుణాలు సహా అన్ని రకాల కాలపరిమితి రుణాల ఈఎంఐలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మూడు నెలల మారటోరియం ఎలా వర్తిస్తుందనే విషయంలో పలు బ్యాంకులు తమ శాఖలను చైతన్యం చేసే కార్యక్రమం చేపట్టాయి. కరోనా వైరస్ వ్యాప్తి, దేశవ్యాప్తంగా 21 రోజుల లాక్ డౌన్ నేపథ్యంలో కస్టమర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలను పరిగణనలోకి తీసుకుని వివిధ రుణాల నెలవారీ సమాన వాయిదాల (ఈఎంఐ) చెల్లింపులకు ఆర్‌బీఐ మూడు నెలల విరామం ప్రకటించిన విషయం విదితమే. ఈ సదుపాయం కల్పించడంతో పాటు ఆర్‌బీఐ ప్రకటించిన వివిధ స్కీమ్‌ల గురించి సవివరమైన మార్గదర్శకాలు జారీ చేస్తున్నట్టు ఆయా బ్యాంకులు మంగళవారంనాడు ప్రకటించాయి. ఈ సదుపాయం కల్పిస్తున్నట్టు తమ ట్విటర్ హ్యాండిళ్లపై సందేశాలు పోస్ట్ చేయడంతో పాటు కస్టమర్ల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు కూడా మెసేజ్‌లు పంపుతున్నామని వివిధ బ్యాంకులు తెలిపాయి.

ఇప్పటికే పలు బ్యాంకుల కస్టమర్లకు రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లపై ఈఎంఐల చెల్లింపునకు సంబంధించి అలర్ట్‌లు వస్తున్నట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో తక్షణం తగుచర్యలు చేపట్టాలని ఆర్‌బీఐ ఆదేశించింది. దీంతో పలు బ్యాంకులు తమ బ్రాంచీలను, కస్టమర్లను చైతన్యవంతులను చేసే చర్యలు చేపట్టాయి. అలాగే ఆర్‌బీఐ ప్రకటనపై పలువురికి తరచుగా కలుగుతున్న అనుమానాలు, వాటికి సమాధానాలు కూడా ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) రూపొందిస్తోంది. బ్యాంకులు ఈఎంఐల వాయిదాపై తమ వైఖరిని తెలియచేయడంతో ఇప్పుడు తమలో ఉన్న అనుమానాలన్నీ తొలగిపోతున్నాయని పలువురు కస్టమర్లు చెబుతున్నారు.

### ఈసీఎస్ చెల్లింపులు వాయిదా వేసుకోవడం ఎలా...?

లీగల్ సమస్యల కారణంగా బ్యాంకులు ఏకపక్షంగా ఎలక్ట్రానిక్ క్లియరింగ్ సిస్టమ్ (ఈసీఎస్) చెల్లింపులు వాయిదా వేయడానికి వీలు లేదు. బ్యాంకు వెబ్‌సైట్ల ద్వారా కస్టమర్లు ఈఎంఐ వాయిదా ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుంది. తమ ఈఎంఐను నిలిపి వేయాలని రిక్వెస్ట్ పంపాలి. తగినన్ని ఆర్థిక వనరులు ఉండి నగదు నిల్వలున్న వారు యథాప్రకారం ఈఎంఐలు చెల్లించవచ్చు. ఇందుకు బ్యాంకుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు తలెత్తవు.

### ఏయే బ్యాంకులు వాయిదా వేశాయంటే..

ఎస్‌బీఐ, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్, కెనరా బ్యాంక్. పంజాబ్ నేషనల్ బ్యాంక్, బీఓబీ.

### ఏ బ్యాంకు ఏమంది?

**ఎస్‌బీఐ:** మార్చి ఒకటో తేదీ నుంచి మే 31వ తేదీ వరకు అన్ని కాలపరిమితి రుణాల ఈఎంఐలను మూడు నెలల పాటు వాయిదా వేసేందుకు చర్యలు తీసుకున్నాం. అలాగే అదే కాలపరిమితికి వర్తింపచేస్తూ వర్కింగ్ క్యాపిటల్‌పై వడ్డీలను కూడా వాయిదా వేయడం జరిగింది.

**కెనరా బ్యాంక్:** ఆర్‌బీఐ ప్రకటించిన కోవిడ్-19 ప్యాకేజీకి అనుగుణంగా మార్చి 1 నుంచి మే 31వ తేదీ వరకు అన్ని రుణాలపై ఈఎంఐ చెల్లింపులను ఆ తర్వాత తేదీలకు వాయిదా వేయటం జరిగింది. దీనికి అనుగుణంగా రుణం రీపేమెంట్ కాలపరిమితి పెరుగుతుంది.

**ఐడీబీఐ బ్యాంక్:** అన్ని రకాల రుణాలపై ఈఎంఐల చెల్లింపును మూడు నెలల పాటు వాయిదా వేశాం. తగినంత నగదు నిల్వలుండి ఈ సదుపాయం అవసరం లేదనుకునే కస్టమర్లు ప్రస్తుత షెడ్యూల్ ప్రకారమే చెల్లింపులు చేస్తామని బ్యాంకుకు తెలియచేయాల్సి ఉంటుంది. moratorium@idbi.co.in అనే ఈ-మెయిల్‌కు సందేశాలు పంపుతూ లోన్ అకౌంట్ నంబర్, రుణగ్రహీత పేరు వంటి వివరాలు అందించాలి.

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా:** అన్ని రకాల రుణాలపై ఈఎంఐల చెల్లింపులను మూడు నెలల పాటు వాయిదా వేయాలని బ్యాంకు శాఖలన్నింటికీ సమాచారం పంపామని ఎండీ రాజ్‌కిరణ్ రాయ్ తెలిపారు. ఈసీఎస్ విధానంలో ఈఎంఐలు చెల్లిస్తున్న వారు ఈ మెయిల్ లేదా ఇతర డిజిటల్ విధానంలో తాము ఆ సౌకర్యాన్ని ఉపయోగించుకుంటున్నట్టు ఆయా బ్యాంకు శాఖలకు తెలియచేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

### క్రెడిట్ కార్డులకు చక్రవడ్డీ తప్పదు

**అ**న్ని రకాల రుణాల ఈఎంఐలు వాయిదా వేయడంతో పాటు క్రెడిట్ కార్డుల చెల్లింపులు కూడా వాయిదా వేయాలని ఆర్‌బీఐ సూచించింది. అంటే క్రెడిట్ కార్డులపై ఆయా కస్టమర్లు ఉపయోగించుకున్న మొత్తం బ్యాలెన్స్, వడ్డీ చెల్లింపు అన్నింటికీ ఆ మూడు నెలల విరామం వర్తిస్తుంది. ఆ రకంగా ప్రతీ నెలా కనీసం చెల్లించాల్సిన 'మినిమమ్ బ్యాలెన్స్ డ్యూ' చెల్లించకపోయినా ఫర్వాలేదు. గతంలో వలె క్రెడిట్ కార్డు కంపెనీలు కస్టమర్‌ను చెల్లింపు నిమిత్తం వెంటాడవు. కానీ ఆ సదుపాయం ఉపయోగించుకుంటే మాత్రం కస్టమర్లకు గల క్రెడిట్ కార్డు బకాయి మొత్తం మీద చక్రవడ్డీ విధిస్తారు. అంటే కస్టమర్‌కు భారం తడిసి మోపడవుతుందన్న మాట. ఉదాహరణకి ఎవరైనా కస్టమర్‌కు మార్చి 1 నాటికి కార్డుపై మొత్తం బకాయి రూ.50,000 ఉందనుకుంటే మూడు నెలల విరామం ముగిసే సమయానికి అతను చెల్లించాల్సిన మొత్తం అమాంతం రూ.58,000కి పెరిగిపోతుంది. ఈ ఇబ్బందిని తప్పించుకోవాలంటే నెలవారీ మినిమం బ్యాలెన్స్ డ్యూ చెల్లించడం మంచిదని బ్యాంకర్లు అంటున్నారు.



## అంచనాలు చేరడం కష్టమే

**ఔషధ ఎగుమతులు 22 బిలియన్ డాలర్లు చేరకపోవచ్చు • లాక్‌డౌన్‌తో మరింత ఇబ్బంది: ఫార్మాగ్జిల్**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్):** ఔషధ ఎగుమతులు, నిల్వలు తదితర అంశాలపై ఔషధ విభాగం తాజాగా భారత ఔషధ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మాగ్జిల్)తో చర్చించింది. కోవిడ్-19ను అరికట్టడానికి అవసరమైన ఔషధాలకు దేశీయంగా కొరత రాకూడదనే ఉద్దేశంతో మార్చి 3న పారాసిటమాల్, విటమిన్లు, హార్మోన్లు వంటి 26 ఔషధాల ఎగుమతులపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నిషేధం విధించింది. మార్చి 3 తర్వాత, తాజాగా లాక్‌డౌన్ నేపథ్యంలో ఔషధాల ఎగుమతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయని.. దిగుమతి దేశాల నుంచి అనేక ఒత్తిళ్లు వస్తున్నాయని ఫార్మాగ్జిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ తెలిపారు. లాక్‌డౌన్ తర్వాత విమానాలు నిలిచిపోవడం, లాజిస్టిక్స్, కార్గో సదుపాయాలు లేకపోవడం వంటి పరిణామాలు అనేక సమస్యలను కలిగిస్తున్నాయన్నారు. అమెరికా యూరప్ దేశాలు పరిస్థితులు చాలా విషమంగా ఉంది. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే జనరిక్ ఔషధాల్లో 45 శాతం ఈ దేశాలకే చేస్తున్నామని అన్నారు. ఎగుమతుల కోసం తయారు చేసిన ఔషధాలను భారత్ మార్కెట్లో విక్రయించడానికి పనికి రావని.. అందువల్ల కనీసం ఇప్పటికే ఎగుమతులకు సిద్ధంగా ఉన్న ఔషధాలనైనా ఎగుమతి చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరామన్నారు. అయితే.. లాక్‌డౌన్‌తో పరిస్థితులు మరింత క్లిష్టంగా మారినట్లు చెప్పారు. మన దేశం నుంచి అధికంగా పారాసిటమాల్ ఎగుమతి అవుతోంది. మన వద్ద ఈ నిల్వలు బాగానే ఉన్నాయి. ఎగుమతులకు అనుమతించకపోవడం వల్ల కంపెనీలు ఇబ్బందులు పడుతున్నాయని.. అవసరమైనప్పుడు ఔషధాలను సరఫరా చేయకపోవడం వల్ల భవిష్యత్తులో ఆయా దేశాల్లో భారత ప్రతిష్ఠ దెబ్బతినే అవకాశం ఉందని ఉదయ్ భాస్కర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి చివరి వరకూ 18.75 బిలియన్ డాలర్లు ఔషధాలను ఎగుమతి చేశారు. అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే.. 10.75 శాతం పెరిగాయి.



2019-20 ఆర్థిక సంవత్సరానికి ఎగుమతులు 22 బిలియన్ డాలర్లు (ప్రస్తుత మారకపు విలువ ప్రకారం దాదాపు రూ.1,62,800 కోట్లు) ఉండగలవని అంచనా వేస్తున్నాం. అయితే.. తాజా పరిణామాలతో మార్చిలో దాదాపు ఎగుమతులు నిలిచిపోయాయి. అందువల్ల ఎగుమతులు 22 బిలియన్ డాలర్ల స్థాయికి చేరకపోవచ్చని భావిస్తున్నామని ఉదయ్ భాస్కర్ తెలిపారు. 2019-20 ఏడాదికి ఎగుమతులు ఏ మేరకు ఉంటాయో ఇప్పుడే చెప్పలేం అయితే.. గత ఏడాది కంటే ఎక్కువగానే ఉంటాయన్నారు. ఎగుమతులపై నిషేధం ప్రభావం వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఎగుమతులపై ఉండే వీలుందని చెప్పారు.

## దగా చేసిన 'దలాల్' స్ట్రీట్

**2019-20లో 26 శాతం నష్టపోయిన సూచీలు**

**రూ.37.59 లక్షల కోట్లు హాంఫట్**

**ముంబై:** స్టాక్ మార్కెట్ మదుపరులకు మంగళవారంతో ముగిసిన 2019-20 ఆర్థిక సంవత్సరం చుక్కలు చూపింది. 2018-19 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. 2019-20 ఆర్థిక సంవత్సరంలో బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.37.59 లక్షల కోట్లు తుడిచి పెట్టుకుపోయింది, మార్చి నాటికి రూ.151 లక్షల కోట్లున్న మార్కెట్ క్యాపిటలైజేషన్, మంగళవారం నాడు రూ.113 లక్షల కోట్లకు పడిపోయింది. ఇదేకాలంలో సెన్సెక్స్ 9,204.42 పాయింట్లు (23.80 శాతం), నిఫ్టీ 3,026.15 పాయింట్లు (26.03 శాతం) నష్టపోయాయి. కాగా ఆర్థిక సంవత్సరం చివరి నెలలో కరోనా వైరస్ భయాలు దేశీయ స్టాక్ మార్కెట్‌ను వెంటాడాయి. దీంతో జనవరి-మార్చి త్రైమాసికంలో సెన్సెక్స్ ఏకంగా 28.57 శాతం, నిఫ్టీ 29.34 శాతం నష్టపోయాయి.

**ఆఖరి రోజున లాభాలతో ముగింపు:** ఆర్థిక సంవత్సరం చివరి రోజు మంగళవారం నాడు మాత్రం రిలీఫ్ ర్యాలీతో స్టాక్ మార్కెట్ కొద్దిగా కోలుకుంది. ట్రేడింగ్ ప్రారంభం నుంచి మదుపరులు కొనుగోళ్లకు దిగారు. దీంతో సెన్సెక్స్ 1,028.17 పాయింట్ల లాభంతో 29,468.49 దగ్గర ముగియగా, 316.65 పాయింట్ల లాభంతో నిఫ్టీ 8,597.75 వద్ద క్లోజైంది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 31వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 335 | విశాఖపట్నం | 345 |
| 1వ తేదీకి.. | | వరంగల్ | 338 |
| చిత్తూరు | 353 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 345 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 70 | విజయవాడ | 62 |
| వరంగల్ | 70 | గుంటూరు | 60 |
| మహబూబ్‌నగర్ | 70 | ఒంగోలు | 58 |
| కరీంనగర్ | 70 | చిత్తూరు | 55 |
| కర్నూలు | 70 | నెల్లూరు | 55 |
| విశాఖపట్నం | 50 | అనంతపురం | 56 |
| గోదావరి | 65 | | |



విశాఖ కేంద్ర కారాగారం నుంచి బయటికి వస్తున్న ఖైదీలు

## కరోనా భయంతో 116 మందికి పెరోల్

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 116 మంది ఖైదీలు పెరోల్‌పై విడుదలయ్యారు. జైళ్లలో రద్దీని తగ్గించేందుకు పెరోల్‌కు దరఖాస్తు చేసుకున్న వారిని విడుదల చేసే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు, హైకోర్టు సూచించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం విశాఖ కేంద్ర కారాగారం నుంచి మంగళవారం 74 మంది ఖైదీలను అధికారులు విడుదల చేశారు. వీరిలో 53 మంది రిమాండ్ ఖైదీలు కాగా, శిక్షపడిన 21 మంది ఖైదీలు ఉన్నట్టు జైలు సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. రిమాండ్ ఖైదీల్లో ఏడుగురు మహిళలు కూడా ఉన్నారు. జిల్లా ఏడో అదనపు మెట్రోపాలిటన్ జడ్జి జగదీష్‌కుమార్ సమక్షంలో ఖైదీలను బంధువులకు అప్పగించారు. వీరంతా నెల తర్వాత తిరిగి జైలుకు రావాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కరోనా నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. అలాగే, కడప కేంద్ర కారాగారం నుంచి 30 మంది విడుదలయ్యారు. వీరిలో 14 మంది రిమాండు ఖైదీలు, ఏడేళ్లు శిక్ష పడ్డ 16 మంది ఖైదీలు ఉన్నారు. అనంతపురం జిల్లా జైలు నుంచి 12 మందిని పెరోల్‌పై విడుదల చేశారు. కాగా, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి 55 మంది రిమాండ్ ఖైదీల విడుదలకు బెయిల్ మంజూరు చేశారు. ఈ ప్రక్రియ మంగళవారం పొద్దుపోయాక జరగడంతో బుధవారం ఉదయం వారిని విడుదల చేస్తామని జైలు సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు.

## దయచేసి వినండి.. తరువాత కలుద్దామండి



కరోనా మహమ్మారిపై ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో ఎవరికివారు భౌతిక దూరం పాటిస్తున్నారు. అందులో భాగంగా వైరస్ వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గుంటూరు జిల్లా రెంటచింతల కన్యకాపరమేశ్వరి గుడి ప్రాంతంలోని ఇళ్ల ముందు గేట్‌కు "దయ చేసి వినండి.. తరువాత కలుద్దామండి.." అని రాసిన పోస్టర్లు అంటించారు. - రెంటచింతల

## కాలినడకన చెన్నై నుంచి యూపీకి!

▸▸ బెజవాడలో అడ్డుకున్న పోలీసులు.. భోజనం పెట్టి క్వారంటైన్‌కు



యూపీవాసులకు భోజనం అందిస్తున్న విజయవాడ పోలీసులు

విజయవాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ వల్ల పరాయి రాష్ట్రంలో పస్తులతో గడపలేక.. చెన్నై నుంచి యూపీకి కాలినడకనే బయలుదేరారు 22 మంది కార్మికులు. మంగళవారం విజయవాడలో వారిని అడ్డుకున్న పోలీసులు.. భోజనం పెట్టి క్వారంటైన్‌కు తరలించారు. ఉత్తరప్రదేశ్‌లోని పత్తేపూర్ గ్రామానికి చెందిన 22 మంది చెన్నైలో ఐస్ ఫ్యాక్టరీ పనులకు వెళ్లారు. కరోనా నేపథ్యంలో మార్చి 22 నుంచి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. సకల వ్యవస్థలూ బంద్ అవ్వడంతో వీరికి పూటగడవడం కష్టమైంది. మధ్యవర్తికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ చేశాడు. సొంతూరుకు వెళ్దామన్నా రవాణా వ్యవస్థ లేదు. చెన్నైలో ఉంటే పస్తులు తప్ప ఇంకేమీ ఉండదని భావించిన వీరు వారం క్రితం కాలినడకనే స్వగ్రామానికి బయలుదేరారు. గుంపుగా వెళ్తున్నవారిని విజయవాడలో ప్రకాశం బ్యారేజ్‌పై విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ కె.తిరుపతిరాజు గుర్తించారు. వారి వివరాలు తెలుసుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో వారిని ముందుకు అనుమతించలేదు. అక్కడే వారికి భోజనం ఏర్పాట్లు చేశారు. అనంతరం వారిని విద్యాధరపురంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో 14 రోజుల క్వారంటైన్‌కు తరలించారు.

## స్వీయ నిర్బంధంలో 30,693 మంది: మంత్రి

నెల్లూరు (వైద్యం) మార్చి 31: "రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 40 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. సీఎం జగన్మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో కరోనా నివారణ చర్యలు పటిష్ఠంగా అమలు జరుగుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా పర్యవేక్షణకు 30 మంది ఐఏఎస్ అధికారులను నియమించాం" అని ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని తెలిపారు. నెల్లూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విదేశాల నుంచి వచ్చిన 30,693 మంది స్వీయ గృహ నిర్బంధంలో ఉన్నారన్నారు. 262 మంది క్వారంటైన్ వార్డుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

## 3 నెలలకు సరిపడా నిత్యావసరాలు!

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో ప్రజలు నిత్యావసరాలకు ఇబ్బంది పడకుండా, రానున్న మూడు నెలలకు సరిపడా సరుకులను సేకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం లాక్‌డౌన్ పరిస్థితుల్లో రవాణా సౌకర్యం లేక నిత్యావసరాల కోసం ప్రజల గాబరా పడుతున్న విషయాన్ని గుర్తించిన పలువురు మంత్రులు రానున్న కాలంలో ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు కనీసం మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. నాణ్యమైన బియ్యం, కందిపప్పు, మినప్పప్పు, శనగనూనె, పామాయిల్, ఉల్లిపాయలను సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రానున్న రోజుల్లో విపత్కర పరిస్థితి తీవ్రమైనప్పటికీ రేషన్ కార్డు దారులకు యథావిధిగా బియ్యం, కందిపప్పు, పంచదారతో పాటు ఇతర నిత్యావసరాలను ఇవ్వాలని, కార్డులు లేని వారికీ నిర్ణీత ధరలకు సరఫరా చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది.

## విశాఖలోనే 'కరోనా కిట్ల' తయారీ!

▸▸ మెడ్‌టెక్ జోన్‌లో ఈ వారంలోనే ప్రారంభం

విశాఖపట్నం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): దేశంలో వైద్య రంగానికి అవసరమైన అధునాతన పరికరాల తయారీకి విశాఖలో ఏడాదిన్నర క్రితం ఏర్పాటు చేసిన మెడ్‌టెక్ జోన్ సన్నద్ధమైంది. కరోనాను వెంటనే గుర్తించడానికి, అవసరమైన పరీక్షలు నిర్వహించడానికి, ఆ తరువాత రోగులకు సరైన చికిత్సకు సరిపడా పరికరాలు ప్రభుత్వం వద్ద అందుబాటులో లేవు. వైద్యపరికరాలు తయారుచేసే మెడ్‌టెక్ జోన్ ఉన్న విశాఖపట్నంలోనే కరోనా పరీక్ష చేసే లేబొరేటరీ లేదు. ఇక్కడ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి నాలుగు రోజులైనా అవసరమైన పరికరాలు అందుబాటులో లేక జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో టెస్టింగ్ కిట్లు, పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్(పీపీఈ)లు, ఎన్ 95 మాస్కులు, వెంటిలేటర్లను యుద్ధ ప్రాతిపదికన మెడ్‌టెక్ జోన్‌లో తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొవిడ్-19పై ఢిల్లీలో మంగళవారం కేంద్రం ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ అత్యున్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అత్యున్నత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. అవసరమైన అన్ని వైద్య పరికరాలను దేశంలోని అన్ని వివిధ రాష్ట్రాల్లోగల మెడ్‌టెక్ లాంటి అన్ని లేబొరేటరీలకు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఈ వారంలోనే విశాఖ మెడ్ టెక్‌లో ఈ పనులు ప్రారంభం కానున్నాయి.

## ఈయనో అధికారి.. ఎవరో తెలుసా?!



అది విజయనగరం రాజీవ్ క్రీడా మైదానం. అందులో రైతు బజార్. సమయం మంగళవారం ఉదయం 9 గంటలు.. లుంగీ, బనియన్, భుజంపై టవల్‌తో సాదాసీదాగా ఉన్న ఓ వ్యక్తి కూరగాయల కొనుగోలుకు వచ్చారు. కరోనా నేపథ్యంలో దూరదూరంగా గీసిన గళ్ల వద్ద నిలబడి ఒక్కో స్టాల్ వద్దకు వెళ్లి ధరల పట్టిక ఉందో లేదో.. ఎగా దిగా చూశారు. ఆఖరికి కొన్ని కూరగాయలు కొనుక్కుని బయటకు వచ్చారు. ఎవరీయన ఆరా తీసిన విలేకరులు.. జిల్లా జాయింట్ కలెక్టర్ కిశోర్ కుమార్ అని తెలిసి ఆశ్చర్యపోయారు. ఇదేంటి సార్.. ఇలా వచ్చారు అని ప్రశ్నిస్తే.. 'కరోనా నేపథ్యంలో రైతు బజార్‌లో కూడా అధిక ధరలకు కూరగాయలు అమ్ముతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అందుకే సాధారణ వ్యక్తిలా వచ్చి పరిశీలించాను. ఒకటి రెండు కూరగాయల ధరల విషయంలో స్వల్ప తేడాలున్నా.. బోర్డులపై ఉన్న ధరలకే విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులు భౌతిక దూరాన్ని పాటిస్తున్నారా? లేదా? అన్నది పరిశీలించాను.. పర్లేదు' అని సంతృప్తి వ్యక్తంచేస్తూ కూరగాయల బ్యాగు పట్టుకుని.. వెళ్లిపోయారు!. - విజయనగరం

# ఒకేరోజు 33 కేసులు!

(మొదటి పేజీ తరువాయి)

కరోనా సోకినవారి సంఖ్య 56కు చేరింది. పాజిటివ్ వచ్చినవారిలో అత్యధికంగా పశ్చిమ గోదావరి జిల్లాలో 12మంది ఉండగా, ప్రకాశం జిల్లాకు చెందినవారు 8మంది, గుంటూరు జిల్లాలో ఐదుగురు, విశాఖ జిల్లాలో నలుగురు, అనంతపురం జిల్లాలో ఇద్దరు, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. పశ్చిమ జిల్లాలో ఇప్పటివరకూ ఒక్క పాజిటివ్ కేసు కూడా లేదు. ఒకేసారి 12 మందికి పాజిటివ్ రావడంతో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఏలూరులో 8, భీమవరంలో ఇద్దరు, ఆకివీడు, గుండుగొలనుకు చెందిన ఒక్కొక్కరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మరో తొమ్మిది మంది రిపోర్టులు బుధవారం అందనున్నాయి. బాధితులందరూ ఢిల్లీ సమావేశాలకు వెళ్లి వచ్చిన వారేనని తెలుస్తోంది. ప్రకాశం జిల్లాలో 132మంది నమూనాలను పరీక్షలకు పంపించగా 8మందికి పాజిటివ్ నిర్ధారణ అయింది. వీరిలో ఏడుగురు ఢిల్లీ సమావేశాలకు వెళ్లొచ్చినవారు. ఒకరు ఢిల్లీ వెళ్లి వచ్చిన వృద్ధుడి కుమారుడిగా గుర్తించారు. గుంటూరు జిల్లాలో తాజాగా మరో ఐదుగురికి కరోనా సోకినట్లు నిర్ధారణఅయింది. వీరిలో ఇద్దరు గుంటూరు, మరో ఇద్దరు మాచర్ల, ఇంకొకరు కారంపూడికి చెందినవారు. బాధితుల్లో ఒక మహిళకు ఢిల్లీ యాత్రకు వెళ్లి వచ్చిన భర్త ద్వారా వైరస్ సోకింది. విశాఖలో మరో నలుగురికి కరోనా నిర్ధారణ అయింది. ఇక కర్ణాటకలోని గౌరీబిదునూరుకు చెందిన 15మంది, అనంతపురం జిల్లా హిందూపురం ప్రాంతానికి చెందిన వారి బంధువులు మరో 30మంది కలసి 15న మక్కా వెళ్లి 24న హిందూపురం వచ్చారు. వీరిలో గౌరీబిదునూరుకు చెందిన వృద్ధురాలు కరోనా లక్షణాలతో అదే రోజు రాత్రి మృతిచెందింది. దీంతో హిందూపురానికి చెందిన వారందరినీ 26న హోం ఐసోలేషన్‌లో ఉంచి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఓ మహిళ, పదేళ్ల బాలుడికి పాజిటివ్‌గా తేలింది. కాగా, ఢిల్లీ మత ప్రార్థనలకు వెళ్లి వచ్చిన తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం వాడ వీధికి చెందిన వృద్ధుడి (65)కి పాజిటివ్ వచ్చింది. కృష్ణాజిల్లా విజయవాడకు చెందిన వృద్ధురాలి(65)కి కరోనా పాజిటివ్‌గా తేలింది. ఢిల్లీ సమావేశాలకు హాజరై వచ్చిన వ్యక్తి ద్వారా ఆమెకు వైరస్ సోకింది.

### తీవ్రతను దాస్తున్నారా?

కరోనా తీవ్రతను అధికారులు దాస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ వెళ్లి వచ్చినవారు, వారితో కలిసి తిరిగిన వారిలో కొందరు మృత్యువాత పడుతున్నా, ఇతర అనారోగ్య కారణాలతో మృతి చెందారని చెబుతున్నారు. విజయవాడలో 3రోజుల క్రితం ఒక వ్యక్తి మరణించగా, తర్వాత 24గంటలకు అతడి భార్య కరోనా లక్షణాలతో ఆస్పత్రిలో చేరారు. పరీక్షల్లో ఆమెకు పాజిటివ్ అని తేలింది. మరోసారి నిర్ధారించుకునేందుకు తిరుపతి ల్యాబ్‌కు పంపినట్లు తెలుస్తోంది. అక్కడా పాజిటివ్ వస్తే ఆమె భర్త కచ్చితంగా కరోనాతోనే మృతిచెంది ఉంటారు. విజయవాడలోనే మరో కుటుంబంలో దంపతులు మృతిచెందగా వారి కుమారుడు కరోనా లక్షణాలతో ఆస్పత్రిలో చేరారు. అతడికి కూడా పాజిటివ్ వస్తే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థంగా మారింది. ఇలాంటి కేసులు చాలానే ఉన్నాయని సమాచారం. కరోనాతో మరణించిన వ్యక్తి అంత్యక్రియలు పకడ్బందీగా నిర్వహించాల్సి ఉండగా, కొన్నింటిని సాధారణ మరణాలుగా తేల్చి మృతదేహాలు కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నారు. ఇదిచాలా ప్రమాదకరమనే ఆందోళన వ్యక్తమవుతోంది.



విజయవాడ కృష్ణలంకలో పూర్తిస్థాయి లాక్‌డౌన్

## 65 ఏళ్ల వృద్ధుడు కరోనాను జయించాడు

*విశాఖలో తొలి కరోనా పేషెంట్ డిశ్చార్జి*

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ప్రథమంగా కరోనా వైరస్ బారినపడిన వ్యక్తి వయసు 65 ఏళ్లు. పైగా బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నాడు. దీంతో అతడు కోలుకోవడం కష్టమే అని భావించారంతా! కానీ.. సానుకూల దృక్పథంతో చికిత్సకు సహకరించిన ఆ వృద్ధుడు కరోనాను జయించాడు. 13 రోజులపాటు చికిత్స తీసుకోవడంతో పూర్తిగా కోలుకున్నాడు. చికిత్స అనంతరం రెండు దశల పరీక్షల్లో అతనికి కరోనా నెగెటివ్ రావడంతో వైద్యాధికారులు అతన్ని మంగళవారం మధ్యాహ్నం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. స్థానిక అల్లిపురం ప్రాంతానికి చెందిన 65 ఏళ్ల వృద్ధుడు మక్కా వెళ్లి ఈ నెల రెండో వారం తిరిగొచ్చారు. అప్పటి నుంచి దగ్గు, జ్వరంతో బాధపడుతుండడంతో మార్చి 17న ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలో చేరారు. నమూనాలు పరీక్షలకు పంపించగా 19న పాజిటివ్ నిర్ధారణ అయింది. అప్పటి నుంచి ఆయన్ను ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆయన మొదటి నుంచీ చికిత్సకు సహకరించడంతో ఆరోగ్యం కుదుట పడింది. పూర్తిస్థాయి చికిత్స అనంతరం మార్చి 27న నమునాలు పరీక్షించగా నెగెటివ్ వచ్చింది. 30న రెండోసారి నిర్ధారణకు పంపించగా మళ్లీ నెగెటివ్ వచ్చింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండుసార్లు పరీక్షల్లో నెగెటివ్ వస్తే డిశ్చార్జ్ చేయాలి. ఈ మేరకు మంగళవారం ఆయన్ను అధికారులు ఇంటికి పంపించారు.

## వారెవరో కనుక్కోండి

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి నీలం సాహ్ని, డీజీపీ గౌతమ్ సవాంగ్ తదితరులు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వీయ నియంత్రణ సర్వే బాగుందని జగన్ ప్రశంసించారు. అయితే పట్టణ, నగర ప్రాంతాలపై మరింత దృష్టి సారించాలని, ప్రతి ఇంటినీ సర్వే చేసి.. కుటుంబ సభ్యుల సంఖ్య, కొత్తగా వచ్చి చేరినవారు.. అందరి ఆరోగ్య వివరాల గుట్టు పట్టుకోవాలని ఆదేశించారు. జమాత్‌లో పాల్గొన్నవారు వైద్య సేవలు చేయించుకుంటే ఎలాంటి నష్టమూ ఉండదని.. వారి ఆరోగ్యమే బాగుపడుతుందని, సమాజానికీ ప్రయోజనమని సీఎం గుర్తుచేశారు.

### పల్లెల్లో ప్రజల స్వీయ నియంత్రణ భేష్..

ఇప్పటి వరకూ చేపట్టిన కరోనా వైరస్ నివారణ చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. పల్లెల్లో కరోనా వైరస్ కోసం ప్రజలు అనుసరిస్తున్న స్వీయ నియంత్రణ అభినందనీయమన్నారు. పట్టణ, నగర ప్రాంతాల్లో మాత్రం స్వీయ నియంత్రణ పూర్తిస్థాయిలో అమలుకు ప్రజల నుంచి సహకారం అందడం లేదని అభిప్రాయపడ్డారు. అర్బన్ ప్రాంతాల్లో ప్రతి కుటుంబంపైనా సర్వే జరుగుతోందా.. లేదా అని అధికారులను జగన్ ఆరా తీశారు. కరోనా లక్షణాలున్నవారు ముందుకు రాకపోతే.. వారి కుటుంబ సభ్యులకు సోకి.. భవిష్యత్‌లో తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. షెల్టర్లలో ఉన్నవారిలో వైరస్ కనిపిస్తే వెంటనే క్వారంటైన్‌కు పంపాలని సీఎం ఆదేశించారు.విద్యావంతులు .. అవగాహన కలిగిన వారు వెబ్ ద్వారా నేరుగా తమ ఆరోగ్య పరిస్థితులను తనిఖీ చేసుకోవచ్చని అధికారులు ప్రతి షాపు ముందూ ధరల పట్టిక ఉండాలని సీఎం చెప్పారు.

### రైతుల నుంచి కొనుగోలు చేయాలి..

తాత్కాలిక పరిష్కారంగా ప్రస్తుతానికి రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని జగన్ ఆదేశించారు. అరటి, టమోటా రైతులకు ఇబ్బందులు రాకూడదన్నారు. నిల్వ చేయలేని పంటల విషయంలో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. తక్షణమే సంబంధిత అధికారులు కూర్చొని కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జనతా మార్కెట్లు తెరిచేందుకు ఏర్పాట్లు చేయాలని, గ్రామ, పట్టణ, నగరాలో డిమాండ్ ఆధారంగా జనతా బజార్లు ఏర్పాట్లు చేయాలన్నారు. అందుకనుగుణంగా డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర, గ్రేడ్‌ల వారీగా రొయ్యల కొనుగోలుపైనా సీఎం ఆరా తీశారు. 69 ప్రాసెసింగ్ యూనిట్లలో 41 చోట్ల పని ప్రారంభమైందని అధికారులు చెప్పారు. కరోనా వైరస్‌ను దృష్టిలో ఉంచుకుని .. పారిశుద్ధ్యం, కూలీలు భౌతిక దూరం పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమెరికా, చైనాలకు ఎగుమతి కూడా ప్రారంభమైందని చెప్పారు.

### నిత్యావసరాల ధరలు పెరగొద్దు

లాక్‌డౌన్ సందర్భంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి వీల్లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కరోనా వైరస్ సోకకుండా భౌతిక దూరం పాటిస్తూనే .. నిత్యావసరాలు కొనుగోలు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ పనితీరుపైనా ఆరా తీశారు. మంత్రులంతా సమీక్షలు చేస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న మిగిలిన మార్కెట్ యార్డుల చైర్మన్ పోస్టులను కూడా భర్తీ చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రులను సీఎం ఆదేశించారు. వారిని కూడా కరోనా నివారణ చర్యల్లో భాగస్వాములను చేయాలన్నారు. వివిధ రూపాల్లో సహాయం చేయాలనుకున్నవారు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్‌లను సంప్రదించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బిల్లులన్నీ చెల్లించామని ముఖ్యమంత్రి తెలిపారు.

### పేదలను ఆదుకునేందుకు 1300 కోట్లు

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నియంత్రణకు లాక్‌డౌన్ అమలు చేస్తోన్న నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన నిరుపేదలను ఆదుకునేందుకు రూ. 1300 కోట్ల విడుదలకు పరిపాలనా అనుమతి ఇస్తూ విపత్తు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లాక్‌డౌన్ వల్ల పనులు కోల్పోయిన పేదలకు ఇంటికి వెయ్యి చొప్పున ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విపత్తు పద్దు కింద రూ. 1300 కోట్లను విడుదల చేస్తూ విపత్తు శాఖ ముఖ్యకార్యదర్శి వి. ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు.

## వలంటీర్ల సర్వే ఉత్తిదేనా?

(మొదటి పేజీ తరువాయి)

ఇంటింటి సర్వే చేస్తున్నారా.. లేక ఉత్తుత్తిదేనా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఒక వేళ నిజంగా సర్వే జరిగి ఉంటే అది వలంటీర్లు చేసిందేనా? లేక ఆశా వర్కర్ల శ్రమను కూడా వారి ఖాతాలో వేసి ఆ క్రెడిట్‌ను వైసీపీ ప్రభుత్వం తన కార్యకర్తలకు కట్టబెడుతోందా అన్న కొత్త చర్చ బయలుదేరింది. కరోనావ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా వ్యాధి లక్షణాలున్నవారిని, విదేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేస్తామని ముఖ్యమంత్రి జగన్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి వ్యాధి లక్షణాలున్నవారిని గుర్తించే కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య కార్యకర్తలు, ప్రత్యేకించి ఆశావర్కర్లు, వారితోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొంటున్నారు. అయితే వలంటీర్ల ద్వారానే సర్వే చేపడుతున్నామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. దీనికి పూర్తి భిన్నమైన అంశం మంగళవారం తెరపైకి వచ్చింది. కరోనా వ్యాప్తిని అడ్డుకునే చర్యల్లో భాగంగా పేదలకు రేషన్ షాపుల వద్దే నిత్యావసరాలను అందిస్తున్నామని, వలంటీర్ల ద్వారా డోర్‌డెలివరీ చేయించడం లేదని మంత్రి కొడాలి నాని ప్రకటించారు. వలంటీర్‌తో ఒక సంచితో ఇంటింటికీ సరుకులు పంపిస్తే ఇబ్బందులు వస్తాయని, అందుకే ప్రజలే సంచులు తీసుకొచ్చుకుని రేషన్ తీసుకెళ్తున్నారని చెప్పారు. అంటే కరోనా భయంతో వలంటీర్లు సరుకులను ఇంటింటికీ తీసుకెళ్లి ఇవ్వడం లేదని రుజువైంది. అయితే వలంటీర్లు ఖాళీగా లేరని, కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా గ్రామంలోకి కొత్త వ్యక్తులు ఎవరొచ్చారు? వ్యాధి లక్షణాలు ఎవరికి ఉన్నాయో కనిపెట్టేందుకు సైనికుల్లా పనిచేస్తున్నారని ఆయనే అన్నారు. ఆయన వ్యాఖ్యలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. నిత్యావసరాల డోర్ డెలివరీకి అడ్డొచ్చే కరోనా భయం.. కరోనా వ్యాధి లక్షణాలున్నవారిని గుర్తించడానికి వర్తించదా అన్నది ప్రశ్న.

### మమ్మల్నే పరీక్ష చేయించుకోమంటావా?

▸▸ గుంటూరు జిల్లాలో వలంటీర్‌పై దాడి

దుర్గి, మార్చి 31: పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన విద్యార్థిని కరోనా పరీక్ష చేయించుకోవాలని సూచించిన గ్రామ వలంటీర్‌పై అతని కుటుంబసభ్యులు దాడికి పాల్పడ్డారు. గుంటూరు జిల్లా దుర్గి మండలం శ్యామరాజపురానికి చెందిన ఓ యువకుడు చెన్నైలో ఉన్నత విద్యనభ్యసిస్తున్నాడు. మంగళవారం స్వగ్రామానికి వచ్చాడు. అతడ్ని కరోనా పరీక్ష చేయించుకోవాల్సిందిగా వలంటీర్ మర్రిబోయిన వెంకటేష్ సూచించారు. దీంతో మమ్మల్నే పరీక్ష చేయించుకోమంటావా అంటూ విద్యార్థి కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహంతో వలంటీర్‌పై దాడి చేశారు. బాధితుడు దుర్గి ఎస్ఐకి, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

### ఇదే ప్రమాదకరం..

రేషన్ పంపిణీకి వలంటీర్ గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లాల్సిన అవసరం ఉండదు. కేవలం నిరుపేదలు, కార్డుదారులకే డోర్‌డెలివరీ చేస్తారు. కానీ ఇంటింటి సర్వేలో వలంటీర్ గ్రామంలోని ప్రతి గడపా తొక్కాలి. ఆ ఇంట్లో ఎవరికి ఎలాంటి రోగ లక్షణాలు ఉన్నాయో.. కరోనా పాజిటివ్ లక్షణాలున్న వారెవరో ముందుగా గుర్తించలేరు. రేషన్ పంపిణీ కన్నా ఇదే అసలైన ప్రమాదకరమైన పని. పైగా, ఈ విషయంలో వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ లేదు. మెడికల్ డేటా సేకరణలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి అనుభవం, నైపుణ్యం ఉంది. నాకు తెలిసి వారే గ్రామాల్లో జరుగుతోన్న సర్వేల్లో పాల్గొంటున్నారు' అని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఇదే వాస్తవం కూడా. గ్రామం వారీగా జరుగుతున్న ఇంటింటి సర్వేలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు మాత్రమే పాల్గొంటున్నారు. ఆశావర్కర్లు చాలా చురుగ్గా పనిచేస్తున్నారు. ఇలాంటి సర్వేలు చేయడంలో వారికి నైపుణ్యం ఉంది. కానీ ప్రభుత్వం వారి శ్రమను వలంటీర్ల ఖాతాలో వేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేల కోట్ల ప్రజాధనాన్ని వలంటీర్లకు నెలనెలా ఇస్తున్నా.. విపత్కర పరిస్థితుల్లో ప్రజోపయోగకరమైన ఒక్క పని కూడా వారు చేయడం లేదన్న వాస్తవాన్ని మరుగుపరిచేందుకే ప్రభుత్వ పెద్దలు ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.



## మూగజీవాల సంగతేంటి..?

▸▸ ఆహారం అందకపోతే కుక్కలకు రేబిస్

గుంటూరు (సంగడిగుంట), మార్చి 31: లాక్‌డౌన్ కారణంగా అన్నార్తులైన పేదలకు స్వచ్ఛంద సంస్థలు, సహృదయులు ఆహారాన్ని సమకూరుస్తున్నారు. మరి మూగ జీవాల పరిస్థితి ఏమిటి? ఈ విషయంపైనే రెండు రోజుల క్రితం కేంద్రప్రభుత్వం కూడా రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. వీధి కుక్కలకు రెండు మూడు రోజుల పాటు ఆహారం అందకపోతే మానసిక స్థితి కోల్పోతాయని, వాటికి రేబిస్ వ్యాధి సోకి పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తూ మనుషులపై దాడి చేసే అవకాశం ఉందని పేర్కొంది. దీన్ని నివారించాలంటే ప్రభుత్వం లేదా స్వచ్ఛంద సంస్థల సహకారంతో మూగ జీవాల ఆకలి కూడా తీర్చాలని కోరింది. ప్రభుత్వంతో పాటు జంతు సంరక్షణ సంఘాలు కూడా ఈ విషయంపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నాయి. ఇప్పటి వరకు వీధి కుక్కలు చికెన్ దుకాణాలు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల వద్ద మిగిలిన ఆహారం తింటూ పొట్ట నింపుకొంటున్నాయి. ప్రస్తుతం లాక్‌డౌన్ కారణంగా ఇవేమి మనుగడలో లేవు. కాబట్టి ఆహారం, నీటి కొరతతో ప్రమాదం తలెత్తనుందని కేంద్రం హెచ్చరించింది.

## రాష్ట్రంలోనూ గరీబ్ కల్యాణ్ బీమా

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కరోనా బారిన పడిన వారికి సేవలందిస్తున్న వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలకు కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన'ను రాష్ట్రంలోనూ అమలు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ పథకం కింద ఆరోగ్య కార్యకర్తలకు రూ.50 లక్షల బీమాను వర్తింపజేయనున్నారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా పేషంట్లకు సేవలందిస్తున్న వైద్యులు, నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు ప్రమాదవశాత్తు కొవిడ్-19 బారిన పడి మరణిస్తే ఈ బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విధి విధానాలే రాష్ట్రంలోనూ అమలవుతాయని పేర్కొన్నారు. ఈ పథకం కాల వ్యవధి 90 రోజులుగా నిర్ణయించారు.




అపస్మారక స్థితిలో ఉన్న వీరేశ్, వెంకటేశ్

## వికటించిన ప్రయోగం

▸▸ సొంతంగా మద్యం తయారీ.. తాగిన ఒకరి మృతి

▸▸ మరో ఇద్దరి పరిస్థితి విషమం.. ముగ్గురు సేఫ్



నవీన్‌మూర్తి(ఫైల్)

ఇరగవరం/తణుకు రూరల్, మార్చి 31: ఆరుగురు స్నేహితులు కలిసి సొంతంగా మద్యం తయారు చేసుకుని ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. అది తాగి ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలంలో చోటుచేసుకుంది. వేల్పూరుకు చెందిన ధర్నాల నవీన్ మూర్తి (22), అల్లాడి వెంకటేశ్, కావలిపురానికి చెందిన పండూరి వీరేశ్, తణుకు దుర్గారావు, వెంకట దుర్గాప్రసాద్, విప్పర్తి శ్యాంసుందర్ ఆదివారం పార్టీ చేసుకుందామనుకున్నారు. ఐసోప్రొఫైల్ ఆల్కహాల్, దానిలో గ్లిజరిన్, హైడ్రోపెరాక్సైడ్ కలిపి ఒక ద్రావణంగా తయారు చేశారు. వారంతా ఆదివారం రాత్రి ద్రావణాన్ని తాగి ఎవరింటికి వారు వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి నవీన్‌కు కడుపులో మంట రావడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. వీరేశ్, వెంకటేశ్‌లకు కడుపులో విపరీతమైన మంట రావడంతో మంగళవారం రాత్రి తణుకులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

## ఇది.. మామూలు జ్వరం లాంటిదే!

▸▸ భయం వద్దు.. వదంతులు నమ్మొద్దు

▸▸ కరోనా మహమ్మారి నుంచి బయపడిన

బెంగళూరు వాసి రాఘవ స్వగతం

బెంగళూరు, మార్చి 31: ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా(కొవిడ్-19) మహమ్మారిపై అనేక వదంతులు హల్‌చల్ చేస్తున్నాయి. కరోనా సోకితే ఇక తగ్గదని, మరణం ఖాయమని ప్రజలు భయపడుతున్నారు. అయితే, ఇలాంటివన్నీ వదంతులేనని, స్వీయ నియంత్రణ, కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే కరోనాను జయించడం పెద్దకష్టమేమీ కాదని అంటున్నారు కరోనా మహమ్మారి నుంచి కోలుకున్న బెంగుళూరు వాసి వెంకట రాఘవ. "నేను కొన్నాళ్ల కిందట లండన్‌లోని హీత్రూ విమానాశ్రయం మీదుగా లాస్‌ఏంజెలస్ వెళ్లాను. ఆ సమయంలో వివిధ దేశాల ప్రయాణికులను కలిశాను. మార్చి 8న బెంగళూరుకు చేరుకున్నాను. ఆ సమయంలో నాలో జ్వరం లక్షణాలు కనిపించాయి. అదేరోజు ఆస్పత్రికి వెళ్లి నమూనాలు ఇచ్చాను. కొవిడ్-19 పాజిటివ్ వచ్చింది. హీత్రూవిమానాశ్రయంలోనే కరోనా వైరస్ సోకి ఉంటుందని అనుకుంటున్నాను. తర్వాత రోజు నుంచి ఐసోలేషన్ సెంటర్‌లో గడిపాను. వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకున్నాను. ఎక్కడా అధైర్య పడలేదు. ప్రస్తుతం చేసిన పరీక్షల్లో కొవిడ్-19 నెగిటివ్ వచ్చింది. అంతేకాదు, నా కుటుంబ సభ్యులకు కూడా నెగిటివ్ రావడం సంతోషంగా ఉంది. ఇప్పుడు నా ఆరోగ్యం బాగానే ఉంది. నిజానికి కొవిడ్-19 సాధారణ వైరల్ జ్వరం లాంటిదే. కాకపోతే, ఐసోలేషన్‌లో ఉండడం, వ్యక్తిగత జాగ్రత్తలు, సంరక్షణ చాలా ముఖ్యం" అని ఆయన వివరించారు.

# యోగనిద్రలో మోదీ

**ఒత్తిడి నుంచి దూరం చేసే ఆసనం అంటూ ట్విటర్‌లో వీడియో**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం యోగనిద్ర అభ్యాస వీడియోను ట్విటర్‌లో షేర్ చేశారు. ఈ యోగాసనాన్ని అభ్యసించడం వల్ల ఒత్తిడి నుంచి దూరం చేసుకోవచ్చని.. తాను వారంలో రెండుసార్లు యోగనిద్ర చేస్తానని ఆయన చెప్పారు. లాక్‌డౌన్ నేపథ్యంలో మీరు ఫిట్‌గా ఎలా ఉంటారని సోమవారం నాటి 'మన్‌కీ బాత్'లో ఓ ప్రశ్న రాగా.. దానికి మోదీ సమాధానమిస్తూ "రేపు వీడియో అప్‌లోడ్ చేస్తాను" అని సమాధానమిచ్చారు. ఆ మేరకు మంగళవారం "యోగ నిద్ర" ఆసనాన్ని అభ్యసిస్తూ.. ఆ వీడియో యూట్యూబ్ లింకును షేర్ చేశారు.

**అది అద్భుతం: ఇవాంక**

యోగనిద్ర ఆసనాన్ని షేర్ చేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు ఇవాంకా.. ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. "అది అద్భుతం.. వీడియో షేర్ చేసినందుకు ధన్యవాదాలు" అని ఆమె ప్రధాని మోదీకి ట్విటర్‌లో రిప్లై ఇచ్చారు.



# ఢిల్లీ లింక్‌తో బెంబేలు

**85మంది మిస్సింగ్: అంజద్ బాషా**

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఢిల్లీలో నిర్వహించిన సమావేశాలకు రాష్ట్రం నుంచి ఎంతమంది వెళ్లొచ్చారనే విషయమై స్పష్టత రావడం లేదు. అధికారులు 369మంది వెళ్లారని ఒకసారి, 700మంది అని మరోసారి చెబుతున్నారు. అంతకంటే ఎక్కువ సంఖ్యలోనే ఢిల్లీ వెళ్లి వచ్చినట్లు తెలుస్తోంది. ఇలాంటివారు గుంటూరు రేంజ్ పరిధిలో 365మంది ఉన్నట్లు సమాచారం. వీరిలో ఇంకా 50మందికి పైగా గుర్తించాల్సి ఉంది. కృష్ణాజిల్లాలో 43మంది ఢిల్లీ సమావేశానికి హాజరయ్యారు. అక్కడినుంచి 42మంది తిరిగి వచ్చినట్లు అధికార యంత్రాంగం గుర్తించింది. మరొకరి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రకాశం జిల్లాలో ఢిల్లీ వెళ్లివచ్చిన 131మందిని క్వారంటైన్‌కు తరలించారు. విశాఖ నుంచి 14మంది ఉన్నట్లు తేల్చారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి 27మంది ఢిల్లీ వెళ్లగా ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. అనంతపురం జిల్లా నుంచి 73మంది ఢిల్లీ వెళ్లారు. 12మంది అక్కడే ఉండగా, మిగిలిన వారంతా జిల్లాకు చేరుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 24మందిని ఏలూరు ప్రభుత్వ ప్రధానాస్పత్రి ఐసోలేషన్ వార్డులో చేర్చారు. కర్నూలు జిల్లాకు వచ్చిన 189మందిని రాయలసీమ వర్సిటీ క్వారంటైన్ కేంద్రానికి, ఇద్దరిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డుకు తరలించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి 18మంది వెళ్లగా 12మందిని ఎచ్చెర్ల క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. ముగ్గురు ఢిల్లీలోనే ఉండిపోయారు. ఒడిశాలోని కోరాపుట్ వెళ్లిన వ్యక్తితో పాటు మరో ఇద్దరి ఆచూకీ తెలియలేదు. ఢిల్లీ సమావేశాలకు వెళ్లినవారిలో విజయనగరం జిల్లాకు చెందిన మరో ముగ్గురిని అధికారులు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ఐసోలేషన్‌కు తరలించారు. రాష్ట్రం నుంచి ఢిల్లీ వెళ్లి వచ్చినవారు స్వచ్ఛందంగా తమ వివరాలు తెలియజేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి మొహమ్మద్ ఇలియాజ్ రిజ్వీ కోరారు.

**మొత్తం 711 మంది: అంజద్ బాషా**

ఢిల్లీ ఇస్తిమాలో పాల్గొన్న ముస్లింలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి సహకరించాలని ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా పిలుపునిచ్చారు. ఏపీ నుంచి 711మంది ఈ ప్రార్థనలకు హాజరయ్యారన్నారు. వీరిలో 626 మందిని క్వారంటైన్‌కు తరలించామని ఇంకా 85మంది ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు.

# ఆపరేషన్ మర్కజ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలకు వెళ్లారు. ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన వారిలో కొందరు ఆధ్యాత్మిక సమావేశాలు నిర్వహిస్తూ మరికొన్ని ప్రాంతాల్లో తిరిగారు. ఇలా ఢిల్లీలో మొదలైన 'వైరస్' దేశంలో అనేక ప్రాంతాలకు విస్తరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, అసోం, మణిపూర్, కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో కరోనా వైరస్ సోకిన వారికి 'ఢిల్లీ కనెక్షన్' బయటపడింది. తాజాగా అండమాన్‌కు చెందిన తొమ్మిది మందికి వైరస్ సోకినట్లు తేలింది. వీరు రెండు విమానాల్లో ఢిల్లీ నుంచి అండమాన్‌కు వచ్చారు. దీంతో ఆ విమానాల్లో ప్రయాణించిన వారిని కూడా గుర్తించి... మొత్తం 1800 మందిని క్వారంటైన్‌కు పంపించారు. తమిళనాడులో ఒకేరోజు 57 పాజిటివ్ కేసులు బయటపడగా, వీరిలో 45 మంది మర్కజ్ సమావేశాలకు హాజరైన వారే కావడం గమనార్హం. ఢిల్లీలో కరోనా కేసుల సంఖ్య 97కు చేరుకోగా... ఇందులో 24 మర్కజ్ సమావేశాల్లో పాల్గొన్న వారేనని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇదే సమావేశాల్లో పాల్గొన్న ఇండొనేషియా వాసుల్లో 10 మందికి కరోనా నిర్ధారణ అయ్యింది. వీరు ఢిల్లీ నుంచి రైలులో తెలంగాణకు వచ్చి కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. తాజాగా అన్ని రాష్ట్రాల్లో నిజాముద్దీన్ మర్కజ్ సమావేశాల్లో పాల్గొన్న వారిని, వారితో సన్నిహితంగా మెలిగిన వారినీ గుర్తించి పరీక్షలు నిర్వహించే పనిలో పడ్డారు. వివిధ రాష్ట్రాల నుంచి మర్కజ్‌కు హాజరైన వారిలో ఇప్పటికి 2137 మందిని క్వారంటైన్‌కు పంపించినట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది.

**ఉల్లంఘన క్రమమిది...**

మార్చి 22న జాతీయ స్థాయిలో 'జనతా కర్ఫ్యూ' పాటించారు. అప్పటికే దేశమంతా కరోనా గుప్పిట చిక్కుకుంటున్న సంకేతాలు స్పష్టంగా కనిపించాయి. అప్పుడు కూడా మర్కజ్‌లో దేశవిదేశాలకు చెందిన 2వేల మంది ఉన్నారు. 23న 1500 మంది ఖాళీ చేశారు. 25 నుంచి 3 వారాల లాక్‌డౌన్ అమలులోకి వచ్చింది. ఆ సమయానికి వెయ్యి మంది మర్కజ్‌లో బృందాలుగా బస చేసినట్లు గుర్తించారు. ఆదివారం రాత్రి రాష్ట్ర-కేంద్ర బలగాలు రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాయి. అక్కడున్న వారిని ఆస్పత్రులకు, క్వారంటైన్‌కు తరలించాయి. మర్కజ్‌కు చెందిన 824 మంది విదేశీయులు మార్చి 21 నాటికి భారత్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్నారు. మరో 2,100 మంది భారతీయ సభ్యులు కూడా పలు చోట్ల పర్యటిస్తున్నారు. ఒకవైపు ప్రపంచాన్ని కరోనా కలవర పెడుతున్నప్పటికీ... దేశ రాజధానిలో వందల మందితో సమావేశాలు జరుగుతుంటే పోలీసులు యంత్రాంగం గుర్తించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాము ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని నిజాముద్దీన్ వెస్ట్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ మహమ్మద్ ఉమర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి సమావేశాలు నిర్వహించారంటూ తబ్లీగ్-ఏ-జమాత్‌కు చెందిన మౌలానా సాద్‌తోపాటు ఇతర సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మర్కజ్ నుంచి 1033 మందిని ఖాళీ చేయించారు. వీరిలో 334 మంది ఆస్పత్రుల్లో, 700 మందిని క్వారంటైన్‌లకు తరలించారు. పర్యాటక వీసాలపై భారత్‌కు వచ్చి... నిబంధనలకు విరుద్ధంగా మతసంబంధ కార్యక్రమాల్లో పాల్గొన్న విదేశీయులను 'బ్లాక్ లిస్టు'లో పెడతామని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. బ్లాక్‌లిస్టులో ఉన్నవారు ఇకముందెన్నడూ భారత్‌కు వచ్చే అవకాశం ఉండదు. నేపాల్ (19), మలేషియా (20), మయన్మార్ (33), కిర్గిస్థాన్ (28), ఇండొనేషియా (72), థాయ్‌లాండ్ (71), శ్రీలంక (34), బంగ్లాదేశ్ (19), ఇంగ్లండ్ (4), ఫిజీ (4)తోపాటు ఫ్రాన్స్, అల్జీరియా, దిబౌటి, సింగపూర్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పున మర్కజ్ సమావేశాలకు హాజరయ్యారు.

## ఆంక్షలను ఉల్లంఘించలేదు: మర్కజ్

కరోనా నేపథ్యంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలను తాము ఏ దశలోనూ ఉల్లంఘించలేదని మర్కజ్ నిజాముద్దీన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. "మార్చి 22న జనతా కర్ఫ్యూ గురించి ప్రధాని ప్రకటించగానే సమావేశాలను నిలిపివేశాం. అంతకుముందే... ఢిల్లీ ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. బస్సులు, రైళ్లు ఆగిపోయాయి. వచ్చిన వారు తిరిగి వెళ్లే మార్గం కనిపించలేదు. అప్పటికీ, ఈనెల 23న 1500 మంది ఏ వాహనం దొరికితే అది ఎక్కి ప్రయాణమయ్యారు. మిగిలిన వారికి ఇక్కడ బస కల్పించక తప్పలేదు. మర్కజ్‌ను ఖాళీ చేయించాలని అధికారులు 24న నోటీసులు ఇచ్చారు. వాహనాలకు పాస్‌లు ఇస్తే ఖాళీ చేయించి, వారి స్వస్థలాలకు పంపిస్తామని సమాధానం ఇచ్చాం. 17 వాహనాల నెంబర్లు, డ్రైవర్ల వివరాలను కూడా అందించాం. కానీ... ఇప్పటిదాకా మాకు సమాధానం రాలేదు" అని పేర్కొంది.

## ఇస్లాం చైతన్యానికి..!

న్యూఢిల్లీ, మార్చి 31: మర్కజ్ నిజాముద్దీన్ ఢిల్లీలోని ఓ మసీదు ప్రాంగణం. వందేళ్లుగా ఇస్లాం మత చైతన్యం కోసం పనిచేస్తున్న తబ్లిగీ జమాత్ అనే సంస్థకు అంతర్జాతీయ ప్రధాన కేంద్రం దక్షిణ ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉంది. ఈ సంస్థకు పాకిస్థాన్, బంగ్లాదేశ్ సహా ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లో విశ్వాసులు ఉన్నారు. ఢిల్లీకి 100 కి.మీ. దూరంలో హరియాణాలోని మేవాట్ జిల్లాలో మౌలానా మహమ్మద్ ఇల్యాసీ అనే మత బోధకుడు 1926లో తబ్లిగీ జమాత్‌ను ఏర్పాటు చేశారు. హనఫీ సున్నీలకు చెందిన దియోబందీ విధానంలో భాగమిది. గ్రామాల్లోని తోటి ముస్లింలలో మత నిబద్ధతను పెంచేందుకు ఇల్లిల్లూ తిరిగి ప్రచారం చేసే కార్యకర్తలకు ఈ సంస్థ శిక్షణ ఇస్తుంది. ఈ సంస్థను రష్యా సహా పలు దేశాలు నిషేధించాయి. బ్రిటన్‌లోని గ్లాస్‌గోవ్ విమానాశ్రయంపై ఉగ్రదాడికి విఫలయత్నం చేసిన భారతీయుడు కఫీల్ అహ్మద్ ఈ సంస్థను అవలంబించే వాడేనని జీటీవీ పేర్కొంది. మర్కజ్‌లో రెండేళ్లకోసారి అంతర్జాతీయ సమావేశం జరుగుతుంది. రెండు వారాల క్రితం జరిగిన సమావేశంలో భారత్ నలుమూలల నుంచి 8000 మంది, విదేశాల నుంచి 250 మంది బ్యాచ్‌ల వారీగా పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిసా, ఉత్తరప్రదేశ్‌వారు వచ్చారు. వారిలో వందల మందికి కరోనా వైరస్ సోకింది. ఆ విషయం తెలియకుండానే ఎవరికి వారు సొంత రాష్ట్రాలకు వెళ్లిపోయారు. తమ తమ రాష్ట్రాల్లో మసీదుల్లో, ఇళ్లలో సమావేశాలు నిర్వహించారు.

# 'మర్కజ్'కు వెళ్లలేదు!

- **లాయర్లతో మాట్లాడేందుకు నెల కిందట ఢిల్లీకి!**
- **ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా స్పష్టీకరణ**



కడప, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన మర్కజ్ నిజాముద్దీన్ సమావేశాల్లో తాను పాల్గొనలేదని ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ప్రచారమైన వార్తల్లో నిజం లేదని ఆయన తెలిపారు. "మార్చి 2వ తేదీన ఢిల్లీకి వెళ్లాను. ఒక కేసు విషయంలో సుప్రీంకోర్టు న్యాయవాదులను కలిశాను. మర్కజ్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న దర్గాకు వెళ్లి ప్రార్థనలు చేశాను" అని తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు 15, 16వ తేదీల్లో మర్కజ్ సమావేశాల్లో పాల్గొన్నారని... తాను 2వ తేదీన ఢిల్లీకి వెళ్లి మరుసటి రోజునే తిరిగి వచ్చానని చెప్పారు. 4వ తేదీన క్యాబినెట్ సమావేశంలో పాల్గొన్నానని... 5వ తేదీ నుంచి కడపలోనే ఉన్నానని అంజద్ బాషా 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

## స్థానిక వ్యాప్తే... సామాజిక వ్యాప్తి కాదు

న్యూఢిల్లీ, మార్చి 31: భారత్‌లో కరోనావైరస్ "పరిమిత సామాజిక వ్యాప్తి" దశకు చేరకుందని వైద్య ఆరోగ్యశాఖ ఇచ్చిన నివేదిక కలకలం రేపడంతో కేంద్రం మంగళవారంనాడు దానిపై వివరణ ఇచ్చింది. ఆ పదప్రయోగం సాధారణంగా ప్రభుత్వ నోట్‌లలో వినియోగించేదే (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌లో భాగంగా ఇచ్చినదే) తప్ప అది చూసి ఆందోళన చెందాల్సిన పనిలేదని పేర్కొంది. 'ప్రస్తుతం వైరస్ లోకల్ (స్థానిక) వ్యాప్తి దశలో ఉంది తప్ప సామాజిక వ్యాప్తి దశకు చేరుకోలేదు' అని వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు.

## కొందరు సహకరించడం లేదు: లవ్ అగర్వాల్

న్యూఢిల్లీ, మార్చి 31: దేశంలో కరోనా వైరస్ కేసులు పెరగడానికి కారణం కొన్ని ప్రాంతాల్లో ప్రజలు సహకరించకపోవడమేనని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి లవ్ అగర్వాల్ అన్నారు. ముఖ్యంగా ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ ప్రాంతాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. 24 గంటల్లో దేశంలో 227 కొత్త కేసులు నమోదయ్యాయని చెబుతూ కొన్ని ప్రాంతాల్లో ప్రజల సహకారం లేకే కేసులు ఇంతలా పెరిగాయని ఆయన చెప్పారు. ఒక్క వ్యక్తి చేసిన తప్పుతో అనేక మందికి వైరస్ సోకి భారీ నష్టం కలిగిస్తుందని హెచ్చరించారు. కరోనాపై సమష్టిగా పోరాడాలని, ప్రతి ఒక్కరూ భౌతిక దూరం, ఇతర మార్గదర్శకాలు పాటిస్తూ సహకరించాలని కోరారు. ఒక్క నిజాముద్దీన్ మర్కజ్‌లోనే 24 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇటీవల అక్కడ అనుమతిలేకుండా మత ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల్లో పాల్గొన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు కరోనా బారినపడ్డారు. మర్కజ్‌లోనే ఒకరి నుంచి మరొకరికి కరోనా సోకినట్లు గుర్తించారు.

## ప్రజలందరికీ ఉచిత కరోనా పరీక్షలు!

న్యూఢిల్లీ, మార్చి 31: దేశవ్యాప్తంగా ప్రజలందరికీ కరోనా పరీక్షలు ఉచితంగా నిర్వహించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక వ్యాజ్యం దాఖలయ్యింది. న్యాయవాది శశాంక్ దేవ్‌సుధీ మంగళవారం ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. సామాన్యులకు ప్రభుత్వ ఆస్పత్రులు, ల్యాబ్‌లలో కరోనా పరీక్షలు చేయించుకోవడం సాధ్యం కాదని, అటు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి భారీగా ఫీజు చెల్లించి పరీక్షలు చేయించుకోలేరని పిటిషనర్ పేర్కొన్నారు. కాగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో 88 నగరాలలో వాయు కాలుష్యం కనిష్ఠస్థాయికి చేరింది.

## మహారాష్ట్రలోనూ జీతాలు కట్

ముంబై, మార్చి 31: కరోనా కల్లోలంతో ఆర్థిక ఒడిదుడుకులు ఎదురవుతున్న నేపథ్యంలో.. ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల జీతాల్లో కోత విధించాలని మహారాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి అజిత్‌పవార్ మంగళవారం ప్రకటించారు. సీఎం నుంచి సర్పంచ్ దాకా అందరు ప్రజాప్రతినిధుల జీతాల్లో 60% కోత ఉంటుందని పేర్కొన్నారు. ఈ కోత క్లాస్-1, 2 ఉద్యోగులకు 50%, క్లాస్-3 ఉద్యోగులకు 25శాతంగా ఉంటుందని వివరించారు.

## గొంతు విని.. వైరస్‌ను పట్టేస్తుంది!

న్యూఢిల్లీ, మార్చి 31: మీ గొంతు విని కొవిడ్-19 సోకిందా లేదా అన్నది అంచనా వేసే యాప్ ఒకటి.. మీరు కరోనా వైరస్ క్యారియర్లకు సమీపంలో ఉన్నారా అనే విషయాన్ని తెలిపే యాప్ మరొకటి.. ఇజ్రాయెల్‌లో ఇప్పుడు ఇలాంటి వివిధ రకాల యాప్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. దేశంలో 4000కు పైగా కరోనా పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో స్టార్టప్ నేషన్ సెంట్రల్ అనే స్వచ్ఛంద సంస్థ వైరస్‌పై పోరుకు 70 టెక్నాలజీ కంపెనీలతో ఓ డైరెక్టరీని ఏర్పాటు చేసింది.

## కేరళలో 'లిక్కర్' పాస్‌లు

రువనంతపురం, మార్చి 31: లాక్‌డౌన్‌తో మద్యం దొరక్క వ్యసనపరులు విపరీతంగా ప్రవర్తిస్తుండటం, ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడటంతో కేరళ ప్రభుత్వం ఓ 'ప్రత్యేక' నిర్ణయం తీసుకుంది. వైద్యుల ప్రిస్కిప్షన్/రిఫరెన్స్ తోడుగా మందుబాబులు మద్యం కొనుక్కునేందుకు అనుమతిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువరించింది.

## కరోనాపై పోరులోకి ఐఐటీలు

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కరోనాపై భారత్ చేస్తున్న పోరాటంలో ఐఐటీలు కూడా కీలక భాగస్వాములుగా మారాయని ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్ ప్రొఫెసర్ రామగోపాల్ రావు పేర్కొన్నారు. కరోనా వైరస్‌పై పరీక్షలు చేయడమే కాక, దాన్ని తట్టుకుని పరికరాలను, దుస్తులను రూపొందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం తమ ప్రతిపాదనలు కేంద్ర మానవ వనరుల శాఖతో చర్చల దశలో ఉన్నట్లు ఆయన 'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధికి వెల్లడించారు. ఫెబియోసిస్ ఇన్నోవేషన్స్ అనే స్టార్టప్ సంస్థను సంస్థలోని ఆచార్యులు, విద్యార్థులు కలిసి ప్రారంభించామని.. కేవలం రెండే గంటల్లో 99.99శాతం బాక్టీరియాను రూపుమాపే వస్త్రాన్ని ఈ సంస్థ తయారు చేస్తోందని ఆయన వివరించారు. ఐఐటి-గౌహతి డాక్టర్లకు, నర్సులకు వ్యక్తిగత రక్షణ ఉపకరణాలను రూపొందించేందుకు ముందుకు వచ్చిందని, ఐఐటి కాన్పూర్ అయితే తక్కువ ఖర్చుతో (రూ.70 వేలు) కూడిన వెంటిలేటర్లను రూపొందించిందని ఆయన గుర్తు చేశారు. ఐఐటి-హైదరాబాద్ వెంటిలేటర్లకు ప్రత్యామ్నాయంగా ఒక బ్యాగ్ వాల్వ్ తో కూడిన మాస్కు ను రూపొందించిందని, ఐఐటి ముంబై కొవిడ్ పేషంట్లను, కేసులను కనిపెట్టే యాప్‌ను రూపొందించిందని ఆయన తెలిపారు.

## కరోనా కట్టడికి 42 ఔషధాలు: నోవాలీడ్ ఫార్మా

ముంబై, మార్చి 31 : కరోనాను కట్టడి చేసే వ్యాక్సిన్ రేసులో ఫార్మా కంపెనీలన్నీ పోటీపడుతుంటే.. పుణెకు చెందిన ఓ స్టార్టప్ మాత్రం '42 మందులు ఉన్నాయిగా' అంటోంది. కరోనా రోగుల చికిత్సకు అందుబాటులో ఉన్న 42 రకాల ఔషధాలు ప్రభావవంతంగా ఉపయోగపడతాయని 'నోవా లీడ్ ఫార్మా' చెబుతోంది.




# ఆగని మృత్యు హేల

**8.3 లక్షలకు పైగా కేసులు... 41వేల మరణాలు**

మాడ్రిడ్, మార్చి 31: ప్రపంచవ్యాప్తంగా కొవిడ్-19 తన మృత్యువిహారాన్ని కొనసాగిస్తూనే ఉంది. తాజాగా కేసులు 8.3 లక్షలు దాటగా, మరణాల సంఖ్య 41వేలకు పెరిగాయి. వైరస్ ఉగ్రరూపం అమెరికాతో పాటు స్పెయిన్, ఇటలీ, ఇరాన్, బెల్జియం, నెదర్లాండ్స్ కళ్లకు కడుతోంది. స్పెయిన్‌లో ఒక్క రోజే ఏకంగా 849 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం మరణాల సంఖ్య 8500 కు చేరుతోంది. కేసులు ఇప్పటికే లక్షకు చేరువగా ఉన్నాయి. అయితే వారం క్రితం కంటే ప్రస్తుతం కేసుల నమోదు సంఖ్య 2% తగ్గిందని ప్రభుత్వం వెల్లడించింది. ఇటలీలో పరిస్థితి ఇంకా తీవ్రంగానే ఉండడంతో లాక్‌డౌన్‌ను మరో 12 రోజులు పొడిగించారు. మృతుల సంఖ్య 12వేలు దాటిపోయింది. అయితే కేసుల సంఖ్య ఫిబ్రవరి 21న తొలి కేసు వచ్చినప్పటి కంటే క్రమేణా తగ్గుతోందని ప్రభుత్వం చెబుతోంది. మృతులకు నివాళిగా మంగళవారం నాడు ఇటాలియన్లు ఒక నిమిషం మౌనం పాటించారు. జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. ఇటలీకి సంఘీభావం ప్రకటిస్తూ వాటికన్ సిటీ కూడా తన పతాకాన్ని అవనతం చేసింది. బ్రిటన్‌లో పరిస్థితి గడ్డుగా మారింది. ఒక్క రోజులోనే 381 మంది మరణించారు. మొత్తం మరణాల సంఖ్య 1800కు పెరగడంతో - ఇటలీ, అమెరికా మాదిరిగా బ్రిటన్‌లో కూడా 'వెంటిలేటర్ రేషనింగ్' మొదలుపెట్టారు. 'ఖచ్చితంగా కోలుకుంటారు అన్న వారికి మాత్రమే వెంటిలేటర్ అమరుస్తాం' అని లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీ ఎన్‌హెచ్‌ఎస్ ట్రస్ట్ స్పష్టం చేసింది. మరోవైపు- డెన్మార్క్, ఆస్ట్రేలియాల్లోనూ కేసుల తీవ్రత తగ్గుతోందని ప్రాథమికంగా అంచనాకొచ్చారు. భౌతిక దూరం పాటించడంలో దేశప్రజలు విశేష క్రమశిక్షణ చూపారని, త్వరలోనే ఆంక్షల్ని సడలించాలని యోచిస్తున్నామని డెన్మార్క్ ప్రధాని తెలిపారు. ఇరాన్‌లో ఒక్కరోజులో 141 మంది చనిపోగా కేసుల సంఖ్య 45వేలకు పెరిగింది.

**అంతిమ 'యాత్ర' నిషేధం**

కొవిడ్-19 మారణ హోమం సృష్టిస్తుండడంతో స్పెయిన్ ప్రభుత్వం చనిపోయినవారిని ఊరేగింపుగా తీసుకెళ్లడాన్ని నిషేధించింది. ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే శవపేటికల వెంట వెళ్లాలని, ఖననాల వద్ద కూడా ముగ్గురు మించి ఉండరాదని ఆంక్ష పెట్టింది.

**ఇటలీ డాక్టర్లకు పెనుభారం**

ఇటలీలో ఓ రకమైన మానవీయ సంక్షోభం నెలకొంది. దేశ వైద్య ఆరోగ్య రంగంపై ఎన్నడూ లేనంత ఒత్తిడి పెరగిపోవడంతో అటు చికిత్సలు చేయలేక- ఇటు ప్రాణాలు కాపాడుకోలేక డాక్టర్లు, నర్సులు నలిగిపోతున్నారు. ఫిబ్రవరిలో తొలి కొవిడ్ పేషెంట్ నమోదైనప్పటి నుంచీ నేటి దాకా సుమారు 11,250 మంది నర్సులు, పారామెడికల్ సిబ్బందికి వైరస్ సోకింది. ఇందులో వందల మంది మరణించారు. 71 మంది డాక్టర్లు కూడా చికిత్సలు చేస్తూ ప్రాణాలు కోల్పోయారు.

## ప్రతి నలుగురిలో ముగ్గురు లాక్‌డౌన్‌లోనే!

**అమెరికాలో కొలువులు కోల్పోనున్న 4.7కోట్లమంది**

వాషింగ్టన్, మార్చి 31: అమెరికాలో కరోనా శరవేగంగా ప్రబలుతోంది. తాజాగా మేరీలాండ్, వర్జీనియా, అరిజోనా, టెన్నెసీ రాష్ట్రాలు లాక్‌డౌన్‌ను విధించాయి. దేశంలోని 50 రాష్ట్రాలకు గాను.. 32 రాష్ట్రాలు పూర్తి లాక్ డౌన్‌లో ఉన్నాయి. ఈ చర్యలతో అమెరికాలోని ప్రతి నలుగురిలో ముగ్గురు ఏదో ఒక విధమైన లాక్‌డౌన్‌లో ఉంటారని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో ఇప్పటివరకూ 1,63,000 కేసులు పాజిటివ్‌గా తేలాయి. 3వేలమందికి పైగా కన్నుమూశారు. ప్రస్తుతం దేశంలోని 2.45కోట్ల మంది ఇళ్లకే పరిమితం కాగా, కరోనా విలయతాండవం ముగిసేసరికి దేశంలో 4.7కోట్ల మంది నిరుద్యోగులవుతారని ఫెడరల్ రిజర్వ్ అంచనా వేస్తోంది.

# హెచ్1బీ గుబులు

**విదేశీ ఉద్యోగులపైనే ప్రభావం**




- **భారతీయులకు కష్టకాలమే**
- **లక్ష ఉద్యోగాలు గల్లంతే**
- **అమెరికాలో ఆర్థిక మాంద్యానికి అవకాశం**
- **హెచ్చరిస్తున్న నిపుణులు**

అగ్రరాజ్యం అమెరికాను కరోనా వైరస్ కమ్మేస్తోంది. ఇది ఆ దేశ ఆర్థిక పరిస్థితిపై పెను ప్రభావం చూపనుంది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో అమెరికాలో ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశం కనిపిస్తోంది. పలు కంపెనీలు తమ నష్టాలను పూడ్చుకునేందుకు ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునే అవకాశం ఉంది. అమెరికాలో ఆర్థికమాంద్యం తలెత్తితే లక్ష ఉద్యోగాలు పోవడం తథ్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావం విదేశీ ఉద్యోగులపై ముఖ్యంగా భారతీయులపై ఎక్కువగా ఉండవచ్చంటున్నారు. అమెరికాలో హెచ్1బీ వీసాపై సింహ భాగం భారతీయులే పనిచేస్తుండటమే దీనికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో హెచ్1బీ వీసాపై పనిచేస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ తాము ఉద్యోగం కోల్పోయిన పక్షంలో అమెరికాలో ఉండేందుకు అనుమతించిన కాలపరిమితిని 60 రోజులనుంచి 180 రోజులకు పెంచాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు హెచ్1బీ వీసాదారులు ట్రంప్ సర్కారుకు లేఖ రాసేందుకు సిద్ధమయ్యారు. దీనిపై ఇప్పటికే 20 వేలమంది సంతకాలు చేశారు. ఒక ఫిర్యాదుపై వైట్ హౌస్‌నుంచి స్పందన రావాలంటే ఆ పిటిషన్‌పై కనీసం లక్ష సంతకాలు సేకరించాల్సి ఉంటుంది. దీంతో మరో 80 వేల సంతకాలకోసం హెచ్1బీ వీసాదారులు ప్రయత్నిస్తున్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తూ గ్రీన్‌కార్డు కోసం ఎదురు చూసే భారతీయుల కల ఇప్పట్లో తీరేలా కనిపించడంలేదు. ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డ్ బ్యాక్‌లాగ్ సంఖ్య 2030 నాటికి రెట్టింపు అవుతుందని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. దీనివల్ల భారతీయులైతే గ్రీన్ కార్డు కోసం దశాబ్దాలపాటు ఎదురుచూడక తప్పదని పేర్కొంది.

**సాధారణ స్థితికి వచ్చేది ఎపుడు?**

రానున్న 30 రోజులు ఎంతో కీలకమైనవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ప్రకటించారు. ప్రజలు భౌతిక దూరం పాటించాలని సూచించారు. ఎలా చూసుకున్నా అమెరికా సాధారణ స్థితికి చేరుకోడానికి కనీసం రెండు నుంచి మూడు నెలలు పట్టేలా కనిపిస్తోంది. మరోవైపు.. అమెరికాలో తమ పిల్లలు ఎన్ని కష్టాలు పడుతున్నారో అని భారత్‌లోని తల్లిదండ్రులు కంటి మీద కునుకు లేకుండా బతుకుతున్నారు. పిల్లలకు ప్రతీ రోజూ ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు.

# కరోనా కట్టడిలో మోదీ సర్కారు భేష్



- **ఐఏఎన్ఎస్-సీ ఓటర్ సర్వేలో 83% మంది కితాబు**
- **48.3% మందిలో వైరస్ భయం**

న్యూఢిల్లీ, మార్చి 31: ప్రపంచాన్ని వణికిస్తున్న కొవిడ్-19 సంక్షోభాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సమర్థంగా ఎదుర్కొంటున్నారని ఐఏఎన్ఎస్-సీ ఓటర్ సర్వేలో 83.5 % మంది అభిప్రాయపడ్డారు. "భారత ప్రభుత్వం కరోనా సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొంటోందనే మాటను మీరు అంగీకరిస్తారా?" అనే ప్రశ్నకు.. 'గట్టిగా అంగీకరిస్తున్నాను (స్ట్రాంగ్‌లీ అగ్రీ)' అని 66.4% మంది, 'అంగీకరిస్తున్నాను' అని 17.1% మంది తెలిపారు. వారందరినీ కలిపితే 83.5% మంది. 9.4% మంది మాత్రం దాంతో విభేదించారు. మార్చి 26-27 తేదీల్లో దేశవ్యాప్తంగా 1187 మందిని ప్రశ్నించి ఈ సర్వే నివేదికను వెలువరించారు. ఇంకా ఆ సర్వేలో ఏముందంటే..

- తమకు వైరస్ సోకుతుందనే ఆందోళనలో ఉన్నవారు 48.3% మంది.
- తమకు లేదా తమ కుటుంబసభ్యుల్లో ఒకరికి వైరస్ సోకుతుందని భయపడుతున్నవారు 22% మంది.
- తమకు వైరస్ సోకదన్న ధీమా వ్యక్తం చేసినవారు గతవారం 59.5% మంది ఉండగా.. ఈ సర్వేలో వారి సంఖ్య 46.5 శాతానికి తగ్గింది.
- కరోనా వైరస్ అంశాన్ని అనవసరంగా పెద్దది చేస్తున్నారన్న భావన ఉన్నవారి సంఖ్య గత సర్వేతో (44.3%) పోలిస్తే ఈసారి (15.4%).. ఏకంగా 25.7% మేర తగ్గడం గమనార్హం. వైరస్ గురించి ప్రజల్లో క్రమంగా పెరుగుతున్న భయాందోళనలకు ఇది అద్దం పడుతోంది.
- వచ్చే నెల నాటికి పరిస్థితి మెరుగవుతుందని 57.5% మంది భావించగా.. మరింత దిగజారుతుందని 17.6% మంది అభిప్రాయపడ్డారు.
- నిత్యావసరాల ధరలు పెరిగాయని 60.9% మంది చెప్పారు. 28.7% మంది అదేం లేదన్నారు.
- లాక్‌డౌన్ విజయవంతమైందని 84.9% మంది అభిప్రాయపడగా.. 13.9% మంది విఫలమైందన్నారు.
- కరోనా వైరస్ వ్యాప్తి.. మానవాళికి ప్రకృతి పంపుతున్న సందేశమేనా అనే ప్రశ్నకు 46.7% మంది ఔనని సమాధానమివ్వగా.. 30.6% మంది కాదని చెప్పారు.

## పత్రికలు, చానళ్ల ద్వారానే సమాచారం

కరోనాకు సంబంధించిన సమాచారం కోసం తాము వార్తాపత్రికలు, టీవీచానళ్ల వంటి సంప్రదాయ మీడియాపైనే ఆధారపడ్డామని 74.1% మంది తేల్చిచెప్పారు. కేవలం 18.5 శాతం మంది మాత్రమే కరోనా సమాచారం కోసం సోషల్ మీడియాను ఆశ్రయించారు. 5.2% మంది.. తమ ఇరుగుపొరుగువారి ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్నట్టు చెప్పారు.



## జర్మనీ హోటల్లో థాయ్ రాజు స్వీయ క్వారంటైన్

*కరోనా భయంతో థాయ్‌ల్యాండ్ రాజు మహా వజ్రలాంగ్‌కార్న్, తన భద్రత కోసం దేశం వదిలి వెళ్లిపోయాడు. ఒక్కడే కాదండోయ్.. 20మంది మహిళల్ని తన వెంటబెట్టుకుని.. జర్మనీలోని ఒక స్టార్ హోటల్‌కు చేరుకున్నాడు. ఆ నాలుగు నక్షత్రాలు హోటల్ మొత్తాన్ని అతడొక్కడే బుక్ చేసుకున్నాడు.* - బ్యాంకాక్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com